# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 21 ఏప్రిల్ 2025 ‖ సంపుటి: 9 ‖ సంచిక: 114 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## క్యాన్సర్ అవేర్‌నెస్ రన్

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

...మిగతా 2లో



## భక్తి శ్రద్ధలతో ఈస్టర్

తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొన్ని చోట్ల వివిధ భక్తి కార్యక్రమాలు జరిగాయి.




# హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దుతం

### సాంకేతిక సాయం కోసం కితాక్యూషూ నగర మేయర్‌తో ఒప్పందం

### ఈఎక్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, పీ9ఎల్‌ఎల్సీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూకెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్‌తో ఎంఓయూలు

### సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతున్న సీఎం రేవంత్ టీం జపాన్ పర్యటన





మనం బ్యూరో, హైదరాబాద్‌:

జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కితాక్యూషూ నగరంలో పర్యటించింది. సీఎం బృందానికి ఆ నగర మేయర్ కజుహిసా టకేజీ అక్కడి సంప్రదాయ రీతిలో ఘనంగా స్వాగతం పలికారు. ఒకప్పుడు జపాన్‌లో అత్యంత కాలుష్యంతో ఉన్న నగరం కితక్యూషూ. గాలి, నీరు, నేల విషపూరితంగా ఉండేవి. ఇప్పుడు ఈ నగరం పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఉత్తమ ఉదాహరణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9ఎల్‌ఎల్సీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూకెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదర్చుకుంది. కితాక్యూషూ నగరం మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదు, అవసరం అని అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి,

...మిగతా 2లో

## ఒకే గుడి ఒకే బావి ఒకే శ్మశానం

### కుల భేదాలకు స్వస్తి పలకాలె

అన్ని వండుగలను సామూహికంగా నిర్వహించడం కీలకం

హిందూ సమాజానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపు



ఢిల్లీ, ఏప్రిల్ 20: కుల భేదాలకు స్వస్తి పలకాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. 'ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక' అనే సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలని సూచించారు. దీన్ని పాటిస్తూ సామాజిక సామరస్యానికి కృషి చేయాలని కోరారు. అలీగఢ్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న మోహన్ భగవత్ అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. 'ప్రపంచవ్యాప్తంగా శాంతి సాధించడానికి ముందుగా.. భారతదేశం

...మిగతా 2లో

## నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్ధలైన రోజు..

### ఇంద్రవెల్లి అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్,మనం బ్యూరో: ఇంద్రవెల్లి అమరవీరులకు సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. అడవి బిడ్డల త్యాగాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. 4 దశాబ్దాల నిర్బంధం బద్దలైన రోజు ఇదని గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం అడవి బిడ్డలు స్వేచ్ఛగా రెక్కలు విచ్చుకుంటున్నారని తెలిపారు. నాకు అండగా నిలిచి దండుగా కదిలిన అడవి బిడ్డలకు తానెప్పుడూ తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. తన విజయం కోసం ఇంద్రవెల్లి కొండల్లో దండుగా కదిలిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా ఉండాలని తాను నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. జల్ జంగల్ జమీన్ అంటూ హక్కుల కోసం అసువులు బాసిన అడవి బిడ్డల పోరాటం సదా స్ఫూర్తిదాయకం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

FILE PHOTO



## మహారాష్ట్రలోనూ హిందీకి వ్యతిరేకత?

### 5వ తరగతి వరకూ హిందీ భాషను విధిగా బోధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ముదురుతున్న వివాదం

ముంబై, ఏప్రిల్ 20: ఒకటో తరగతి నుంతి ఐదో తరగతి వరకూ హిందీ భాషను విధిగా బోధించాలంటూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి చుక్కెదురైంది. ఈ నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వ భాషా సంప్రదింపుల కమిటీ ఏకగ్రీవంగా వ్యతిరేకించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని ప్యానల్

...మిగతా 2లో



## దార్శనిక నేత చంద్రబాబు జన్మదిన వేడుకలు

### తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

హైదరాబాద్, మనం ప్రతినిధి:దార్శనిక రాజకీయ నాయకుడు, ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకులను తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్నారు. ఆలయాల్లో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తెలుగు తమ్ముళ్లే కాదు,

...మిగతా 2లో

### నా స్నేహితుడు చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు: మోదీ

ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోడీ 'ఎక్స్' వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "నా స్నేహితుడు చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. భవిష్యత్ రంగాలపై దృష్టి సారించి ఆయన పని చేస్తున్నారు. ఏపీ అభివృద్ధికి అవిశ్రాంతంగా పనిచేస్తున్న చంద్రబాబు పనితీరు ప్రశంసనీయం. ఆయనకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యకరమైన జీవితం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా" అని ప్రధాని ప్రకటించారు.

## టీం శివంగి

తెలంగాణ తొలి మహిళా కమాండో టీంను ఆరంభించిన మంత్రి సీతక్క



2

## సమసిపోతుందా? చర్యల దాకా సాగుతుందా?

స్మితా సభర్వాల్ వివాదం ముగిసేనా?

రాజకీయంగా చర్చనీయాంశమైన సీనియర్ ఐఏఎస్ ట్వీట్లు

మద్దతుగా నిలవలేమంటున్న తోటి ఐఏఎస్‌లు

ప్రభుత్వంపై ధిక్కార ధోరణి దేనికి సంకేతమనే చర్చ

ఆమెపై చర్యలు తీసుకునే యోచనలో ప్రభుత్వం?



హైదరాబాద్, మనం బ్యూరో: కంచ గచ్చిబౌలి భూముల అంశంలో సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ వ్యాఖ్యల వివాదం ఇప్పటికైనా సమసిపోతుందా? ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకునే వరకు

...మిగతా 2లో

## త్వరలో నోటిఫికేషన్

### ఆర్టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీ చేస్తామన్న మంత్రి పొన్నం

హైదరాబాద్, మనం ప్రతినిధి: టీజీఆర్‌టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అతి త్వరలోనే 3,038 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వీటిలో డ్రైవర్-2,000, శ్రామిక్స్-743, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్)-114, డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్)-84, డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్-25, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్)-23, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్-15, సెక్షన్ ఆఫీసర్ (సివిల్)-11, మెడికల్ ఆఫీసర్ (జనరల్)-07, మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్)-07, అకౌంట్స్ ఆఫీసర్-06 పోస్టులు ఉన్నాయని మంత్రి తెలిపారు.

## అమెరికాలో రాజులు లేరు

## అధ్యక్షుడు రాజు కాదు.. ఎన్నికైన వ్యక్తి మాత్రమే

### రాజ్యాంగానికి వ్యతిరేకంగా డొనాల్డ్ పాలన

### ట్రంప్ నిర్ణయాలపై మరోసారి దేశవ్యాప్త నిరసనలు




వాషింగ్టన్, ఏప్రిల్ 20: అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ఆ దేశ ప్రజలు మరోసారి మండిపడ్డారు. దేశవ్యాప్తంగా నగర వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ట్రంప్‌కు ఆయన పాలనావిధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూయార్క్ ప్రధాన గ్రంథాలయం వెలుపల జనం గుమిగూడి.. 'అమెరికాలో

...మిగతా 2లో

## భారత్ వస్తెందుకు ఎదురు చూస్తున్న

### ట్రంప్ దోస్త్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్

ఢిల్లీ, ఏప్రిల్ 20: భారత్ లో పర్యటించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు టెస్లా, స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ శనివారం వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీతో శుక్రవారం ఫోను ద్వారా మాట్లాడటం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎలాన్ మస్క్

...మిగతా 2లో

## ఇంటలెక్చువల్స్ కోసం ప్రపంచం భారత్‌వైపు చూస్తోంది

ప్రముఖ కంపెనీల సారథులంతా భారతీయులే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



2

లక్షల కోట్ల వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టిందెవ్వరు?

# కుల్ భూషణ్‌కు అప్పీల్ చేసుకునే హక్కు లేదు

### అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను వక్రీకరిస్తున్న పాకిస్తాన్

### ఇండియన్ నేవీ అధికారిని కిడ్నాప్ చేసి కేసులో ఇరికించిన దాయాది దేశం



ఢిల్లీ, ఏప్రిల్ 20: గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటూ పాక్ జైల్లో మగ్గుతున్న భారత నౌకాదళ మాజీ అధికారి కుల్ భూషణ్ జాదవ్ విషయంలో 2019లో అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో అతడికి అప్పీల్ చేసుకునే హక్కు ఇవ్వలేదని పాకిస్తాన్ ప్రభుత్వం అంటోంది. 2019 జూన్ లో ఐసీజే భారత్ కు అనుకూలంగా తీర్పు ఇస్తూ జాదవ్ కు కాన్సులర్ యాక్సెస్ హక్కును కల్పించాలని తేల్చిచెప్పింది. ఈ కేసులో అతడికి విధించిన మరణశిక్షను పునఃసమీక్షించాలని పాకిస్థాన్ ను కోరింది. అప్పటి వరకు ఉరిశిక్ష అమలు చేయొద్దని ఆదేశించింది.

అయితే.. 2023 మేలో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టుకు నిరసనగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారని ఆరోపిస్తూ సైనిక కోర్టులు కొందరిని దోషులుగా నిర్ధారించాయి. దీనిని సవాలు చేస్తూ ఆ దేశ సుప్రీం కోర్టులో దాఖలైన కేసుపై ఇటీవల విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ దేశ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు జాదవ్ కేసు గురించి ప్రస్తావించారు. గూఢచర్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత పౌరుడు జాదవ్ కు ఉన్న అప్పీలు హక్కు, అల్లర్ల కేసుల్లో దోషులుగా తేలిన పాకిస్థాన్ సొంత పౌరులకు ఇవ్వలేదని వారి తరఫు న్యాయవాది ఆరోపించారు. దీనిపై పాకిస్తాన్ రక్షణ మంత్రిత్వ శాఖ న్యాయవాది స్పందిస్తూ.. అప్పట్లో దేశ న్యాయవ్యవస్థలో ఉన్న లోపాన్ని గుర్తించి అంతర్జాతీయ న్యాయస్థానం జాదవ్ కు కాన్సులర్ తో మాట్లాడేందుకు అనుమతిస్తూ ఆ తీర్పును ఇచ్చిందన్నారు. ఈ తీర్పు తర్వాత వియన్నా ఒప్పందానికి అనుకూలంగా చట్టాల్లో మార్పులు

...మిగతా 2లో

## హసీనా కోసం అంతర్జాతీయ నోటీసులు

### మాజీ ప్రధానితో పాటు మరో 12 మందిపై ఇంటర్ పోల్ ను ఆశ్రయించిన బంగ్లాదేశ్

ఢిల్లీ, ఏప్రిల్ 20: మన దేశంలో తలదాచుకుంటున్న మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు 12 మందిని తమ దేశానికి తీసుకొచ్చేందుకు బంగ్లాదేశ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వారి కోసం రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్ పోల్ ను బంగ్లాదేశ్ నేషనల్ సెంట్రల్ బ్యూరో (ఎన్సీబీ) పోలీసులు కోరారు. 77 ఏండ్ల హసీనా పదవీచ్యుతురాలయ్యాక ఆగస్టు 5 నుంచి ఆమె భారత్ లో నివాసముంటున్నారు. కోర్టుల్లో అప్పీళ్లు, దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగా ఈ విజ్ఞప్తి చేశామని సహాయ ఐజీ ఇనాముల్ హక్ సాగౌర్ శనివారం వెల్లడించారు.

## క్యాన్సర్ అవేర్‌నెస్ రన్

**హైదరాబాద్, మనం బ్యూరో:** క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మారథాన్ నిర్వహించారు. 10కె, 5కె, 2.5కె రన్ లో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 200 మంది డాక్టర్లు సైతం రన్ చేశారు. వైద్య నిపుణులు క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించారు.

## కుల్ భూషణ్‌కు అప్పీల్ చేసుకునే హక్కు లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు వెల్లడించారు. ఇది పునఃసమీక్షకు మాత్రమే అవకాశం కల్పిస్తుందన్నారు. ఇక 2023 అల్లర్ల కేసులో నిందితులుగా ఉన్న పౌరులు ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేసుకునే హక్కును కల్పించే అంశంపై అటార్నీ జనరల్ మన్సూర్ ఉస్మాన్ అవాన్ అధికారులతో చర్చలు జరుపుతున్నారని.. దీనికి రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరినట్లు కోర్టు పేర్కొంది.

**జాదవ్ కేసు పూర్వాపరాలు..**

నావికాదళం నుంచి పదవీ విరమణ చేసిన కుల్ భూషణ్ జాదవ్ ఇరాన్ లోని చాబహార్లో వ్యాపారం చేసేవారు. 2016లో అక్కడే పాక్ ఏజెంట్లు ఆయన్ను అపహరించారు. ఆ తర్వాత బలూచిస్థాన్ కు తీసుకొచ్చి అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. 2017 ఏప్రిల్ లో గూఢచర్యం ఆరోపణలపై పాకిస్థాన్ మిలిటరీ కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. ఈ అంశంపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ లో ఉంటున్న జాదవ్ ను పాక్ అపహరించిందని ఆరోపించింది. ఆ మరణశిక్షను సవాల్ చేస్తూ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2019లో దీనిపై దర్యాప్తు చేసిన ఐసీజే జాదవ్ భారత అధికారులతో మాట్లాడే అవకాశం కల్పించాలని ఆదేశించారు.

# అధ్యక్షుడు రాజు కాదు.. ఎన్నికైన వ్యక్తి మాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

రాజులు ఎవరూ లేరు' 'ఈ దౌర్జన్యాన్ని ఎదిరించండి' అంటూ నినాదాలు చేశారు. తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయడం, వారిని బహిష్కరించడంపై ఆందోళనకారులు మండిపడ్డారు. 'ఎలాంటి భయం లేదు.. వలసదారులకు స్వాగతం' అంటూ నినాదాలు చేశారు. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రంప్ పాలన సాగుతోందన్నారు. ఆయన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్-1 విద్యార్థి వీసా ముగిసినా అమెరికాలోనే ఉంటున్న పాలస్తీనాకు చెందిన విద్యార్థిని లెకా కోర్డియాను అక్కడి అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అదే విధంగా మరో పాలస్తీనా విద్యార్థిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. ట్రంప్ పని తీరును నిరసిస్తూ ఇటీవల అమెరికా ప్రజలు దేశమంతటా ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. న్యూయార్క్ నుంచి అలస్కా దాకా వీధుల్లో జనం పోటెత్తి 'హ్యాండ్సాఫ్' అంటూ నినదించారు. రిపబ్లికన్ల పాలన ప్రారంభమయ్యాక జరిగిన అతి పెద్ద నిరసనగా ఇది నిలిచింది. పౌర హక్కుల, కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ సంస్థలు, న్యాయవాద సంఘాలు, సీనియర్ సిటిజెన్, ఎన్నికల సంస్కరణల సంఘాల ఆధ్వర్యంలో 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో చేపట్టిన ఈ 'హ్యాండ్సాఫ్' ఆందోళనలకు ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. అయితే.. శాంతియుతంగానే నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా మరోసారి ట్రంప్ నకు వ్యతిరేకంగా నిరసనలు చేశారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ వర్గాలకు చెందిన ప్రజలు కూడా సీబీఎన్ బర్త్ డేను ఉత్సాహంగా జరుపుకోవడం విశేషం.

**75 కేజీల కేక్ 'కట్టింగ్'..**

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. 75 కిలోల కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, టీడీ జనార్ధన్, వర్ల రామయ్య, అశోక్బాబు, వీవీవీ చౌదరి, నన్నపనేని రాజకుమారి, ఎ.వి.రమణ హాజరయ్యారు. విజనరీ లీడర్ చంద్రన్న పేరిట ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను నేతలు ఆసక్తిగా చూశారు. తిరుమల అలిపిరి మార్గంలో పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

**హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్టు భవన్లో**

హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్టు భవన్ లో నిర్వహించిన చంద్రబాబు పుట్టిన రోజు వేడుకల్లో ఏపీ మాజీ మంత్రి సోమిరెడ్డి, నందమూరి సుహాసిని, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, తెలంగాణ టీడీపీ నాయకుడు అరవింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు సందర్భంగా చంద్రబాబుకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాతో సహా పలువురు కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'సీఎం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ప్రయత్నాలు ఏపీని పురోగతిలో కొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నాయి. చంద్రబాబుకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నా'

**-కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

'చంద్రబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆ భగవంతుడు చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని చంద్రబాబుకు భగవంతుడివ్వాలి.' **- తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి**

## భారత్ రావడానికి ఎదురు చూస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో పోస్టు చేశారు. సాంకేతికత, ఆవిష్కరణల్లో సహకారానికి ఉన్న అపారమైన సామర్థ్యంపై తాము చర్చించుకొన్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వంలో ఎలాన్ మస్క్ అత్యంత ప్రభావశీల వ్యక్తిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. సర్కారు వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా ఏర్పాటుచేసిన 'డోజ్' విభాగానికి ఆయన నాయకత్వం కూడా వహిస్తున్నారు. మస్క్తో ఫోను సంభాషణ అనంతరం ప్రధాని.. 'మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. ఈ ఏడాది ప్రారంభంలో నా అమెరికా పర్యటన సందర్భంగా చర్చించిన అంశాలపైనా సమాలోచనలు జరిపాం. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో అమెరికాతో మా భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి భారత్ కట్టుబడి ఉంది' అని మోడీ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

## చంద్రబాబుకు కేసీఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, మనం బ్యూరో:** తెలుగుదేశం పార్టీ అధినేత, పొరుగు రాష్ట్రం ఏపీ సీఎం చంద్రబాబుకు... బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన వారి జీవితం, ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు సుఖశాంతులతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

**బాబు కృషి మరువలేం : కేటీఆర్**

ఏపీ సీఎం చంద్రబాబుకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ చేరికల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చడంలో చంద్రబాబు చేసిన కృషిని కేటీఆర్ గుర్తుచేశారు.

# ఒకే గుడి ఒకే బావి ఒకే శ్మశానం

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక ఐక్యత సాధించడం కీలకం. హిందూ సమాజానికి పునాదిగా భావించే సంస్కారం(విలువలు), సంప్రదాయం, సాంస్కృతిక విలువలు, నైతిక సూత్రాల పేరుతో చీకటి లోయల లోతుల్లో పాతుకుపోయిన ఈ సమాజ ఆలోచన తీరును నిర్మూలించాలి. కుల భేదాలకు స్వస్తి పలకాలి' అని ఆర్ఎస్ఎస్ చీఫ్ పిలుపునిచ్చారు. 'నైతిక విలువలను పాటిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోవాలి. ఎలాంటి భేదాలు చూపకుండా అన్ని వర్గాల వారిని ఇళ్లలోకి ఆహ్వానించాలి. అట్టడుగు స్థాయిలో సామరస్యం, ఐక్యతను వ్యాప్తి చేయాలి. సంస్కారం అనే పునాదిపై నుంచి కుటుంబం, దాని విలువలు రూపుదిద్దుకున్నాయి. ఇది సమాజంలో ప్రాథమిక అంశంగా ఉంటోంది. జాతీయవాదం, సామాజిక ఐక్యత పునాదులను మరింత బలోపేతం చేసేందుకు అన్ని పండుగలను సామూహికంగా నిర్వహించడం ఎంతో ముఖ్యం'' అని ఆర్ఎస్ఎస్ బాస్ మోహన్ భగవత్ పేర్కొన్నారు.

# ఇంటలెక్చువల్స్ కోసం ప్రపంచం భారత్‌వైపు చూస్తోంది

**హైదరాబాద్, మనం బ్యూరో:** ప్రపంచంలోని దేశాలన్నీ ఇంటలెక్చువల్స్ కోసం భారత్ వైపు చూస్తున్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సారథులంతా భారతీయులేనని పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడి ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నూతన భవనానికి భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విదేశీ పెట్టుబడిదారులు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారనీ, అందుకే మన దేశం గ్లోబల్ ఎకనామిక్ పవర్‌హౌస్‌గా వడివడిగా ముందుకు సాగుతుందన్నారు. కంపెనీ సెక్రటరీలు దేశ కార్పొరేట్ రంగానికి రూపురేఖలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటలెక్చువల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్ పెంచుకోవడం అంటే కేవలం వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదనీ, సమాజంతో పాటు ప్రపంచ అభివృద్ధికి దోహదపడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆత్మ నిర్భరత సాధించే దిశగా కంపెనీ ఇక్సిలాంటి సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. భారత్‌లో కంపెనీ సెక్రటరీలు విలువలతో కూడిన వృత్తిని పాటించడం వల్లే జపాన్, జర్మనీ వంటి దేశాలు భారత్‌కు చెందిన సీఎస్‌లు, లాయర్లు, అకౌంటెంట్లను వారి దేశాల్లో పనిచేసేందుకు నియమించుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రతీ కంపెనీ సెక్రటరీ సత్యం వద, ధర్మం చర సూత్రం ఆధారంగా పని చేస్తే దేశ వ్యాపార రంగం నిజాయితీ పారదర్శకతతో ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## లక్షల కోట్లు వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టిండ్రు?

- వక్ఫ్ బిల్లు వ్యతిరేక ఆందోళనల వెనుక.. కాంగ్రెస్ హస్తం
- వక్ఫ్ ఆస్తులను మజ్లిస్ పార్టీ దోచుకుంది
- బండి సంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టిన బడా చోర్ నేతలకు రేవంత్ రెడ్డి మద్దతు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనల వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని ఆరోపించారు. మత కల్లోలాలు జరగాలని కాంగ్రెస్ చూస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తులను మజ్లిస్ పార్టీ దోచుకుందని, వక్ఫ్ భూములతో ముస్లింలకు ఏం లాభం చేకూర్చారో చెప్పాలని బండి సంజయ్ నిలదీశారు. మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి జపాన్‌లో పర్యటిస్తుండడం పట్ల బండి సంజయ్ విమర్శనాస్త్రాలు సంధించారు. అకాల వర్షాలతో రైతులు కష్టాల్లో ఉంటే రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలా? అని మండిపడ్డారు. లక్ష కోట్లు తెస్తామని చెప్పడమే తప్ప ఎక్కడా ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు.

## టీం శివంగి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 20:** తెలంగాణ సర్కార్ మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటి వరకు భద్రతా అధికారులుగా పురుష ఆఫీసర్లే ఉండగా.. తాజాగా మహిళా కమాండోలను సిద్ధం చేసింది. రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళా కమాండో బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందానికి 'టీం శివంగి'గా నామకరణం చేస్తూ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ దళాన్ని ప్రారంభించారు. ఆదివారం ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క తెలంగాణలోని మొట్టమొదటి మహిళా కమాండో బృందం నిర్మల్ జిల్లాలో ఆరంభిస్తూ.. ఇకపై అన్ని జిల్లాల్లో మహిళా కమాండో బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళా పోలీసుల్లో ఔత్సాహికులకు 45 రోజుల కఠిన శిక్షణనిచ్చి కమాండో బృందాన్ని తయారు చేసినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. బృందంలోని కమాండోలకు ఆయుధాలు, టెక్నాలజీ వంటి తదితర అంశాలపై ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. కాగా మహిళలకు అన్ని రంగాల్లో తొలి ప్రాధాన్యత కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను మరోమారు నిలబెట్టుకున్నారని బృంద సభ్యులు తెలియజేశారు. ఇకపై ప్రత్యేక భద్రతా దళంలో పురుషులే కాదు, మహిళలు కూడా కనిపించనున్నారు.

# సమసిపోతుందా? చర్యల దాకా సాగుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

వెళుతుందా అనే అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. స్మితా సబర్వాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం ఇది తొలిసారి కానప్పటికీ ఈసారి ఏకంగా సీఎంవో టార్గెట్‌గా ఆమె ఎక్స్ వేదికగా ఆమె పెట్టిన పోస్టులు ఐఎఎస్‌లలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో ఏఐ టెక్నాలజీ జనరేటెడ్ వీడియోలతో రూపొందించిన ట్వీట్‌లను ఆమె రీట్వీట్ చేయడం దీనిపై ప్రభుత్వం ఆమెకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో.. పోలీసుల ఎదుట ఆమె హాజరై వివరణ ఇచ్చినప్పటికీ ప్రభుత్వంపై అదే ధిక్కార ధోరణి ప్రదర్శిస్తుండటం గమనార్హం. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. తాను రీపోస్టు చేసినట్లే రెండు వేల మంది చేశారనీ, వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటారా? లేక నన్నే టార్గెట్ చేశారా? అని నేరుగా ప్రభుత్వాన్నే ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమా? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా? అని నిలదీశారు. ఆమె తెగింపు చర్య సీఎం రేవంత్ రెడ్డితో ఢీ అంటే ఢీ అనే విధంగా ఉండటంతో స్మితా సబర్వాల్ విషయంలో ప్రభుత్వం ఏ విధమైన చర్య తీసుకుంటుందని అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అధికారిణి హోదాలో ఉన్న స్మితా సబర్వాల్‌పై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా, స్మితా చేసిన ట్వీట్‌పై సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డి చేసిన కౌంటర్ ట్వీట్ ఈ వివాదం మరింత రగిలేలా చేసింది. ఆ ఐఏఎస్ అధికారి దృష్టికోణంలో మార్పు ఎందుకొచ్చినట్లు? అధికార మార్పిడి జరిగితే అభిప్రాయాలూ మారొచ్చా అని స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికించిన మీరే ఇప్పుడు తప్పు పట్టడంలో మర్మమేందో? అసలు ఏడుపు వన్య ప్రాణుల కోసమా? లేక అధికారం కోల్పోయిన వారి కోసమా అంటూ స్మితా సబర్వాల్ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో కీలక బాధ్యతను నిర్వహిస్తున్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షలాది చెట్లను నరికివేయించినట్లుగా మీడియాలో వచ్చిన కథనాలను ఇందుకు ఉదహారణగా ఆయన ట్వీట్‌కు జత చేశారు. ఇదిలా ఉండగా, సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ వివాదంపై ఆమెకు మద్దతిచ్చేందుకు సీనియర్ ఐఏఎస్‌కు నిరాకరించినట్లు సమాచారం. గతంలో ఒకసారి ఆమె చేసిన ట్వీట్ వివాదాస్పదం కావడంతో ఆమెకు మద్దతుగా నిలిచిన ఐఏఎస్‌లు ఈ సారి ఆమె ఏకంగా ప్రభుత్వాన్నే నేరుగా ఢీకొట్టడంతో ఆమెకు మద్దతుగా నిలవలేమని స్పష్టం చేసినట్లు తెలిసింది. మరోవైపు, స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకునే యోచనలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన అనంతరం ఆమెపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

# మహారాష్ట్రలోనూ హిందీ వ్యతిరేకత?

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ లక్ష్మీకాంత్ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు రాసిన ఒక లేఖలో కోరారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ మరాఠీ, ఇంగ్లీషుతో పాటు మూడో భాషగా హిందీని విధిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 17న నిర్ణయించింది. పాఠశాల విద్యా విభాగం ఏప్రిల్ 16న ఈ నిర్ణయం తీసుకున్నట్టు మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డెరెక్టర్ రాహుల్ అశోక్ రేఖావార్ తెలిపారు. విద్యార్థులు ఇందువల్ల తప్పనిసరిగా లబ్ధి పొందుతారని చెప్పారు. కాగా, హిందీని విధిగా బోధించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

**మరాఠీని వ్యతిరేకిస్తే సహించేది లేదు : ఫడ్నవీస్**

ఈ వివాదంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వివరణ ఇచ్చారు. మరాఠీ అనేది చర్చనీయాంశమే కాదని, అందరూ తప్పనిసరిగా నేర్చుకావాలని, వేరే భాషలు నేర్చుకోవడం వారి వ్యక్తిగత ఎంపిక అని అన్నారు. 'మహారాష్ట్రలో మరాఠా తప్పనిసరి. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. అదనంగా, ఇతర భాషలు నేర్చుకోవాలంటే నేర్చుకోవచ్చు. హిందీపై వ్యతిరేకత, ఇంగ్లీషుపై పెరుగుతున్న ప్రాధాన్యత ఆశ్చర్యం కలిగిస్తోంది. మరాఠీని ఎవరైనా వ్యతిరేకిస్తే మాత్రం సహించేది లేదు' అని అన్నారు.

**మహా వికాస్ అఘాడి నిరసన**

అధికార మహాయుతి ప్రభుత్వ నిర్ణయంపై విపక్ష మహా వికాస్ అఘాడి ఆక్షేపణ తెలిపింది. ఎన్సీపీ నేత సుప్రియ సూలే మాట్లాడుతూ, మహారాష్ట్రలో సీబీఎస్సీ బోర్డు తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ మంత్రి చేసిన ప్రకటనను మొదటగా వ్యతిరేకించనది తానేనని, ప్రస్తుతం ఉన్న స్టేట్ బోర్డ్ స్థానే సీబీఎస్సీను ఎందుకు తీసుకురావాలని ఆమె ప్రశ్నించారు. భాష గురించి మాట్లాడాలనుకున్నప్పుడు ముందు రాష్ట్రంలో కనీస విద్యా సదుపాయల గురించి తప్పనిసరిగా మాట్లాడుకోవాలని అన్నారు.

# స్టాండ్‌కు నా పేరు పెట్టుకోవడంలో కుట్ర కోణం లేదు?

## తన పేరు తొలగించడంపై అజారుద్దీన్ స్పందన

నేను దిగజారాలని అనుకోవడం లేదు?

హెచ్‌సీఏ అసోసియేషన్‌ను చూసి క్రికెట్ ప్రపంచం నవ్వుతోంది?

'నేను 17 ఏళ్లు క్రికెట్ ఆడాను.. పదేళ్లపాటు భారత జట్టుకు కెపెన్‌గా పనిజేశా

హైదరాబాద్‌లో క్రికెటర్లను ఇలాగేనా గౌరవించేది?

ఇది చాలా బాధాకరం.. అంటూ ఆవేదన వ్యక్తంజేసిన అజహరుద్దీన్

అంబుడ్స్‌మెన్ నిర్ణయాన్ని హైకోర్టులో సవాలు చేస్తానని వెల్లడి

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజహరుద్దీన్ పేరును తొలగించాలని హెచ్‌సీఏ అంబుడ్స్‌మెన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలపై అజహరుద్దీన్ తీవ్రంగా స్పందించారు. ఇది తనను అగౌరవపరిచే చర్య అని, దీనిపై న్యాయపోరాటం చేస్తానని, హైకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. హెచ్‌సీఏ అంబుడ్స్‌మెన్ వ్యవహరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేశారు. అజహరుద్దీన్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే స్టాండ్‌కు ఆయన పేరు పెట్టడం... విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని.. తక్షణమే స్టాండ్‌తో పాటు మ్యాచ్‌ల టికెట్లపై కూడా ఆ పేరు ఉండకూడదని ఆయన హెచ్‌సీఏకు సూచించారు. ఈ నేపథ్యంలో అజహరుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. తన ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'స్టేడియంలోని స్టాండ్‌కు నా పేరు పెట్టుకోవడంలో కుట్ర కోణం గానీ, స్వప్రయోజనాలు గానీ ఏమీ లేవు?. ఈ వివాదంపై నేను ఎక్కువగా వ్యాఖ్యానించదల్చుకోలేదు. ఆ స్థాయికి దిగజారాలని అనుకోవడం లేదు. ఈ అసోసియేషన్‌ను చూసి క్రికెట్ ప్రపంచం నవ్వుతోంది' అని అజహరుద్దీన్ అన్నారు. 'నేను 17 ఏళ్లు క్రికెట్ ఆడాను. దాదాపు పదేళ్లపాటు భారత జట్టుకు కెపెన్‌గా వ్యవహరించాను. కెప్టెన్‌గా డిస్టింక్షన్‌లో పాసయ్యాను. హైదరాబాద్‌లో క్రికెటర్లను ఇలాగేనా గౌరవించేది? ఇది చాలా బాధాకరం,'అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'తప్పకుండా కోర్టుకు వెళతాం.. వందశాతం న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా 'అని అజహరుద్దీన్ స్పష్టం చేశారు. గతంలో, 2019 వరకు ఈ నార్త్ స్టాండ్‌కు భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ పేరు ఉండేది. అయితే, ఆ తర్వాత దానిని మహ్మద్ అజహరుద్దీన్ స్టాండ్‌గా మార్చారు. ఇప్పుడు అంబుడ్స్‌మెన్ ఆదేశాలతో ఈ పేరు మార్పు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. ఇటీవల ఐపీఎల్ టికెట్ల విక్రయం విషయంలోనూ హెచ్‌సీఏ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజా పరిణామంతో హైదరాబాద్ క్రికెట్ వర్గాల్లో ఈ వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

## హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దుతం



(మొదటి పేజీ తరువాయి)

సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. అలాగే కితాక్యూషూ నగరం నుంచి హైదరాబాద్‌కు నేరుగా విమానం నడపాలని ఆ నగర మేయర్ కజుహిసా టకేజీకు విజ్ఞప్తి చేశారు. అలాగే, నగరాల్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నారు. నగరంలో వ్యర్థ పదార్థాల తొలగింపునకు సంబంధించిన సాంకేతిక నైపుణ్యం అందజేసే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా, ఈ సందర్భగా కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేజీ హైదరాబాద్ నగరాభివృద్ధికి కలిసి పనిచేస్తామనీ, పర్యావరణ సాంకేతికత, భద్రత, పునరుద్ధరణ విభాగాలలో అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఎంఐఎం పార్టీకి సెక్యులర్ పదం వాడే హక్కుందా?

- ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ అనైతిక మద్దతు
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్, మనం బ్యూరో:** బీజేపీతో పోరాడేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందడానికి ఈ మూడు పార్టీలు అనైతిక పొత్తు కుదుర్చుకున్నాయని పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసలు ఎంఐఎం పార్టీకి సెక్యులర్ అంబేద్కర్ అనే పదాలు వాడే హక్కుందా అని ప్రశ్నించారు. అలాగే యాంటీ సెక్యులర్ పార్టీ అయిన ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం కరక్టేనా ఎంఐఎంకు మద్దతిస్తున్న టీఆర్ఎస్, బీఆర్ఎస్ పార్టీలకు సెక్యులర్ అనే పదం వాడే హక్కుందా అని నిలదీశారు. అసదుద్దీన్‌కు లొంగిపోయి ఎంఐఎంకు మద్దతిచ్చేందుకేనా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో నిలబడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం లేకుంటే బతకలేదనీ, అందుకే వారికి లొంగిపోయారని వ్యాఖ్యానించారు. ఒక మతం కాదు దేశం గురించి ఆలోచించడమే సెక్యులర్ భావజాలం అని అంబేద్కర్ చెప్పారనీ, ఎంఐఎంకు మద్దతిస్తున్న బీఆర్ఎస్ కాంగ్రెస్‌లకు సెక్యులర్ అనే పదం వాడే హక్కు లేదన్నారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనీ, కేసీఆర్‌తో పొత్తు ఉండి కూడా అనే భాష వాడుతున్నారని మండిపడ్డారు. ఆయన ఏం భాష మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదనీ, ఆయన చదువుకున్న చదువు ఇదేనా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వాళ్లను ఓటు వేయొద్దని పార్టీ పెద్దలు చెబుతున్నారనీ, వాళ్లు ఇంటో కూర్చుని ఎంఐఎంకు మద్దతిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఆత్మ పరిశీలన చేసుకుని ఓటు వేయాలన్నారు. అలా ఓటు వేస్తే బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావు కచ్చితంగా గెలుస్తారని చెప్పారు. ఈ ఎన్నికల్లో జరిగేది సిద్ధాంతపరమైన యుద్ధమనీ, ఒక మతతత్వ పార్టీకి సెక్యులర్ పార్టీకి మధ్య జరుగుతున్న యుద్ధమనీ, అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

# చిట్ట చివరి ఆయకట్టుకూ సాగు నీరు

**తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత • డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు**

**• పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సిఎం**






మధిర, ఏప్రిల్ 20(మనం న్యూస్): చిట్ట చివరి ఆయకట్టుకు సాగునీరందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంచార్జ్ కలెక్టర్ డా. పి.శ్రీజతో కలిసి మధిర మండలంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. ఈ సందర్భంగా సిరిపురం గ్రామ శివారులో ఉప ముఖ్యమంత్రిని మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. దారి వెంట పూల వర్షం కురిపిస్తూ మహిళలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 6 కోట్ల 85 లక్షలతో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు, ఐదు కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి, 10 కోట్ల 31 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మధిర ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ భవన నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మహాదేవపురం గ్రామంలో సుమారు 952 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 12 కోట్ల 14 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మహాదేవాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. రాయపట్నం గ్రామంలో 1079 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన రాయపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మునిసిపాలిటీ 3వ వార్డు, అంబారుపేటలో మధిర నుండి ములుగుమాడు వయా నిదానపురం వరకు ఉన్న రహదారిని 25 కోట్ల అంచనా వ్యయంతో రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేయుటకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ మధిర మండలం సిరిపురం గ్రామంలో 1240 ఎకరాలకు సాగునీరు అందించే దిశగా వైరా నదిపై 6 కోట్ల 85 లక్షలతో చెక్ డ్యాం నిర్మిస్తున్నామని, దీని వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ వృద్ధికి దోహద పడతాయని అన్నారు. వేసవి, చలి కాలంలో భూగర్భ జలాల కొరత తగ్గిపోతుందని అన్నారు. చెక్ డాం పైన 3 చిన్న ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, చెక్ డ్యాం నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్ 1.5 కిలో మీటర్ల వరకు ఉంటుందని, చిన్న ఎత్తిపోతల పథకాలకు సంవత్సరం పాటు నీరు అందుబాటులో ఉంటుందని, నది గర్భం సమీపంలో గల గ్రామాలలో భూగర్భ జలాలు అధికంగా పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఖర్చు చేసినప్పటికీ ఆయకట్టు సృష్టించడంలో వైఫల్యం చెందిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ ఖర్చుతో కూడుకున్న పనులు చేపట్టి అధిక ఆయకట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని, మొదటి దశలో నిరుపేదలకు మంజూరు చేస్తామని అన్నారు. రైతుల సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న బియ్యం పండించిన రైతులకు క్వింటాల్ వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు బీమా, ఉచిత విద్యుత్ కు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేశామని అన్నారు. మహిళలను సంపన్నులుగా చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ పనులు చేపట్టామని, ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు, మండలాలలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, రైస్ మిల్లులో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఖమ్మం సిఇ ఓ.వి. రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్, ఇరిగేషన్ కల్లూరు సర్కిల్ ఎస్ఇ జి.వాసంతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఇరిగేషన్ మధిర డివిజన్ ఇఇ సి.హెచ్. రామకృష్ణ, మధిర డిఇఇ వి. నాగ బ్రహ్మయ్య, సిరిపురం ఏఇఇ బి.శివ సాగర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**• చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్ల, ఏప్రిల్ 20(మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, అప్పుడే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు.చేవెళ్ల మున్సిపాలిటి పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్గారి మోహన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాములు, వెంకట్ స్వామి, మల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గోపాల్, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, ఇంకా 20 మంది నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...నాయకులు, కార్యకర్తలు తరతమ భేదాలు ఉన్నా.. కలిసికట్టుగా ఐక్యంగా కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తప్పనిసరిగా తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తల సంక్షేమమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన పెంచుకోవాలి



**• స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి**

చేవెళ్ల, ఏప్రిల్ 20(మనం న్యూస్ ): ప్రతి ఒక్కరు అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడుతూ.... ఇంటిలో, పని ప్రదేశాలలో, విద్యాలయాలలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటిలో గ్యాస్ వినియోగం పై జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పటంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణ పై కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదం ప్రాథమిక దశలో ఉన్నప్పుడు సమయ స్ఫూర్తితో వివారించి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచార అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్, సాయిలు, యూసుఫ్, సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రియాశీల సభ్యుల సమావేశం

**• నేటి నుంచి బిజెపి బస్తి ఛలో అభియాన్ కార్యక్రమం**

**• క్రమ శిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్**



తుర్కయంజాల్, ఏప్రిల్ 20(మనం న్యూస్):మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ కార్యాలయంలో ఆదివారం క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోసుపల్లి ప్రతాప్ విచ్చేసి వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించి చెప్పాలని, బిజెపి పార్టీ ఆదేశాల మేరకు రానున్న మూడు రోజుల్లో బస్తి చలో కార్యక్రమాన్నికి ప్రతి ఒక్కరు బస్తీ కి వెళ్లి బిజెపి 10 సంవత్సరాల పాలన గురించి మున్సిపాలిటీ ప్రజలకు వివరించాలని తెలిపారు. బిజెపి అధికారంలో రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలో ఉండవలసిన అవసరం ఉందని అన్నారు. పార్టీ బలోపేతం గురించి ప్రతి ఒక్కరు క్రియాశీల సభ్యులుగా కషి చేసి బిజెపి జెండా రెప రెప లాడాలని సభ్యులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి , బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్ , బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి కొండ్రు పురుషోత్తం, మున్సిపల్ మాజీ అధ్యక్షులు తూళ్ల నరసింహ గౌడ్, బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ సనేం అర్జున్ గౌడ్, కందాల బల్దేవ్ రెడ్డి, నోముల కార్తిక్ గౌడ్, పలుసా శ్రవణ్ గౌడ్, కరాడి అనిల్, కొమ్మిరిశెట్టి బిక్షపతి, సామల యూసుఫ్ రెడ్డి, కొలోన్ రవీందర్ రెడ్డి, మాడుగుల బాల కష్ణ గౌడ్, నాయిని సంజీవ్ రెడ్డి, నాగరాజు, మల్లెల రమేష్ , విశాల్ గౌడ్, సురేష్ , సాగర్, కొమ్మం శివ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివద్ధిలో దాతల సహకారం అభినందనీయం



**• మాజీ సర్పంచ్ సామ మాణిక్య రెడ్డి**

చేవెళ్ల, ఏప్రిల్ 20(మనం న్యూస్): దేవాలయ అభివద్ధిలో దాతల సహకారం అభినందనీయమని మాజీ సర్పంచ్ సామ మాణిక్య రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామ వార్డులో దాత సామ రంగారెడ్డి తన సొంత నిధులతో దేవాలయం చుట్టూ సిసి రోడ్డు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు గ్రామ , దేవాలయాల అభివద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం సామ రంగారెడ్డిని గ్రామస్తులంతా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బక్కయ్య, చంద్రయ్య ,శ్రీనివాస్ ,రాములు, శ్రీశైలం, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి ,మల్లారెడ్డి, రామిరెడ్డి , మంగలి రాములు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర దేవాలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**• ముఖ్యఅతిథిగా ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**



కోరుట్ల ఏప్రిల్ 20 (మనం న్యూస్): కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం రాత్రి ఆలయ మండపంలో నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేసి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు నూతన అధ్యక్షులుగా ఎతిరాజం నర్సయ్య కార్యవర్గ సభ్యులుగా నేతి శ్రీనివాస్ కట్కం దివాకర్ కోట గంగాధర్ గోడికే రాములు చిలివేరి విజయ్ కుమార్ చిట్యాల పద్మ.లు ప్రమాణస్వీకారం చేశారు అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు రాకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో ఆలయ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని కనీసం హనుమాన్ విశ్వక్సేన విగ్రహ ప్రతిష్టాపన కూడా చేపట్టకపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 80 లక్షల రూపాయలతో శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండప అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి టెండర్లు ప్రక్రియ కూడా పూర్తి కాబడిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలోకి వస్తే పేద బడుగు బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగపడుతున్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో హనుమాన్ విగ్రహ విశ్వక్సేన విగ్రహ ప్రతిష్టాపన చేపట్టడమే కాకుండా ఆలయ ప్రాంగణంలో సిసి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు అలాగే పట్టణంలో గల 33 వార్డులలో ప్రతి వార్డుకు 25 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తానని కావున ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానన్నారు ఈకార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ సత్యనారాయణ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్ మచ్చ కవిత మెట్పల్లి మాజీ జెడ్పిటిసి సభ్యులు ఆకుల లింగారెడ్డి పేస్ చైర్మన్ ఎలిశెట్టి భూమారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం అనిల్ పుప్పాల ప్రభాకర్ ఎంబేరి నాగభూషణం ఆడెపు మధు కర్ణాకర్ రావు నరేష్ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సురేష్ వెంకటేశ్వర దేవాలయ నూతన అధ్యక్షులు ఎతిరాజం నర్సయ్య కార్యవర్గ సభ్యులుగా నేతి శ్రీనివాస్ కట్కం దివాకర్ కోట గంగాధర్ గోడికే రాములు చిలివేరి విజయ్ కుమార్ చిట్యాల పద్మ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి ద్వారా రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం




**• భూ భారతి పోర్టల్ పై అవగాహన సదస్సు**

జైపూర్, ఏప్రిల్ 20 (మనం న్యూస్): బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ధరణి అంటూ పేద ప్రజల భూములపై అక్రమ దందాలు నడిపిస్తూ ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను పరిష్కరించేందుకు నూతనంగా భూ భారతి పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు,ఆదివారం రోజున జైపూర్ మండలంలోని రైతు వేదికలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఆర్డీవో,అదనపు కలెక్టర్ జిల్లా రాజస్వ మండల అధికారి, తహశిల్దార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ భూభారతి ద్వారా హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి,మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని సూచించారు.

అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాధీముభారక్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో



చేవెళ్ల, ఏప్రిల్ 20 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల గ్రామానికి చెందిన రమేష్ గుప్తా జన్మదిన వేడుక సందర్భంగా దామరగిద్ద మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా..... నిర్వహించి శాలువ కప్పి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో. ఇంద్రసేనా గుప్తా, ఉడుత రఘు, చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొనారు.

## అప్పుల బాధ భరించలేక యువ రైతు ఆత్మహత్య



జైపూర్: ఏప్రిల్ 20 (మనం న్యూస్):అప్పుల బాధ భరించలేక యువరైతు ఆత్మహత్య కు పాల్పడ్డాడు,జైపూర్ మండలంలోని పౌనూర్ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మంతెన కుమార్ (39) అనే యువరైతు పురుగుల మందు త్రాగి ఆదివారం మరణించినట్టు ఎస్త్సై శ్రీధర్ తెలిపారు. మృతుడు తన రెండు ఎకరాల పొలంలో ఆడ మగ వడ్లు పండిస్తూ జీవనం కొనసాగించేవాడు పొలానికి నీళ్లు సరిపోక తన పొలం ఎండిపోతుందని రెండు బోర్లు వేయించిన ఫలితం లేకుండా పోయిందని నిరాశపడుతూ ఉండే వారని కుటుంబీకులు తెలిపారు,పూర్తిగా పొలం నీళ్లు లేక ఎండిపోవడంతో తను తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేక మనస్థాపానికి గురై పురుగుల మందు త్రాగడంతో గమనించిన కుటుంబీకులు 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించారు,వైద్యులు నిర్ధారణ చేసి మరణించినట్లు తెలిపారు, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్త్సై శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతునికి భార్య మమత,కుమారుడు అభినేష్ ,కూతురు ఐశ్వర్య ఉన్నారు.

## ఆమె ఖాళీని పూరించలేము

ఆమెకు కన్నోళ్లు కంట్లె పడే సరికి
మెట్టినింట్లో కాలు తీసి పుట్టినింట్లో వేసింది
చీకట్లను వెలుతురు మింగినట్లు ఇంట్లో ఆమె
మాటల శబ్దాన్ని శూన్యం మింగేసింది
ఆకిలంతా ఇప్పుడు మొద్దు నిదరబోయి
శింపిరెంటుకల తోటి శిరాకు పడ్తాంది
సింకులోని బోల్లన్నీ కంపుతోటి ముక్కులు
మూసుకుంటున్నయ్
ఆగ్నేయ అర్ర అగ్గికి దూరమై కుక్కర్ విజిల్స్
రాక పాల పొంగులు లేక డీలాఫడింది
మూలకున్న చీపిరి చిన్నబోయి తనను
చేతుల్లోకి తీసుకోమని తెగ మారాం జేడ్తాంది
ఎక్కడ బట్టలు అక్కడ ఎల్లాకిల్లా పడుకొని
నన్ను ఏకంగా ఎక్కిరిస్తున్నయ్
ఇల్లంతా పాశితోటి ఇకారంగా తయారై
జాతరలో తప్పిపోయిన చంటి పిల్లాడిలా
బగ్గ బెంగ పడ్తాంది
కుండిలోని పూల మొక్కలు ఆమె చేతి
నీళ్లు తాగక దాహంతో వాటి ముఖాలు
మాడిపోతున్నయ్
మార్నింగ్ కప్పు కాఫీ లేక కడుపులోని
పేగులన్నీ ఒకటే అరుస్తున్నయ్
మనం బయట ఎంత బలాదూర్ తిరిగినా
ఇంట్లో ఆమె ఖాళీని మనం పూరించలేము
వాళ్లు ఒల్లంతా కండ్లు చేసుకొని
ఇల్లంతా ఇవురంగా ఈదుతుంటరు
ఇంట్లో వాళ్ళు లేకుంటే మనకు రాతియుగమే
మగువలు లేకుంటే మనందరం అనాధలమే

**- తాటిపాముల రమేశ్ (తార)**
7981566031

# తెలుగు సాహిత్యంలో గండర గండడు 'గంద్ర'



భారతీయ భాషా సాహిత్యసేవంలో తెలంగాణ విరజిమ్మిన అక్షర కాంతి వెలుగులు అపూర్వం అద్భుతం. చాళుక్యులు, శాతవాహనులు, కాకతీయులు సామ్రాజ్యాలేలిన రాజులు కవులను పోషించిన తీరు ఎన్నదగినది. వేములవాడ కేంద్రంగా సాహిత్యం పరిఢవిల్లిన దాఖలాలు చరిత్రలో ఎన్నో. ఆ కోవలోనే ఎలగందల నారయ, డా.సి.నారాయణ రెడ్డి, గౌతమరావు వంటి కవులు,రచయితలు సాహిత్యమే జీవితంగా బతికారు. అదే ఒరవడిలో గోపు లింగారెడ్డి, గంద్ర లక్ష్మణరావు, నలిమెల భాస్కర్, జింబో, జూకంటి, పంజాల జగన్నాథం, వారాల ఆనంద్, కాలువ మల్లయ్య, గజేందర్ రెడ్డి, అన్నవరం దేవేందర్, బి.వి.ఎన్. స్వామి లాంటి సాహితీవేత్తలు మానేరు తీరంలోని సాహితీ కృషీవలురే. ఇక గంద్ర లక్ష్మణరావు కవిగా,అవధానిగా,వక్తగా,సాహితీ గౌతమి సంస్థ అధ్యక్షులుగా విశేష సాహిత్య సేవలందించిన సాహిత్యవేత్త. గంద్ర లక్ష్మణ రావు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల దగ్గరున్న పెగడపెల్లి ఊరులో జూన్ 4,1950న జన్మించినారు. లక్ష్మణ రావు ప్రాథమిక విద్య పెగడపెల్లిలో చదివారు.ఎం.ఏ తెలుగు, పి.హెచ్.డి ఉస్మానియా యూనివర్సిటీ నుండి చేశారు. ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాలల్లో తెలుగు లెక్చరర్ పనిచేశారు.రీడర్ గా కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ కరీంనగర్ లో పనిచేస్తూ 2008లో పదవీ విరమణ పొందారు.

కరీంనగర్ జిల్లాలో జరిగే అన్ని సాహితీ సంస్థల కార్యక్రమాలకు ఆయన ఓ ప్రేరణగా ఉన్నారు. గత ముప్పై ఏళ్లుగా సాహితీ గౌతమీ నిర్వహిస్తున్న 'సినారె సాహితీ పురస్కారం' నిర్వహణలో ఆయన ప్రధాన భాగస్వాముల్లో ఒకరుగా ప్రతీతి. ఇలా వివిధ సాహితీ కార్యక్రమాలు నిర్వహించే గంద్ర లక్ష్మణ రావుకు ప్రాచీన సాహిత్యం మీద మంచి పట్టు వుంది. అభినందనలు పురస్కారాలు అందుకున్నారు. డా.గంద్ర లక్ష్మణ రావు గారు అనేక రచనలు చేశారు. అందులో కొన్ని ... 2003లో'ముగ్గు'వచనకవితా సంకలనంతో తెలుగు కవిత్వవాకిలి ముగ్గులోకి దిగారు. 2012లో'వర్తమాన సంధ్య' వచనకవితా సంపుటి తెచ్చారు. లేటెస్ట్‌గా 2023లో 'శతద్రు' వచన కవిత్వం రాశారు. అందులో చాలా మంచి కవితలతో పాఠకులను అలరించారు. 2009లోఒక 'పద్యం నేర్చుకుందాం', 2017లో ఆది మకుటంతో'నీవు' పద్యకావ్యం తీసుకొచ్చారు. 'విశ్వనాథ సత్యనారాయణ వేయి పడగలు-ఒక పరిశీలన' తన పి.హెచ్.డి గ్రంథం వెలువరించారు. 2018లో 'వెర్రి మానవుడు' ఖలీల్ జీబ్రాన్ మ్యాడ్ మ్యాన్ రచనకు తెలుగు అనువాదం చేసి ప్రచురించారు. 'ప్రస్తావన' శీర్షికతో ఎంపికచేసిన నలుబై 'ముందు మాటలు' వివిధ ప్రక్రియల్లో పద్య కవిత్వం, వచన కవిత్వం, నానీలు, శతకాలు, కావ్యాలూ ఉన్నాయి. వీటిలో శ్రీభాష్యం విజయసారథి నుండి అనేక కవులు ఉన్నారు. అక్షరార్చన పేరుతో 1999లో శిరిశినహల్ కృష్ణమాచార్య శతావధాని సాహిత్య వ్యాసాలు స్మారక సంచికగా,రత్నమాల పేరున 2000లో ఆయన అముద్రిత రచనలు ఇంకా



అనేక సాహిత్యసంచికలకు లక్ష్మణ రావు సంపాదకీయంలో అలరించాయి. ఆయన సమైక్య సాహితి,సాహితీ గౌతమి,తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ రచయితల సంఘం వంటి పలు సంస్థలతో క్రియాశీలక సభ్యులు, అధ్యక్షులు, హితవరులుగా ఉన్నారు. గంద్ర లక్ష్మణ రావు సాహితీ సేవకు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. అందులో 2017 లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, 2018లో పి.వీ నరసింహారావు స్మారక పురస్కారం అందుకున్నారు. గత 15 సంవత్సరాలుగా ఆయన బాపు గంద్ర హన్మంతరావు స్మారక సాహితీ గౌతమి అవార్డ్ ను ఐదువేల రూపాయల నగదును రాష్ట్రస్థాయిలో కవిత్వేతర ప్రక్రియ లకు అందిస్తున్నారు. గంద్ర లక్ష్మణ రావులోని మరో పార్శ్వం అవధాన ప్రక్రియ. ఎన్నో అవధానం సభలు అవధానిగా నిర్వహించారు. నిర్వహిస్తూనే ఉన్నారు. ఆయనలో భాష, భావం లయ,అభివ్యక్తి చక్కగా తొణికిసలాడుతుంది. డా.గంద్ర లక్ష్మణ రావు ఎందరికో శ్రేయోభిలాషి, హితవరి, ఆత్మీయుడు, స్నేహితుడు, గురువు ఇలా ...వాట్ నాట్. ఆయన జగమెరిగిన గొప్ప బహుముఖ ప్రజ్ఞా గని. ఎందరినో కావ్యావిష్కరణ సభల ద్వారా సత్కరించి అక్కునజేర్చుకున్న ఘనాపాటి. 1999లో 'మౌనం మాట్లాడింది' కవితా సంపుటి ఆవిష్కరణ బాధ్యత తలెత్తుకున్న సభలో ఆత్మీయంగా కవి మౌనం బద్దలు గొట్టిండని గట్టిగా వ్యక్తీకరించడం ప్రశంసలోని వాస్తవం. ఆ సంపుటి కవి డా.రాధాకృష్ణమా చార్యులు అనే నేనే అవడం యాదృచ్ఛికం. అయితే సాహిత్యం జీవితమై పెనవేసిన రుచి వాసన ఆయనకు కొత్తగాదు. రోజూ దాదాపు అదే ఆయన ఆహారం. ఆహార్యం కూడా. కానీ ఒక్క వచన కవిత్వ పుస్తకం వెయ్యలేదనే లోటు మిగలొద్దనే మిత్రుల వత్తిడి విన్నపం కలిసిన కోరిక దీర్చ ముగ్గు కవిత్వం తెచ్చారు. ఆయన విశ్వనాథ, సినారె, జువ్వాడి గౌతంరావు శిష్యుడు, శిష్య సహవాసి కూడా. విశ్వనాథ వేయిపడగలే అద్భుత నవల. దానిపై పరిశోధన ఎంత గొప్ప మాట. ఇక తన గురువైన డా.సినారెను డా.లక్ష్మణరావు ఎప్పుడు కలిసినా ఏమి రాస్తున్నావు 'గంద్రా' అని ఆతీయంగా పలుకరించేదని సాహిత్య అభిజ్ఞ వర్గాల ఉవాచ. అలాంటి గంద్రవారు వెలువరించిన 'ప్రస్తావన' 40 పుస్తకాలకు పలు శీర్షికలతో తను రాసిన ముందు మాటలను ఓ సంపుటిగా శిష్యుడు కె.అనంతాచారి సంకలంచేశారు. దాన్ని ఆయన తన సినారెగురువు సినారెకు ఎంతో వినయంగా అంకితమిచ్చారు. కవిగా తను రాసిన లేటెస్టు కవితాసంకలనం 'శతద్రు'. ఇందులో కవితలన్నీ హార్ట్ టచ్చింగ్ పోయెమ్స్. మచ్చుకు నల్ల పిట్ట, నర్సిగాడు వంటివి కనిపిస్తాయి. కాదు కాదు పలుకరిస్తాయి. అందులోని కావ్యశీర్షిక కవిత శతద్రులో కవిత చూస్తే 'వందమంది కొడుకులనుకోల్పోయిన మహర్షి వశిష్టుడు/ బ్రతకడం ఇష్టం లేక నదిలో దూకాడు/నీ అంతటి వాడిని నేను భరించలేను,హరించలేను/అని నది నూరుపాయలుగా చీలిపోయింది/ఆ నది శతద్రు/అంటూనే కవితను కొనసాగిస్తూ ...' ఎట్టని పల్లెలు/నెట్టేస్తున్న నగరాలు/బ్రతుకంతా బాటలు బాటలుగా/పాయలు పాయలుగా/ బ్రతుకే తమమై జనారణ్యంలో మనుషులు/ ప్రపంచమంతా ఇప్పుడొక శతద్రు.. అని ముగింపులో నేటి శతద్రును కవిత్వీకరించడం కవికి భాష, భావం, అభివ్యక్తి, శైలి, పోలిక, వస్తువులపై గల పట్టును తెలుపుతున్నది.

**- డా.టి. రాధాకృష్ణమాచార్యులు**
9848305871

## పోలికలు వద్దు.. సంతృప్తియే హద్దు

మన లక్ష్య సాధనలో
ఇతరులతో పోలికలు
వద్దు ఇతరులతో పోటీ
పడితే ప్రతి విషయంలో
మనల్ని వారితో పోల్చు
కోవడం మొదలౌతుంది

వారిపైఅసూయ ఏర్పడి
మనసులో ఆందోళన
చెలరేగి మనోశాంతి కరువై
సంతోషంగా ఉండలేం

మనతో మనమే పోటీ
పడాలి అప్పుడు మాత్రమే
మనల్ని మనం మెరుగు
పరుచు కోవడానికి
మార్గాలు అన్వేషిస్తాం

జీవితలక్ష్య సాధనలో
సంతృప్తియే హద్దు కావాలి
స్వయం సంతృప్తిని
మించిన సంపద లేదు
మన శక్తి సామర్థ్యాలను
పెంచుకోవడం పై దృష్టి
పెట్టాలి

జీవితాన్ని ఇతరులతో
పోలిస్తే ప్రతిక్షణం వృధా
అయినట్లే
పోల్చడం మానుకో
ప్రగతి పథాన సాగిపో

వ్యక్తుల సామర్థ్యాలు వేరు
ఆలోచన ధోరణులు వేరు

అభిరుచులు వేరు
నమ్మిన సిద్ధాంతాలు వేరు
ఎంచుకున్న మార్గాలు వేరు
పుట్టి పెరిగిన పరిస్థితులు
వేరు విజయానికి ఎంచుకున్న
కార్యాచరణ వేరు

సాధించాలనే తపన
మన ఎదుగుదలకు
బీజం వేస్తుంది

మనకు జీవిత లక్ష్యం పైన
జీవన గమనం పైన
స్పష్టత ఉంటే చాలు
అభివృద్ధి సాధన దిశగా
మనం వేసే ప్రతి అడుగు
మన విజయంలో భాగమే

మెరుగైన ప్రయత్నాలు
నైపుణ్య అభివృద్ధి పై
మనం చూపే శ్రద్ధ
సరైన సమయంలో
సరైన నిర్ణయం మనల్ని
ఉన్నత స్థాయికి
చేర్చుతుంది.

త్యాగం సంఘసేవలో
ఏదో ఒక రోజు మనం
ఇతరులకు స్ఫూర్తిగా
నిలువాలి

మన సేవలు స్ఫూర్తిగా
తీసుకొని సమాజ
మార్పుకు ఇతరులు
ఉద్యుక్తులౌతారు
ఉత్తమ సమాజాన్ని
నిర్మిస్తారు.

**- నేదునూరి కనకయ్య**
9440245771

## సూరీడు



నీ స్పర్శ తగలగానే సిగ్గుల మొగ్గలు
పువ్వులై విచ్చుకుంటాయి
నీ చూపు సోక గానే మంచు
బిందువులు
ముత్యాలై మెరిసిపోతాయి
నీ కిరణాలు చూడగానేచీకటి తెరలు
మరుగై
వెలుగు తొంగి చూస్తుంది
నీరాకతో సేద తీరిన రైతు
నాగలి భుజం పై వేసుకుంటాడు
నీ ఆగమనంతో అమ్మ ఒడి వీడి
పిల్లాడు కేరింతలతో ఆడుతాడు
నీ సందడితో లేగదూడలు
చెంగు చెంగున సందడి చేస్తాయి
నీ పిలుపుతో కిల కిల రావాలతో
పక్షులు సవ్వడి చేస్తాయి
నీ రూపానికి సమస్త జీవకోటీ
ప్రణామం చేస్తుంది

**-కయ్యూరు బాలసుబ్రమణ్యం**
9441791239

## కన్నీళ్ల సముద్రం

స్నేహమనే పరిమళం
ప్రతి ధ్వనించే ఘంటారావం..

దేవుడి కోవెలలో ప్రవహించే నిత్య
తీర్థంపు సుగంధం

కరిగే కాలం చుట్టూ
కన్నీళ్ల సముద్రం
చుక్కలు చుక్కలుగా ఆకాశంలో

మేఘామై..తడి ఆరని రెప్ప పాటు
కాలంలో
చినుకు చినుకులతో జత కట్టి

తొలకరి వాన అయి కురిసే
కన్న కలల్ని గద్దల తన్నుకు పోతూ..
చీకటి అలుముకున్న నిరాశ, నిస్పృహల

జీవితాల్ని చక్క దిద్ద.. ఎడబాటుతనపు
గుండె తడి..పండు వెన్నెలయి

రేపటి బతుక్కి చిగురులు తొడగాలి..
కొత్త లోకాన్నికి బాటలు వేయాలి

**- కొండా రవీందర్**
9059237771



## తల(వ)ంపులు



మదిలో మెదిలే తలపులు
మది తలచే తలంపులు
మదిలో కదిలే భావనలు
మదిని తొలచే ఆలోచనలు!
మది ఆకాశమంత విశాలం
ఎన్ని తలపులు దాచిన శూన్యమో!
తలచిన మదికి కొత్తగా
తెలిసి వచ్చేది మాన్యమే!

మదిలో సంఘటన సంఘర్షణలు
వర్షించే చల్లని మేఘాలు
తలపుల వెచ్చని ఆహ్వానాలు
మది పులకింతల వర్షాలు!
మనిషి మది ఓ సంద్రం
మనసు కలతలే అలలు
నడిసంద్రంలో వెతల నావకు
వెరవని తలపులే చుక్కాని!

మది తలచబోకు వెతలు
మానస వీణ మూగబోవు
తలపులే తపనల పాలపుంతలు
బ్రతుకు దారిలో తలవని వింతలు!
మంచి చెడుల వంచన
మనిషి బ్రతుకు చులకన
మది చెడు తలంపులే
మనిషి కి తలవంపులు!

**- పల్లొళ్ళ బక్కారెడ్డి**
9705315250

## బాధ్యతను తెలుసుకుందాం



పిల్లలను కనడంతోనే సరి
వారికి ప్రేమను పంచలేము మరి
ఇది ఉరుకుల పరుగుల యుగం
తల్లిదండ్రులం పెద్దలం
ఎవరి పనుల్లో వారలం
పనుల ఒత్తిడులలో మునిగిరి
పిల్లల బాధ్యత మరిచిరి

టీవీ సీరియల్ల పాత్రల
కష్టాలు తీరూనా అని బెంగ
పిల్లల కష్టాల గురించి
ఆలోచించలేము మరి
సోషల్ మీడియాలో మిత్రులను
పలకరించుటకే సమయము
మరి మన పిల్లలను
పలకరించ లేము మనము
ప్రేమలను ఇవ్వలేము మనం
మరోచోట వెతుక్కుంటే సహించం
ఇకనైనా మేల్కొందాం
బాధ్యతతో వ్యవహరిద్దాం

**- సరికొండ శ్రీనివాసరాజు**
8185890400

# క్షవర సమర శంఖం 'అసిపె'!!

అసిపే కవి వనపట్ల సుబ్బయ్య తనకు ఉరివేసే క్షణం ముందు వరకు పుస్తక పఠనం చేస్తూ ఉన్న భగత్ సింగ్‌లా బలంగా కవిత తత్వాన్ని బతికిస్తున్నవాడు. ఇంకే స్వేచ్ఛ నాకు వద్దు జైల్లో పుస్తక పఠనానికి అనుమతి కావాలని కోరిన నెల్సన్ మండేలా మానవత్వం మరువని సమానత్వాన్ని తగుపాళ్లలో రంగరించి నానబెట్టి మరగ కాచి చల్లార్చి పడబోసి తన అస్థిత్వ నిగూఢత్వాన్ని అనుభవాల జ్ఞాపకాలను తన కలంతో అసిపెను తరిస్తూ రచించాడు బోధి చెట్టు కింద బుద్ధునిలా. మరిచి పోకుండా నా సమాధి పైన రాయండి ఇక్కడ పుస్తకాల పురుగు శాశ్వత నిద్రలో ఉన్నాడు అన్న ఆల్బర్ట్ ఐన్ స్టీన్‌లా ఈ వ్యవస్థలో ఉన్న సంస్థల మాలిన్యాన్ని ఎండగట్టి ఆరబెట్టి దంచి శుభ్రం చేసి చూర్ణం చేసి సాహితి రసగుళికలను అందించిన' అసిపె 'పుస్తక జ్ఞాని. చెమటతో చెక్కిన చక్కని చిక్కని పదాలు.తన మూలలను మరువక వకాల్తా పుచ్చుకున్న వాక్యాలు. పరిచయం అక్కర లేని కవి కలం నుండి జాలు వారి దూసుకొస్తున్న శరాలు. ఆసిపె చదడం అంటే.... సమాజ్యాన్ని చవడమేనని నేను కరాకండిగా చెప్పగలను.




క్రైస్తవులకు బైబిల్ ఎంత ముఖ్యమో....ముస్లింలకు ఖురాన్ ఎంత ముఖ్యమో...హిందువులకు భగవద్గీత ఇంత ముఖ్యమో మంగలోళ్లకు ఈ 'అసిపె పుస్తకం ' అంతే ముఖ్యం. తన పుస్తకాలు చదువుతూ పెరిగి ఈ అసిపే పుస్తకానికి సమీక్ష రాయడం నా పూర్వ సుకృత సంకల్పమెమో కాబోలు. ఇక్కడ కవి ఇలా అంటారు.

అసిపేనే../ఇంటికి బువ్వ/బతుకు బండి/జీవగర్ర, పెన్నుగర్ర/ఆత్మగౌరవ పతాక/కులవృత్తికి కూరాడు/ 'అసిపే' లేకపోతే మాకు బువ్వెక్కడిదని. 'అసిపె'ను తన ఆత్మ గౌరవంతో పోల్చడం ఎంత అనుభూతమైన,వినూత్నమైన లోకంలో విహరింపచేస్తాడు.అనుభూతి సంద్రంలో మునకలు వేయిస్తాడు.

ఇంకా 'అసిపె 'ను కులవృత్తి కూరాడు' అంటాడు.

తన వృత్తిని ప్రవృత్తిని సంస్క ృతిని తన ఉనికిగా వర్ణించడం తన విజ్ఞతకే నిదర్శనం. 'అసిపె'లేకపోతే బువ్వెక్కడిది అనడంలో 'కవి ఆకలిని ఆలింగనం చేసుకొన్నవాడు. అర్థతను మనో ఫలకం పైన శాశ్వతంగ ముద్రించుకున్నవాడు. అందుకే కవి 'అసిపే ' దీర్ఘ కవిత రాయడంలో సఫల్క ృతం అయ్యాడని చెప్పవచ్చు. కూసున్న నడిచినా/కూర్పాట్లు పట్టినా/నెత్తికాడనే అసిపె/మా అయ్య చేతుల 'అసిపె 'ఉంటే.. అశోకుడికి మగధ సామ్రాజ్యం చేతిలో ఉన్నట్లే' అంటూ కవి అనడంలో తన అయ్య ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నా తన పనిని మరువకుండా పనిలో ధ్యాస ఉన్న మట్టి మనిషని. చాలా మంది కవులు కవితలు రాస్తుంటారు .

నిద్రపుచ్చే కవులు కొందరైతే...మేల్కొలిపే కవులు కొందరుంటారు. ఆ కొందరిలో మన'అసిపె' కవి వనపట్ల సుబ్బయ్య గారు ఒకరు.

'క్షవరం వృత్తికి తోలుసంచి/తోలు పెట్టినందించిన/మాదిగ పెద్దయ్యలు/మాదిగ తాతలకు మహా వందనాలు.' తోలును, తోలు సంచులను, తోలు తిత్తులను కనిపెట్టిన తొలి శాస్త్ర వేత్తలు మాదిగలు. అలాంటి మాదిగలను మరువకుండా వాకు స్థానం ఇచ్చిందుకు బరువెక్కిన హృదయంతో చెపుతున్న. శైలి విషయానికి వస్తే ఎటువంటి ఆర్భాటాలు అంగుళాలు లేకుండా పుస్తకం మొత్తం ఏ డొంక తిరుగుడు లేకుండా ఒక మనిషిగా ఆలోచిస్తే ఈ పుస్తకంలో వాస్తవాసలు గోచరిస్తాయి.

మంగలి కత్తులకు మైలలేదు/ కత్తులు చేసేదే మైలపని/మాల మాదిగల్ని తాకిన కత్తులతో మాకు క్షవరం చేయొద్దని అగ్రకుల వెలివేతలు/కత్తికి వాడకు మధ్యన లక్ష్మణ రేఖలు. ఊరు అగ్రవర్ణ హుకుం/మనువాదుల భరతం పడుదాం/అంతస్తుల గోడల్ని కూల్చకుండా సమాజాన్ని మార్చలేం... అనడంలో కవిలో దాగున్న బాధ అంత ఇంత కాదు. అందరూ సమానమన్న గౌతమ బుద్ధుడు, కబీర్,సంతు రవిదాస్, పూలే, అంబేద్కర్‌లను గుండెల నిండా నిలుపుకొని.. కుండలు బద్దలు కొట్టి చెప్పటం ఈ 'అసిపె' దీర్ఘ కవిత పుస్తకపు బలం. మనువాదుల భరతం పట్టి అనురాగపు అత్తరు చల్లుదాం.అంతస్తుల గోడలిని కూలగొట్టి మానవత్వపు సమానత్వపు గంధం పూద్దాం.

**- పోలె వెంకటయ్య**
9951914867

# ప్రశ్నించే లేఖాస్త్రాలు 'అవ్యక్తం'



కవయిత్రి మంజు యనమదల పలు సందర్భాలలో రాసిన వ్యాసాలతో పుస్తక రూపంలో 'అవ్యక్తం' మన ముందుకు వచ్చింది. సమాజాన్ని సున్నితంగా ప్రశ్నించే వ్యాసాలు. నిజాలను నిగ్గు తేల్చే లేఖాస్త్రాలు. 'సగటు మనిషికి న్యాయం అందుబాటులో లేనప్పుడు, ఎన్ని చట్టాలు చేసినా! ఉపయోగం లేదు. నీతులు, సూక్తి ముక్తావళులు చెప్పడం మానేసి, ముందు మనం ఆ చెప్పేవాటిలో కొన్నయినా పాటించి, అప్పుడు చెప్తే మన మనస్సాక్షికి మనం సమాధానం చెప్పుకోగలం.'

ఇలా తనలోని భావాలను, ఎవ్వరేమనుకున్నా నాకేమిటి? నేను వ్రాయాలనుకున్నది వ్రాస్తూవుంటా. 'నిజాలను నిర్భయంగా ప్రకటించడంలో, నా స్వేచ్ఛను ఎవరి మెహర్బానీ కోసమో, కోల్పోలేను' అని చెప్పగల సాహసం మంజు యనమదలది. ఇలా ఎన్నో విషయాలపై తనదైనశైలిలో , వ్యవస్థలోని అనేక విషయాలను లోతుగా విశ్లేషిస్తూ వ్రాసిన వ్యాసాలను 'అవ్యక్తం లేఖా వ్యాసాలు' పేరుతో పుస్తక రూపంలోనికి తీసుకురావడం హర్షించదగ్గ విషయమని చెప్పుకోవచ్చును. వ్యక్తపరచాలి అనుకున్నది, వ్యక్తపరచలేనిది, తెలుసుకున్నది నలుగురితో పంచుకోవాలనే తపనకు మూలం ఈ 'అవ్యక్తం'.




నేటి సమాజాన్ని అధ్యయనం చేస్తూ, మనిషి అంతరంగాన్ని శోధిస్తూ, సమగ్ర పరిశోధనాత్మక వ్యాసాలు పొందుపర్చిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదివి తీరవలసిందే.

అందుకు రచయిత్రి ముందు మాటలే బలం చేకూరుస్తాయి. వారి మాటల్లోనే 'ఎవ్వరు ఏమనుకున్నా నేను చెప్పాలనుకున్నది వ్రాయడం, నా మనసు చెప్పినట్లు వ్రాయడమే నాకు అలవాటు, లెక్కలు కోసమో మరిదేనికోసమో నేను రచనలను చేయడం లేదు..

నా మనస్సులోని భావాలను వెల్లడిస్తున్నాను' అంటారు రచయిత్రి.

నిజమైన ప్రతిభకు గుర్తింపు తక్కువే అనే వాస్తవాన్ని 'వ్యవస్థకు కావాల్సింది వ్యక్తిత్వం కాదు, విలువలు కాదు, వ్యక్తిగా గుర్తింపు మాత్రమే. ఆ గుర్తింపు అధికారం, బలం, ధనం వలన వస్తుంది' అనే సూటి మాటల్తో సమాజాన్ని పోస్టుమార్టం చేసి చూపించారు 'అర్హత' అనే వ్యాసంలో.

కొన్ని వందల ప్రశ్నలకు సమాధానం ఒక్కోసారి మౌనం మాత్రమే. కొన్ని దశాబ్దాలు మౌనం విస్ఫోటనం చెందితే వెలువడేది అక్షర వ్యాసం అనేది వాస్తవం అంటాను నేను.

ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ఈ వ్యాసాల్లో రచయిత్రి పొందుపరిచారు. నేడు ప్రపంచాన్ని తన అధీనంలోకి తెచ్చుకున్న టెక్నాలజీ, వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో, వాటిని విజ్ఞాన సముపార్జనకు వినియోగించుకోవాలనే సందేశంను అందించిన వ్యాసం చాలా విలువైనది.

నేటి సమాజంలోని కొందరి ప్రవర్తనను ప్రస్తావిస్తూ 'వల్లమాలిన ప్రేమలు కురిపిస్తూ, లోపల విషపు సెగ విరజిమ్మే నైజాలిప్పుడు మన చుట్టూ చాలా ఎక్కువే, మనం జాగ్రత్తగా మసలుకోవాలి. ఈ నటనలే అగ్రస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. చూసి చూసి మనకూ నటన అలవాటై పోతుందేమోనని భయము వేస్తోంది' అంటారు రచయిత్రిగా. 'రెప్పపాటు ఈ జీవితానికి ఎన్ని రెప్పలు కింద కన్నీటిని పారించాలో, శత్రువును తలుచుకున్నంతగా, మిత్రులను కూడా తల్చుకోం కొన్ని బాధ్యతల నడుమ బంధాలకు చోటు తక్కువే మరి' అనే వాస్తవాన్ని నిర్భయంగా ప్రకటించడంలో, రచయిత్రి తాను ఎదుర్కొన్న ఎన్నో పరిస్థితుల ప్రభావం కావచ్చు.

ఇలా ఎన్నో విషయాలపై, అనేక కోణాలలో పరిశీలించి తనదైనశైలిలో భావాలను ప్రస్ఫుటంగా ప్రకటించారు.

**- రాము కోలా**
9849001201

# వక్ఫ్ సవరణ చట్టంపై తప్పుడు ప్రచారం

## పేద ముస్లింలకు న్యాయం చేయడానికే వక్ఫ్ సవరణ చట్టం

- రఘునాథ్ వెరబెల్లి



మంచిర్యాల, 20, ఏప్రిల్, ( మనం న్యూస్): వక్ఫ్ సవరణ చట్టం పై తప్పుడు ప్రచారం, పేద ముస్లిం కు న్యాయం చేయడానికే వక్ఫ్ సవరణ చట్టం అని మంచిర్యాల జిల్లా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి లు అన్నారు . ఆదివారం మంచిర్యాల జిల్లా కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది . కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డ్ సవరణ పై కాంగ్రెస్ మరియు ఎంఐఎం పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ బీజేపీ నాయకులూ ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ను ప్రక్షాళన చేయాలనే ఉద్దేశంతో వక్ఫ్ ఆస్తులు పేద ముస్లింలకు దక్కాలనే ఉద్దేశంతో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకవస్తే దాని పై కాంగ్రెస్ ఎంఐఎం , ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ స్వలాభం కోసం బిల్లు పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇన్ని రోజులు వక్ఫ్ ఆస్తుల పేరుతో కొన్ని సంపన్న ముస్లిం పెద్దలు అవినీతికి పాల్పడి ఆస్తులను దోచుకున్నారని , కానీ మోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు ముస్లిం లో పేదలకు మరియు వెనుకబడిన ముస్లింలకు కూడా ఈ ఆస్తులు చెందాలనే ఉద్దేశంతో ఈ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి ఆమోదం పొందేందుకు కృషి చేశారని తెలిపారు.

కానీ కొన్ని మతతత్వ పార్టీలు ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంక్ కోసం వక్ఫ్ పై ముస్లిం ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలు ఎవరు కూడా వక్ఫ్ పై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, వక్ఫ్ ఆస్తులు అందరికీ అందుబాటులో ఉండేలా మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.ఈ సమా వేశంలో పట్టి వెంకట కృష్ణ, కొయ్యల ఎమాజీ, గాజుల ముఖేష్ గౌడ్, తాజ్ ఖాన్, ఎనగందుల కృష్ణ మూర్తి, అమిరిశెట్టి రాజు, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, మాసు రజిని, అక్కల రమేష్, రాకేష్ రెన్వ, బూర్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

మంచిర్యాల, 20, ఏప్రిల్, ( మనం న్యూస్): తమ ప్రజా ప్రభుత్వం మహిళలను రాష్ట్రంలో కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వం లక్ష్మని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు . ఆదివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆద్వర్యం లో మంచిర్యాల నియోజకవర్గం హాజీపూర్ మండలంలోని హజీపూర్ గ్రామంలో దండేపల్లిలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రారంభించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ , కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు అమలు చేస్తున్న సక్షేమ పతకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మహిళలు సన్మానించారు.. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల కళ్ళల్లో వెలుగు నింపుతున్న రేకుర్తి కంటి ఆసుపత్రి




మంచిర్యాల, ఏప్రిల్, 20 ( మనం న్యూస్): డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఉదార నేత్ర వైద్యశాల రేకుర్తి, కరీంనగర్ సౌజన్యంతో వైస్ చైర్మన్ లయన్ చిదురా సురేష్ సహకారంతో లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ, లయన్స్ క్లబ్ బెల్లంపల్లి విజన్ కేర్ ల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఉచిత నేత్ర వైద్య చికిత్స శిభిరం మంచిర్యాల జిల్లా లోని భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తర్వాత అక్కడ 28 మంది రేకుర్తిలో కంటి ఆపరేషన్ విజయవంతంగా ముగించుకొని నేడు తిరిగి వచ్చిన సందర్భముగా 320 జిల్లా విజన్ సెక్రటరీ లయన్ డాక్టర్ కె.సుగుణాకర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ఛైర్పర్సన్ ఫర్ ఐ క్యాంప్స్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్,మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ బాలమోహన్, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాకేశ్ రెడ్డి, విజన్ కేర్ అధ్యక్షులు సయ్యద్ ఇలియాస్ లు అందరిని ఆప్యాయతగా పలుకరించి వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు చెప్పిన విధంగా తగిన విధంగా జాగ్రత్తగా ఉంటూ మందులు వేసుకోవాలని, కంటిని కాపాడుకోవాలన్నారు ఈ సందర్భంగా పేషంట్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రేకుర్తి కంటి ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందరు మమ్మల్ని మంచిగా చూసుకున్నారని, చాలా ఏండ్ల నుంచి కళ్ళు కనిపించక చాలా తిప్పలయ్యింది.రేకుర్తి దావఖానోళ్ల, లయన్స్ క్లబ్బోళ్ళు దయవల్ల మాకు కంటి చూపు వచ్చిందని, మా లాంటి నిస్సహాయకులకు ఎంతో ధైర్యం వచ్చిందన్నారు మీ అందరికి దండాలయ్య అంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భముగా వారికి లయన్స్ సభ్యులు ధైర్యం చెబుతూ వారికి పండ్లను పంపిణీ చేశారు. ఈ నల 26 నాడు తిరిగి రేకుర్తి కంటి ఆసుపత్రికి తప్పకుండ వెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ పేషెంట్స్ వెంట వెళ్లిన సహాయకులు తదితరులు కూడా పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి రద్దు

సుల్తానాబాద్/ పెద్దపల్లి ఏప్రిల్ 20 (మనం న్యూస్): పెద్దపల్లి కలెక్టరేట్ లొ సోమవారం (21.04.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూభారతి కొత్త ఆర్ఓఆర్ రెవిన్యూ చట్టం అమలు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందున, అధికారులంతా ఆ సదస్సులకు హాజరు కావలసిన ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



# కేంద్ర హోం సహాయ శాఖ మంత్రికి ఘన సన్మానం



సుల్తానాబాద్ ఏప్రిల్ 20 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ పెద్దపల్లి కి వివాహానికి వెళుతూ బీ జే పీ పార్టీ నాయకుల ఆదేశాల మేరకు సుల్తానాబాద్ లోని పూసాల రోడ్డు చౌరస్తా లో బండి సంజయ్ ఆగడంతో బీ జే పీ నాయకులు ఆదివారం ఆయనకు పూల గుచ్చం అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, జిల్లా కార్యదర్శి సౌదరి మహేందర్ యాదవ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు చాతరాజు రమేష్, తిరుపతి, ప్రవీణ్, రాజేంద్ర ప్రసాద్, రఘుపతి రావు వేంకటేశ్, అన్వేష్,

సంతోష్, సతీష్, బుర్ర సతీష్, ఎల్లయ్య, పవన్, పల్లె తిరుపతి, కుమార్, సాయి కుమార్, సృజన్ బీ జే పీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# అధికారం కోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది

## బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్




మంచిర్యాల, 20, ఏప్రిల్, ( మనం న్యూస్): ధికారం కోస ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మాజీ ప్రభుత్వ విప్, బాల్క సుమన్ అన్నారు . ఆదివారం జిల్లా కంద్రం లో రాటు చేసిన మీడియా సమావేశం లో పలు విమర్శలు చేశారు .రానున్న రోజుల్లో హస్తం పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రభుత్వ పనితీరుపై ఘాటు విమర్శలు చేశారు. అధికారం లోకి వచ్చిన ఈ 16 నెలల కాంగ్రెస్ పాలన ప్రజావ్య తిరేకతను మూటగట్టుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకు పడ్డారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపించార ని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందు కు బీఆర్ఎస్ ప్రభుత్వంపై దాడికి దిగుతుందన్నారు . ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోడంతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అంటూ ఏడాదిన్నర కాలంలోని ప్రభుత్వ వైఫల్యాలను తెలిపారు కాంగ్రెస్ నేతలు ప్రతిపక్ష పార్టీపై విమర్శలకే పరిమితమవుతున్నారన్నారు .బీఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలు ప్రజలందరికి తెలుసునని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివద్ధిని చేయకుండా కేవలం మాటలకే పరిమితమవుతోందని అన్నారు. రైతుల కోసం తమ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని, రెండు లక్షల రుణ మాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని, కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. అర్థంలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదని అభివద్ధి పనులు ఏవీ చేపట్టకుండా, కాళ్ళ బొల్లి మాటలతో కాలం గడుపు తున్నారని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే, ప్రజలు సమయాను కూలంగా తగిన బుద్ధి చెబుతారని ,చెన్నూర్ నియోజకవర్గంలో మైనింగ్, ఇసుక దందాలు శతిమించాయని, 'వందల కొద్ది లారీల ఇసుక అక్రమంగా తరలిపోతు న్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని అన్నారు. గంజాయి,మద్యం, మత్తు పదార్థాల విని యోగం విపరీతంగా పెరిగిపోయిందని, మంచిర్యాల జిల్లా గంజాయి దందాకు అడ్డాగా మారిందని, ఇంత జరుగుతున్నా. పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నదని సుమన్ ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న "ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం కోట్ల రూపాయల ఆట ఆడుతున్నారని,అధికార యంత్రాగం అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తు న్నదని, ప్రజాధనాన్ని దోచుకుంటున్నా,అవినీతి అడ్డుకోకుండా అధికారులు మౌనంగా ఉండటం శోచనీ యమన్నారు .కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతప్తితో ఉన్నారన్నారని , స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్కు గుణపాఠం తప్పదన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందని బాల్క సుమన్ అన్నారు .ఈ సమా వేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొన్న మంచిర్యాల ఎమ్మెల్యే

మంచిర్యాల, 20, ఏప్రిల్, ( మనం న్యూస్): ఆదిలాబాద్ జిల్లా కేంద్రం ఖానాపూర్ నియోజకవర్గం లోని ఇంద్రవెల్లి లో ఆదివారం జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కూడా పాల్గొన్నారు . ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క తో కలిసి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కూడా నివాళులు అర్పించిన అనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, మా నాన్న గారి పేరు




మీద కీ,శే, కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అమరవీరుల కుటుంబాలకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయలను అందజే స్తామన్నారు. మరోసారి ఇంద్రవెల్లి అమరవీరులకు నా జోహార్లు అని అన్నారు ఈ కార్యక్రమంలో ఇంకా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా ఆర్థో క్యాంప్



మంచిర్యాల, 20, ఏప్రిల్, ( మనం న్యూస్) : మంచిర్యాల జిల్లా లోని కన్నెపల్లి మండల కేంద్రమైన కన్నెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాటశాలలో మంచిర్యాల గర్మిల్ల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకర హాస్పిటల్స్ ,హైదరాబాద్ స్పాన్సర్ చేసిన ఉచిత మెగా ఆర్థో క్యాంప్ ను క్లబ్ సభ్యులు నిర్వహించారు. దాదాపు 150 మంది రోగులకు వైద్యుల బృందం వివిధ రకాల పరీక్షలను చశారు . 2 వేల విలువగల బిఎమ్డి పరీక్షలను ఉచితంగా జరిపారు. అందరినీ బిఎండి పరీక్ష ద్వారా పరీక్షలు చేసి రోగులకు వైద్యుల ప్రిస్క్రిప్షన్ ప్రకారం 5 వేల విలువైన మందులు అందించారు.రోగులకు మరియు వారి సహాయకులకు చంప జేసి భోజనాలను కూడా ర్పాటు చశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత బాధితులకు విలువైన సేవలను అందించిన వైద్యుల బృందంన , వారి సిబ్బందిని లైన్స్ క్లబ్ సబ్యులు సత్కరించారు .ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ లయన్ సిరిపురం శ్రీనివాస్ అట్లాడుతూ, తమ విలువైన సమయాన్ని కేటాయించి న శ్రీకర హాస్పిటల్స్ కు స్పాన్సర్ షిప్ ఏర్పాటు చేసినందున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రాలో నేరెళ్ల శ్రీనివాస్ , మల్లి కార్జున్ , దొడ్డా శ్రీనివాస్ , గోపాల్ రెడ్డి , పల్లెర్ల శ్రీహరి , సద్దనపు రాంచందర్ , వంగల సంపత్ , చిత్త గిరిబాబు ల ఆర్థిక సహాయంతో మందులుఇచ్చారు భవిష్యత్ కార్యక్రమాలలో కూడా ఈ ఉచిత విఅద్య శిబిరం కోసం సహకారం కావాలని, అలాగే ఆ సహకారం కూడా ఉంటుందని అధ్యక్షులు బల్లు శంకర్ లింగం అన్నారు .సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు . ఈ ఉచిత మెగా ఆర్థో క్యాంప్ లో క్లబ్ సభ్యులు కే వెంకటేశ్వర్లు, అధ్యక్షులు బల్లు శంకర్లింగం, జి. సుధాకర్, ఎస్. రమేష్ బాబు మరియు పల్లెర్ల శ్రీహరి, నేరెళ్ల శ్రీనివాస్, దొడ్డా శ్రీనివాస్, కె. మల్లికార్జున్ మరియు డాక్టర్లు సింహం సిరిపుయం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు పుట్టినరోజు

- టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కేసరి నాగయ్య ముదిరాజ్



గరిడేపల్లి,ఏప్రిల్ 20,(మనం న్యూస్): బావి తరాలకు భారత దేశానికి చంద్రబాబు నాయు డు సేవలు ఎంతో అవసరమని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు కీసరి నాగయ్య ముదిరాజ్, అ న్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నా యుడు 75వ జన్మదిన సం దర్భంగా గరిడేపల్లి మండల కేంద్రంలో ఎన్.టి.ఆర్ బొమ్మ దగ్గర ఆయన జన్మదిన వేడుకలను ఘ నంగానిర్వహించారు.తెలుగుదేశం పార్టీ అభిమానుల మధ్య ఆనం దోత్సవాల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఆయన హయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు రాష్ట్రం అభివృద్ధిచెందిందన్నారు.తెలంగాణ లో కూడా టిడిపి పార్టీ పున ర్నిర్మాణం చేపట్టి పునర్ వైభవం తీసుకురావడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయ నకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో గరిడేపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాతకోటి లింగారెడ్డి గరిడేపల్లి మండల ఎస్టీ సెల్ అధ్య క్షుడు గుగులోత్ రవి నాయక్,పాన్ నాయక్,అనంతు తిరపయ్య, రాజ మ్మ,వెంకటమ్మ,రాములమ్మ,నరస య్య,సైదులు,శ్రీనివాస్ పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎక్కడ ఇబ్బందులు వచ్చిన మాకు తెలపండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



సుల్తానాబాద్ ఏప్రిల్ 20 (మనం న్యూస్): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు ఎక్కడ ఇబ్బందులు వచ్చిన మా కు తెలపండి అని పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండ లంలోని కనుకుల, రామునిపల్లి, అల్లీపూర్, రేగడి మద్దికుంట గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో, రైతులు, మహిళ లతో కలిసి ఆదివారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారం భిం చారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అం తటి అన్నయ్య గౌడ్, సుల్తానా బాద్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు కోట వీణ మల్ల రెడ్డి, మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీ ష్ మరియు మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, మహిళలు, రైతు లు, పార్టీ నాయ కులు, కార్య కర్తలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేయాలి

- 100 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ చేయాలి
- పడాల రవీందర్ గౌడ్




సుల్తానాబాద్ ఏప్రిల్ 20 (మనం న్యూస్): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ,రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ,స్థానిక పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కి విజ్ఞప్తి చేశారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్య సేవలు అందక రోగులు వైద్యం కోసం జిల్లా ఆస్పత్రి ,ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందని పడాల రవిందర్ గౌడ్ అన్నారు. విశాలమైన భావనం ఉన్నా ఆసుపత్రి (అప్ గ్రేడ్) ఉన్నతీకరణ చెందక పోవడంతో తిప్పలు తప్పడం లేదు గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రి గా ఉన్నతీకరిస్తే గైనకాలజిస్ట్, అనస్థీషియా, సర్జన్,పీడీయాట్రిక్, సివిల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తే సదరరన్ శిబిరాలను ఇక్కడ నిర్వహించవచ్చు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు రోగులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అలాగే పూర్తి స్థాయిలో ప్రసవాలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.

గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేస్తే మరింత వైద్య సేవలు అందుతాయి జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన తెలిపారు.

గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేసి, ప్రత్యేక వైద్య నిపుణులను, వైద్య సిబ్బందిని నియమించి పారామెడికల్ సిబ్బందితో సహా మౌలిక సదుపాయాలను కల్పించి నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని బీ సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్ ,స్థానిక పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు చొరవ తీసుకోవాలని పడాల రవీందర్ గౌడ్ కోరారు.

# గురునాథ విద్యార్థుల ఆత్మీయ కలయిక

- రెండు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలిసిన స్నేహితులు






సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 20, (మనం న్యూస్) : ఒకేచోట చదువుకొని రెండు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్నారు గురునాథ పాఠశాల పూర్వ విద్యార్థులు. ఆదివారం రోజున సిద్దిపేట జిల్లా మిట్టపల్లి శివారులోని కె ఎన్ ఆర్ క్రిసో రిసార్ట్ లో రెండు దశాబ్దాల తర్వాత 2004-2005 విద్యా సంవత్సరం ఎస్.ఎస్.సీ. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి హాజరయ్యారు. అనంతరం బి స్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాల తర్వాత విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకొని, గురువులను సన్మానించుకోవడం సమాజానికి గురుతరమైన బాధ్యతగా భావించవచ్చన్నారు. చిన్ననాటి నుండి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని మల్లారెడ్డి తెలిపారు. సమాజం నాకేమిచ్చింది అనే బదులు సమాజానికి మనం ఏం చేశాము అని ప్రతి వ్యక్తి గుర్తెరిగిన రోజు సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ వివిధ హోదాలలో స్థిరపడడానికి కృషి చేసిన గురునాథ విద్యాలయం ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, ఆనందంలో తేలియాడారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురునాథ విద్యాలయం పూర్వ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హిందువులపై దాడులు సరికాదు

- సోషల్ మీడియాలో హిందువుల గురించి ముస్లిం యువకుడి పోస్ట్
- ఆగ్రహం వ్యక్తం చేసిన హిందూ సంఘాలు
- భారీగా మోహరించిన పోలీస్ బలగాలు
- దుబ్బాక సీ.ఐ. శ్రీనివాస్ నేతృత్వంలో భద్రతా పర్యవేక్షణ




మిరుదొడ్డి, ఏప్రిల్ 20, (మనం న్యూస్) : పశ్చిమబెంగాల్లో హిందువుల పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ వాహిని ఆధ్వర్యంలో మిరుదొడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన ర్యాలీ పట్ల ఓ ముస్లిం యువకుడు చేసిన సోషల్ మీడియా పోస్ట్ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో మిరుదొడ్డి మండల కేంద్రంలో శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకోగా, హిందూ సంఘాలు సదరు ముస్లిం యువకుడి ఇంటిముందు నిరసన చేయడానికి వెళ్తుండగా విషయం తెలుసుకున్న మిరుదొడ్డి,దుబ్బాక పోలీసులు మిరుదొడ్డికి చేరుకొని భారీగా మోహరించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని ఆధ్వర్యంలో వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీపై సామాజిక మాధ్యమం ద్వారా గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉండడంతో ముస్లిం యువకుడి ఇంటి ముందు ధర్నా చేయడానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. దీంతో



మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా దుబ్బాక సీ.ఐ. శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామంలో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. ప్రధాన వీధుల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హిందువాహిని కార్యకర్తలు డిమాండ్ చేయగా, వారిని పోలీసులు శాంతింప చేసి ఆందోళన విరమింప



చేశారు. అనంతరం అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడుని అరెస్టు చేయాలని కోరుతూ దుబ్బాక సిఐ శ్రీనివాస్ తో పాటు మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో హిందూ వాహిని ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

## బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతా




- పీపీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు
- పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్ రెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 20, (మనం న్యూస్ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సిద్దిపేట జిల్లా ప్రధాన కోర్టుకు మొట్టమొదటి రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా రాష్ట్ర ప్రభుత్వం తనకు అవకాశం కల్పించిందని అడ్వకేట్ జీవన్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఆదివారం రోజున ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనపై ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా తన వంతుగా ప్రభుత్వానికి సహకారం అందిస్తానన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడడంతోపాటు నిందితులకు శిక్ష పడేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. బాధితులకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా వాటిని తీరుస్తానన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో ఇప్పటివరకు చాలా కేసులు పెండింగ్లో ఉన్నాయని వాటిపై దృష్టి సారించి కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కోర్టు నిర్వహించే ప్రతి సమీక్షలో పాల్గొని కేసులు పరిష్కరిస్తామన్నారు. క్షణికావేశంతో చేసిన నేరాల వల్ల ఎంతోమంది కుటుంబాలకు దూరమవుతున్నారని, నేరాలకు పాల్పడిన వారందరికీ శిక్షలు పడేలా చేసి ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో అడ్వకేట్ పత్రి ప్రకాష్, ఖలిముద్దీన్ పాల్గొన్నారు.

## అక్రమంగా పశువుల తరలింపు అడ్డగింత

కొండపాక, ఏప్రిల్ 20, (మనం న్యూస్): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తుండగా పలువురిని దుద్దెడకు చెందిన పలువురు అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. సిద్దిపేట నుంచి కొండపాక వైపు బొలెరో వాహనంలో తొమ్మిది ఆవులు, ఒక లేగను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా మురళి అనే వ్యక్తి గమనించి హిందూ వాహిని సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు తెలిపారు. దాంతో త్రీ టౌన్ పోలీసులు చేరుకొని దుద్దెడ టోల్గేట్ వద్ద



వాహనాన్ని అడ్డగించి డ్రైవర్ ను విచారించారు. నల్గొండ సంత నుంచి హైదరాబాద్ మూసాపేటకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని తేలడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని అక్రమంగా పశువుల తరలింపు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




కొమురవెల్లి, ఏప్రిల్ 20, (మనం న్యూస్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బి ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొంగు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 265 మందికి కంటి పరీక్షలు చేయగా పురుషులు 110 మంది, మహిళలు 155 మంది పాల్గొని కంటి పరీక్షలు చేసుకోగా అందులో 85 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి ఆసుపత్రికి ప్రత్యేక వాహనం ద్వారా పంపించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్ రెడ్డి తెలిపారు. రోగులందరికీ ఉచితంగా చికిత్స, రవాణా, మందులు, భోజన వసతులు కల్పిస్తామని శస్త్ర చికిత్స అనంతరం ఫాలో అప్ ట్రీట్మెంట్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలలో ఇలాంటి వైద్య శిబిరాలు మరెన్నో ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తామని పేర్కొన్నారు. బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమురవెల్లి మండలంలోని పేద ప్రజలకు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, యువతకు క్రీడారంగం లో ప్రోత్సాహం వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు.

గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితులు తెలుసుకొని ఆ మృతుల కుటుంబాలకు బిఆర్ఆర్ ఫౌండేషన్ తరపు నుండి ఆర్థిక సాయం అందించడంలో చాలా గొప్ప విషయం అని అన్నారు. నిరుపేద కుటుంబాలలో ఆడపిల్ల పెళ్లి జరిగిన ఆ ఇంటి ఆడపిల్లకు పుస్తె మాట్టెలు అందించడంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ ముందుందని అన్నారు.

యువతకు క్రీడా రంగంలో ఎన్నో సేవా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న బి ఆర్ ఆర్ ఫౌండేషన్ సేవలందించడంలో చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల తాజా మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థుల నిర్మాణమే లక్ష్యం

- భిన్నరంగాలపై విద్యార్థులకు అవగాహన
- అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన విద్యార్థులు
- క్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి






సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 20, (మనం న్యూస్): విద్యార్థులను ప్రతి రంగంపై అవగాహన కలిగి ఉండేలా తీర్చిదిద్దుతూనే వారికి భిన్న రంగాల పట్ల తగిన అభిరుచి పెంచేలా తోడ్పాటు అందించడం జరుగుతుందని క్రాంతి హై స్కూల్ కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి పేర్కొన్నారు. క్రాంతి పాఠశాల విద్యార్థులు ఆదివారం రోజున హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని క్షేత్ర సందర్శనకు వెళ్ళారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సందర్శనలో విమానయాన రంగంలో వివిధ కోణాలపై విద్యార్థులకు విమానాశ్రయ అధికారులు క్లుప్తంగా వివరించారని తెలిపారు. విమానాల నిర్మాణంతో పాటు ఇంజనీరింగ్ వ్యవస్థ, విమానాలు ఎలా ఎగురుతాయి, వాయు రవాణా నియంత్రణ వ్యవస్థ లాంటి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ప్రతిరంగంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా



కృషి చేస్తున్నామన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన విమానాశ్రయ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో పాఠశాల చైర్మన్ అర్పిత రెడ్డి, ప్రిన్సిపాల్ కుమారస్వామి,

ఉపాధ్యాయులు రవి, శ్రీలత, శాంతి, మంగ, శ్రీనివాస్, విద్యార్థులు ఉన్నారు.

## 26న సప్తశతి పుస్తకావిష్కరణ



సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 20, (మనం న్యూస్) : ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు కవి వంగరి వెంకటేశం రచించిన సప్తశతి మణిపూసలు పుస్తకావిష్కరణ ఉంటుందని బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. అన్ని పూసల కవిత దినోత్సవం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఏడు వందల మణిపూసలు పుస్తకావిష్కరణ జరగడం సంతోషమని ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆదివారం మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం, అతిథులుగా అడ్డగూడి ఉమాదేవి, ఆశీర్వాదం, వడిచర్ల సత్యం, మచ్చ అనురాధ, దోమకొండ అంజయ్య, నూనె రాజయ్య, ఐత చంద్రయ్య, పట్నం భూపాల్, సంగీతం నరసింహారావు, కుందారం యాదగిరి, సిహెచ్ రాజు తదితరులు హాజరవుతారని తెలిపారు. కావున కవులు, రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కరపత్ర ఆవిష్కరణలో పుస్తక రచయిత వంగరి వెంకటేశం, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, పుస్తక సమీక్షకులు వరుకోలు లక్ష్మయ్య, శాడ వీరారెడ్డి, అనిశెట్టి సతీష్ కుమార్, బాలచంద్రం, నూనె రాజయ్య, యాదగిరి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు



- దర్శనానికి మూడు గంటల సమయం
- వీకెండ్ కావటంతో పెరిగిన భక్తుల రద్దీ
- భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట ఆలయం

హైదరాబాద్, (మనం ప్రతినిధి) : తెలంగాణలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అధిక రద్దీ కారణంగా ఉచిత దర్శనానికి దాదాపు 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటకు పైగా సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేసవి వేడిని తట్టుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.

ఇక ఇటీవల ఎండోమెంట్స్ సవరణ బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లు యాదగిరిగుట్ట ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం చేసింది. ప్రతిపాదిత యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డులో చైర్మన్‌తో సహా 18 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఎస్సీ, బీసీ వర్గాల ప్రతినిధులు, ఒక మహిళా ప్రతినిధి, ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ ఉంటారు. ఒక ఐఏఎస్ అధికారిని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తారు. బోర్డు సభ్యుల పదవీ కాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. స్వయంప్రతిపత్తి కలిగిన టీటీడీ బోర్డు మాదిరిగా కాకుండా, యాదగిరిగుట్ట బోర్డు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుంది. బోర్డుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వమే కేటాయిస్తుంది. పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని యాదగిరిగుట్ట ఆలయ నిర్వహణ, పరిపాలన, అభివృద్ధిని సమర్థవంతంగా చూసుకోవడం ఈ బోర్డు ఏర్పాటు యొక్క ప్రధాన లక్ష్యం. ఆలయం పరిధిలోని విద్యా సంస్థలు, వేద పాఠశాలలు, గోశాల నిర్వహణను కూడా ఈ బోర్డు పర్యవేక్షిస్తుంది. యాదగిరిగుట్ట ఆలయం చుట్టూ ఉన్న 1,241 ఎకరాలను మూడు మున్సిపాలిటీలు, ఆరు గ్రామాలను కలుపుకొని 'టెంపుల్ సిటీ'గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైటీడీ బోర్డు ఆధ్వర్యంలో వేద విద్యా సంస్థలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు..

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలతోపాటు సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

ఇదిలాఉంటే, పొద్దంతా తీవ్రమైన ఎండలు దంచికొడుతున్నాయి. సాయంత్రానికి వానలు పడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40-44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. సాయంత్రం వానలు కురుస్తుండటంతో వాతావరణం కాస్త చల్లబడుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 43.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా మానకొండూర్లో 43.4, సిరిసిల్ల జిల్లా కోనరావుపేట, ఇల్లంతకుంట, నిజామాబాద్ జిల్లాలో 42.3 డిగ్రీలు నమోదైంది.

జనగామ జిల్లా నర్మెట మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఆగపేట, గండిరామవరం, వెల్దండ, అమ్మాపురం, మచ్చుపహడ్, హన్మంతాపూర్, బొమ్మకూరు తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది.

విద్యుత్తు తీగలు, స్తంభాలపై చెట్లు విరిగిపడి కొన్నిచోట్ల కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చాలాచోట్ల కోతకు వచ్చిన వరిపంట నేలవాలి ధాన్యం రాలిపోయింది. వెల్దండలోని ఓ కొనుగోలు కేంద్రంలో క్వింటాళ్ల కొద్ది ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వానలు పడుతున్నాయి.

# పెళ్లి పీటలపై వధువుకు బదులుగా తల్లి..

- వరుడి షాక్.. ఉత్తరప్రదేశ్ మీరట్‌లో ఘటన
- కుమార్తె పేరుకు బదులుగా.. తల్లి పేరును మౌల్వీ పిలవడంతో అనుమానం
- ముసుగు తొలగించి చూసి నిర్ఘాంతపోయిన పెళ్లికొడుకు
- అల్లరి చేస్తే రేప్ కేసు పెడతా(రు)మని బెదిరించిన వరుడి అన్నావదినలు



హైదరాబాద్, (మనం ప్రతినిధి) : ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. అలీగఢ్‌లో ఓ మహిళ కాబోయే అల్లుడితో పరారు కాగా, బుదౌన్లో వియ్యంకుడితో వియ్యపురాలు వెళ్లిపోయింది. తాజాగా, మీరట్లో పెళ్లి పీటలపై వధువుకు బదులుగా ఆమె తల్లి కనిపించడంతో వరుడు నిర్ఘాంతపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. బ్రహ్మపురికి చెందిన మొహమ్మద్ అజీం (22)కు శామలీ జిల్లాకు చెందిన మంతశా (21)తో వివాహం నిశ్చయమైంది. నిఖా సందర్భంగా మౌల్వీ వధువు పేరును 'తాహిరా' అని పిలవడంతో వరుడికి అనుమానం వచ్చింది. వెంటనే ముసుగు తొలగించి చూసి షాక్ అయ్యాడు. మంతశాకు బదులుగా భర్త చనిపోయిన ఆమె తల్లి (45) వధువు వేషంలో కనిపించడంతో నిర్ఘాంతపోయాడు. తన తరపున పెద్దలుగా వ్యవహరించిన అన్నావదినలే వధువు కుటుంబంతో కుమ్మక్కై ఈ దారుణానికి తెగబడినట్టు తెలుసుకుని విస్తుపోయాడు. అల్లరి చేస్తే అత్యాచారం కేసులో ఇరుక్కోవాల్సి వస్తుందని వారిద్దరూ అజీంను బెదిరించారు. దీంతో తాను మోసపోయినట్టు గ్రహించిన అజీం పోలీసులను ఆశ్రయించాడు. పెళ్లి కోసం తాను రూ. 5 లక్షలు ఖర్చు చేశానని వాపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ముగ్గురు మంత్రులున్నా నిష్ప్రయోజనం

**రైతుల బాధలు పట్టని పాలకులు**
**కమ్యూనిస్టులపై సన్నగిల్లిన నమ్మకం**
**తడిసిన ధాన్యానికి ఎకరాకు రూ.20 వేలు నష్టం పరిహారం చెల్లించాలి**
**27న టిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి..**
**ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత**



ఖమ్మం, ఏప్రిల్ 20(మనం బ్యూరో)ః ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా నిష్ప్రయోజనమని, ఏనాడూ రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. ఆదివారం ఆమె ఖమ్మం పర్యటనకు వచ్చారు. తొలుత రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో తేనీటి విందుకు వచ్చిన కవితకు బిఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభతో తెలంగాణలో ఒక ఉత్సాహ వాతావరణ నెలకొందన్నారు. తెలంగాణ జన జాతర, ఇది మన జాతర అని ప్రజలు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు .. కానీ ధాన్యం తడిసిపోతే కనీసం పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రైతులు కన్నీళ్లు కారుస్తున్నారు. కనీసం రైతుల కష్టాల మీద ఒక్క రివ్యూ కూడా చేయటం లేదు. ప్రభుత్వం కనీసం ఒక మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తర్వాత అంత స్థాయిలో ఉన్న ఉప ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాలోనే ఉన్నారని, డిప్యూటీ సీఎం అంటే ఎంత బాధ్యత .. ఆలోచన ఉండాలి...?. ఈ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఒకరి మీద ఒకరు ఆధిపత్యం చెలాయించుకుంటున్నారు .. తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా అంటే కమ్యూనిస్టుల జిల్లా అని పేరు ఉంది. ప్రశ్నించే కమ్యూనిస్టులు కూడా ప్రస్తుతం ప్రశ్నించకపోవడంతో కమ్యూనిజం మీద నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న కమ్యూనిస్టు పెద్దలు ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం వల్లే ప్రశ్నించడం లేదా.? అని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తొమ్మిది, పది నెలల్లోనే ఇదే జిల్లాలో భక్త రామదాసు ప్రాజెక్టు కట్టించి 60 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి పదిహేను, 16 నెలతైంది. ఒక కొత్త పథకం లేదు. కొత్త ప్రాజెక్టు లేదు..ముఖ్యమంత్రి పాలన గురించి, మాటల గురించి చెప్పనవసరంలేదని ఎద్దేవా చేశారు. తాను ఖమ్మం రాగానే ఒక కాంగ్రెస్ పార్టీ నాయకుడు తన బాధను వ్యక్తం చేశాడని, గ్రామ శాఖ పదవికి రాజీనామా చేశారని చెప్పాడని పేర్కొన్నారు. జపాన్ పర్యటన చేస్తున్న ముఖ్యమంత్రి వాళ్ళ అగ్రనేతల మీద కేసులు పెడితే కూడా స్పందించలేదన్నారు. వాన పడి రాష్ట్ర రైతుల అవస్థలు పడుతుంటే ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని, అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. రాష్ట్రంలో పాలన పడకేసిందని, మంత్రులు ములుగు పర్యటనకు పోతే.. ఆసుపత్రిలో దుస్థితి వల్ల చనిపోయిన పసిపాపను చూపించారని అన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన ఏ ఒక్క పని అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ సంపూర్ణం చేశామని ఘోరమైన అబద్ధాలు చెప్పారన్నారు. రైతు కూలీలకు ఇస్తామన్న రైతుభరోసా పథకం ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజల మన్ననలు కోల్పోయిందని, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని అన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ ను ఎంకరేజ్ చేయాలని, ఏప్రిల్ 27న టిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. బలమైన నాయకత్వం ఉన్న ఖమ్మం జిల్లా నుంచి ప్రజానీకం పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఏలు హరిప్రియ నాయక్, చంద్రావతి, బాణోత్ మదన్‌లాల్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



**కవిత పర్యటన ఇలా...**

ఆదివారం సాయంత్రం ఖమ్మం చేరుకున్న కవిత తొలుత ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో తేనీటి విందుకు హాజరయ్యారు. అనంతరం సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం తెలంగాణ జాగృతి నాయకులు గట్టు అరుణ కుమారుడి రిసెప్షన్‌ను హాజరయ్యారు. అనంతరం మాజీ ఎంఎల్ఏ, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావును పరామర్శించారు. అనంతరం కల్లూరు మండలం లింగాల గ్రామంలోని బిఆర్ఎస్ నాయకుడు దేవరపల్లి పట్టాభిరామ్ గృహప్రవేశానికి హాజరయ్యారు.

## ధాన్య కొనుగోలు వేగవంతం చేయాలి



- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

తల్లాడ, ఏప్రిల్ 20(మనం న్యూస్)ః ధాన్య కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్ తల్లాడ మండలం, రంగంబంజర గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలు, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు డబ్బు చెల్లింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేసి, సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పనితీరును అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాల కల్పన చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, అధికారులు తదితరులు ఉన్నారు.

## చెరువులు, కుంటలు, పంట కాలువలకు మరమ్మత్తులు



- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట, ఏప్రిల్ 20(మనం న్యూస్)ః నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో పనిచేస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. ఇందిరమ్మ చెరువు బాట.కార్యక్రమాన్ని దమ్మపేట మండలం నాగుపల్లిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద చెరువుల మరమ్మత్తులు కుంటల పునరుద్ధరణ పంట కాలువల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నాగుపల్లి నాయుడుపేట. గున్నేపల్లి. ముష్టిబండ .దమ్మపేట. లింగాలపల్లి గ్రామాలలో పలు చెరువులు, కుంటలు, పంట కాలవలు, చెక్ డ్యామ్ ల మరమ్మత్తులు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు నీటి లభ్యత పెరిగి సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. చెరువులు తిరిగి ప్రాణం పొంది గ్రామీణ నీటి వనరులు భూగర్భజలాలు బలోపేతం అవుతాయన్నారు. పంట కాలువల ఆధునీకరణ ద్వారా సాగు వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారనుందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె సురేష్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ కృష్ణ, ఏఈఈలు కె కృష్ణ, జి గోపాల్ రావు, గంగాధర్ రావు, కోటగిరి సత్యంబాబు, కుంపటి వేణు, చిన్న శెట్టి యుగంధర్, అత్తులూరి వెంకట రామారావు, ముల్లపూడి వెంకటేశ్వరరావు రావు, పండు, మడకం రాజేష్, ఆలమూరి కామేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, పగడాల రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు, దొడ్డ భాస్కరరావు, సోయం రామారావు, రొయ్యల కుమార్, తంగెళ్ల విశ్వనాథ్, చిన్నశెట్టి మధు శంకర్, భద్రరావు, జే ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం రూపకల్పన

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక
- రావిగూడెం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్



ఖమ్మం(నేలకొండపల్లి) ఏప్రిల్ 20(మనం న్యూస్)ః భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్.ఓ.ఆర్. భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నేలకొండపల్లి మండలంలోని రావిగూడెం గ్రామంలో నిర్వహించిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సు కార్యక్రమం లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, వీటిలో మన ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం ఒకటని అన్నారు. గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూ ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని,దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసి నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణిత గడువు లోగా పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. రావిగూడెం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి అధికారులు 64 దరఖాస్తులు వివిధ భూ సమస్యలకు సంబంధించి స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని బోదలబండ గ్రామంలో ఆదివారం తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్ రెవెన్యూ సదస్సు నిర్వహించి 103 దరఖాస్తులు వివిధ భూ సమస్యలపై గ్రామస్థుల నుండి స్వీకరించి, దరఖాస్తుదారులకు రశీదులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ నోడల్ అధికారిణి ఎం. రాజేశ్వరి, మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, నాయబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ లు శ్రీనివాస్, రవి, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



- కొమరం భీమ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలి....
- మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి

ఆళ్లపల్లి, ఏప్రిల్ 20 (మనం న్యూస్): నేటి యువత కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఆయన ఆశయాల సాధనకై ముందుకు సాగాలని ఆళ్లపల్లి మండలం మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ కమ్యూనిటీ హాల్ స్థల ప్రాంగణంలో కొమరం భీం విగ్రహ ఆవిష్కరణకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదివాసి ఐక్య కార్యా చరణ సమితి మండల అధ్యక్షులు పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి మాట్లాడుతూ కొమరం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని, ఆదివాసుల హక్కుల కోసం నిజాం ప్రభుత్వ దమనవిధానాలకి వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడని, జల్ జంగల్ జమీన్ (నీరు,అడవి,భూమి ) అనే నినాదంతో ఆదివాసీల హక్కులను కాపాడటానికి తన ప్రాణాలను అర్పించిన యోధుడనీ అన్నారు.నేటి యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో అన్యాయానికి, అసమానతలకు వ్యతిరేకంగా నిలబడి, సమానత్వ హక్కుల కోసం పోరాడాలన్నారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వగుణం, సామాజిక బాధ్యత వంటి విలువలు అవసరమనీ అన్నారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్న మైనదని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కొమరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మాజీ సర్పంచ్ మెస్సు కోటేశ్వరరావు, పి ఎస్ ఎస్ డైరెక్టర్ ఈసం సాంబశివరావు, ఏఈడబ్ల్యూసీఏ జిల్లా కార్యదర్శి జోగ రాంబాబు, ఊకె కిషోర్ బాబు, వజ్జ పగడయ్య, గొగ్గల వెంకటేశ్వర్లు, బట్టు సురేష్, కొమరం వెంకటకృష్ణ, గొగ్గల గాదెరాజు, సుబ్బారావు, అర్రెమ్ బాలకృష్ణ, గొగ్గల వినోద్, ఏడుల్ల రామనాథం, ఏడుల్ల రమేష్, గొగ్గల లక్ష్మయ్య, కొమరం గాదెరాజు, కల్తీ హనుమంతు, మెస్సు శ్రీను, చందా వీరయ్య, వట్టం ముత్తయ్య, ఏడుల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం వలన రైతులకు బహుళ ప్రయోజనాలు

- ధరణిలో లేని అప్పిల్ భూ భారతిలో ఉంది
- వివరాలు అన్ని ఆన్లైన్లో నమోదు చేయబడతాయి
- దోమలపల్లి లో నిర్వహించిన రైతు వేదికలో కలెక్టర్ ఇలా త్రిపాఠి




నల్లగొండ,ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి )ః భూ భారతి చట్టం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.భూ భారతిపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా ఆదివారం ఆమె నల్గొండ జిల్లా, నల్గొండ మండలం, దోమలపల్లి రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై రైతులకు తెలంగాణ భూ భారతి (భూమి హక్కుల చట్టం -2025) పై అవగాహన కల్పించారు. ధరణిలో ఎలాంటి సవరణలు చేసేందుకు అవకాశం ఉండేది కాదని,భూ భారతి లో రికార్డులను అప్ డేట్ చేసే అవకాశం ఉందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన మీదటే భూములు రిజిస్ట్రేషన్ చేసే అవకాశం భూ భారతిలో ఉందని తెలిపారు. ధరణిలో అనుభవదారు కాలం లేదని, భూ భారతిలో అనుభవదారుకు ప్రాధాన్యత ఉంటుందని ,మొఖా మీద ఉంటే పట్టా అమలవుతుందని,భూ భారతిలో భూములకు సంబంధించిన వివరాలన్నీ ఆన్లైన్లో నమోదు చేయబడతాయని, ఈ వివరాలన్నీ అన్ని శాఖలకు పంపించడం జరుగుతుందని ,ఎవరైనా ఈ వివరాలను చూసుకోవచ్చని, వీటిని సవరించే అధికారం ఆన్లైన్ లో ఉండదని, కేవలం సంబంధిత అధికారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు .ఆధార్ లాగే భూములకు భూదార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, రుణాలు కావాలంటే రైతు ఎలాంటి కాగితాలు సమర్పించాల్సిన అవసరం లేదని, ఆన్లైన్లో ఉన్న భూముల వివరాలు ఆధారంగా రైతుకు రుణం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ధరణిలో లేని అప్పీల్ అవకాశం భూ భారతి లో ఉందని ఆమె వెల్లడించారు. మ్యుటేషన్లు ఆటోమేటిక్ గా జరుగుతాయని, మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో చేయడం జరుగుతుందని, ఒకవేళ 30 రోజుల్లో కాకపోతే, 31 వ రోజు ఆటోమేటిక్ గా మ్యుటేషన్ అవుతుందన్నారు. మ్యుటేషన్,రిజిస్ట్రేషన్లు తప్పుగా చేసినట్లయితే సంబంధిత అధికారిపై చర్య తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ధరణి ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్లు సవరణలు చేసే అధికారం లేదని ,ఇప్పుడు జిల్లా స్థాయిలోనే సవరణలు చేసే అధికారం ఉందని ఆమె తెలిపారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని తీసివేసి ధరణి స్థానంలో కొత్త చట్టం తెస్తామని చెప్పడం జరిగిందని, వాగ్దానం మేరకు భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. రైతులకు ధరణిలో లేని ఎన్నో వెసులుబాటులన్నీ భూ భారతి చట్టం కల్పిస్తుందని, ఇందులో అప్పిల్ అవకాశం ఉందని ,గతంలో భూముల సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ రైతులు తిరిగే వారిని, ఇప్పుడు ఆ అవసరం లేదని తెలిపారు. భూ భారతి ద్వారా అసైన్ భూములు ,పిఓటి భూములు ,సాదా బైనమా వంటి అన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని అన్నారు. తమ ప్రభుత్వం భూ భారతి వంటి ప్రతిష్టాత్మక చట్టంతో పాటు, 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని, సన్నబియ్యాన్ని ఇస్తున్నదని చెప్పారు. అంతేకాక బైపాస్ రోడ్డు, డబుల్ రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి సంక్షేమ పథకాలన్నింటిని, వాగ్దానాలన్నింటిని సంవత్సరంలో పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఆర్డిఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, వైస్ చైర్మన్ వెంకన్న, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

# గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేయాలి

- **100 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ చేయాలి**
- **పడాల రవీందర్ గౌడ్**



**సుల్తానాబాద్ ఏప్రిల్ 20 (మనం న్యూస్):** సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రి గా అప్ గ్రేడ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ,రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ,స్థానిక పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కి విజ్ఞప్తి చేశారు.గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్య సేవలు అందక రోగులు వైద్యం కోసం జిల్లా ఆస్పత్రి ,ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళాల్సిన దుస్థితి నెలకొందని పడాల రవిందర్ గౌడ్ అన్నారు. విశాలమైన భావనం ఉన్నా ఆసుపత్రి (అప్ గ్రేడ్) ఉన్నతీకరణ చెందక పోవడంతో తిప్పలు తప్పడం లేదు గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రి గా ఉన్నతీకరిస్తే గైనకాలజిస్ట్, అనస్థీషియా, సర్జన్,పీడీయాట్రిక్, సివిల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తే సదరరన్ శిబిరాలను ఇక్కడ నిర్వహించవచ్చు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు రోగులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. అలాగే పూర్తి స్థాయిలో ప్రసవాలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేస్తే మరింత వైద్య సేవలు అందుతాయి జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన తెలిపారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేసి, ప్రత్యేక వైద్య నిపుణులను, వైద్య సిబ్బందిని నియమించి పారామెడికల్ సిబ్బందితో సహా మౌలిక సదుపాయాలను కల్పించి నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని బీ సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్ ,స్థానిక పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు చొరవ తీసుకోవాలని పడాల రవీందర్ గౌడ్ కోరారు.

# కామ్రేడ్ కాగు ఎల్లయ్య సేవలు మరువలేనివి

**మర్రిగూడ, ఏప్రిల్ 20(మనం న్యూస్):** సిపిఐ తిరగండ్లపల్లి గ్రామం సీనియర్ నాయకులు కామ్రేడ్ కాగు ఎల్లయ్య సేవలు మరువలేనివని సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి,మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్ అన్నారు.ఎల్లయ్య పార్థిమ దేహానికి సిపిఐ నాయకులు పూలమాలాలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ కాగు ఎల్లయ్య తిరగండ్ల పల్లి గ్రామాల్లో జరిగిన అనేక భూవిక్తి పోరాటాలు స్మశాన వాటిక పోరాటం ముందుండి నడిపించి సాధించారని,దున్నే వాడికే భూమి పేదల అందరి పనికి తగ్గ సమాన వేతం అందాలని,అన్నివర్గాల పక్షాన నిలబడి మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణ,ఎలిమినేటి రాంరెడ్డిలతో కలిసి పోరాటం చేశారని వారి పోరాటం ఆ గ్రామం ప్రజలు మరువ లేనిది అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు ఆకుల రఘుమయ్య,ఎరుకల నిరంజన్ సిపిఐ సీనియర్ నాయకులు కళ్లెం యాదిరెడ్డి ఆకుల వెంకట్రామ్,జక్కలి అంజయ్య, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సిరసవాడ నరసింహ,అల్వాల నరసింహ, కర్తీష్ రెడ్డి హరీష్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**సుల్తానాబాద్ ఏప్రిల్ 20 (మనం న్యూస్):** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు ఎక్కడ ఇబ్బందులు వచ్చిన మాకు తెలపండి అని పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల, రామునిపల్లి, అల్లీపూర్, రేగడిమద్దికుంట గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో, రైతులు, మహిళలతో కలిసి ఆదివారం పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు కోట వీణ మల్ల రెడ్డి,మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిలుక సతీష్ మరియు మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మహిళలు,రైతులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం వార్షికోత్సవానికి ఆహ్వానం



**ఆత్మకూర్(ఎం), ఏప్రిల్ 20 (మనం న్యూస్):** సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం 8వ వార్షికోత్సవం భువనగిరి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న సందర్భంగా మండల కేంద్రానికి విచ్చేసిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి వార్షికోత్సవ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నేతలు వంగ శ్రీనివాస్, అంబటి రవి, కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపై జరుగుతున్న దాడులు, తనిఖీల పేరిట జరుగుతున్న అవమానాలను వారికి వివరించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మమ్ములను కాపాడాల్సిన బాధ్యత మీదే అని పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ వార్షికోత్సవ కార్యక్రమానికి తప్పకుండా వస్తామని మాట ఇచ్చారు. గ్రామీణ వైద్యుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలను పరిష్కారం చేయడానికి నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. గ్రామీణ వైద్యులకు మా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉపేందర్ రెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, బత్తిని ఉప్పలయ్య గౌడ్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంగ శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి అంబటి రవి కిరణ్, మండల ప్రచార కార్యదర్శి మస్కు నరేందర్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు తవిటి అచ్చయ్య, శ్రీరాముల అత్రి , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి




**ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 20 (మనం న్యూస్):** ఆత్మకూరు మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించి ప్రతి ఒక్కరికి స్వంత గూడు ఉండాలనే మంచి ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్న సందర్భంగా పేద వారు ఇండ్లు కట్టుకోవడానికి 5 లక్షలు సరిపోవు కాబట్టి బీసీ, ఎస్ సి, ఎస్ టి, మైనార్టీ వాళ్ళకి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డిని, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలతోనే గుర్తింపు

- **ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి**

**మునుగోడు ఏప్రిల్ 20(మనం న్యూస్):** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజు జరిగిన మొదటి వార్షికోత్సవం (యానివల్ డే) ప్రోగ్రామ్ విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలంటే ప్రభుత్వం పాఠశాలలతోనే సాధ్యమని అన్నారు. విద్యార్థులు ఆటపాటలతో డ్యాన్సులతో అలరించారు,ఈ కార్యక్రమంలో. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, డీసీసీబీ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ చొల్లేటీ వెంకటాచారి,తాళ్లమల్ల మల్లేశం, పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు మేకల జాన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అద్దంకి సునీల్, నారబోయిన రవి, కర్నాటి స్వామీ, హెచ్ఎం సుంకరి భిక్షం గౌడ్, బసరాజు అంజయ్య, శాయిదా, పీ ఆర్ టీ యు సంఘం ఉపాధ్యాయుల, తదితరులు, పాల్గొన్నారు.




## ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**మర్రిగూడ, ఏప్రిల్ 20(మనం న్యూస్ ):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75 సంవత్సర జన్మదిన వేడుకలు మర్రిగూడ టీడీపీ మండల అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్ ఆధ్వర్యం ఇందుర్తి గ్రామంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించటం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు చూపు కలిగిన నాయకునిగా తెలంగాణ అభివృద్ధి ప్రధాత,పరిపాలనలో నూతన విధానాలు ప్రవేశపెట్టి నవ సమాజం కోసం అహర్నిశలు శ్రమిస్తూ 75 సంవత్సరాలు వయసు లో 25 వసంతాల యువకునిగా భావితరాల బాగుకోసం ఆలోచిస్తూ సంపద పెంచాలి, నిరుపేదలకు పంచాలనే నూతన విధానం ప్రవేశపెట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళ్లాలని ఆలోచనతో ముందుకు దూసుకువెళ్తు తెలుగు జాతికి త్రేతాయుగం నాటి శ్రీరామ రాజ్యాన్ని స్థాపించడానికి ఎంతో ఓర్పుతో కృషి చేస్తున్న నాయకులు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. చంద్రబాబు నాయుడు ఆశయం నెరవేరాలని సంపూర్ణ ఆయురారోగ్యాలతో , సకల సంపదలు ప్రసాదించాలనీ భగవంతుని కోరుకొంటూనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుప్పాల యాదయ్య, పోలె మల్లయ్య, వీరమళ్ళ మల్లేష్ గౌడ్, విరమళ్ళ రమేష్ గౌడ్, ఎరుకొండ రాములు, మాడ్గుల యాదయ్య, బుర్ర వెంకటయ్య, డాక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# 800 కేజీల బెల్లం.. పటిక పట్టివేత




- **ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్ గౌడ్**

**మిర్యాలగూడ ఏప్రిల్ 20 (మనం న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన బెల్లాన్ని... అదేవిధంగా పటిక ను పట్టుకున్నట్లు మిర్యాలగూడ ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్ గౌడ్ ఆదివారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్ చౌక్ ఏరియా సమీపంలో సాధారణ తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న బెల్లాన్ని గుర్తించి విచారణ చేపట్టగా భారీగా బెల్లం, పటిక ఉన్నట్లు తేలిందన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంలో నివాసముండే బైసాని సత్యనారాయణ బెల్లం తరలిస్తున్నట్లు చెప్పారు. అయితే సదరు బెల్లం వ్యాపారి షాబునగర్ సమీపంలో గోడౌన్ లో బెల్లం నిల్వలను స్టాక్ ఉంచినట్లు చెప్పారు. మొత్తం ఇతని నుంచి 800 కేజీల బెల్లం, 1400 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై గతంలో రెండు కేసులతో పాటు, బైండోవర్ ఉందన్నారు. సదరు వ్యాపారి సారా తయారీకి షాపులకు బెల్లం విక్రయిస్తున్నట్లు తెలిపారు. బెల్లం ఎక్కడి నుంచి వచ్చింది... ఎన్నాళ్ల నుంచి విక్రయిస్తున్న విషయమై సదరు వ్యాపారి విచారణకు సహకరించటం లేదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ చెప్పారు.

# కేసీఆర్ మరోసారి సీఎం కావాలే

- **ఆయన ముఖ్యమంత్రి అవడం చారిత్రక అవసరం**
- **రాబోయే ఎన్నికల్లో మన గెలుపుకోసం కాదు.. తెలంగాణ సమాజానికే కేసీఆర్ కీలకం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మొన్నటి ఎన్నికల్లో మనం ఓ(డటం)టమితో మనకు జరిగిన నష్టం తక్కువే.. కానీ, మన ఓటమితో తెలంగాణ సమాజానికే ఎక్కువ నష్టం జరిగిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇది నూటికి నూరు శాతం.. అక్షర సత్యం, వాస్తవం అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ సమాజానికి మళ్లీ తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసుకోవడం చారిత్రక అవసరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాల్సిన బాధ్యత తెలంగాణ సమాజంపై ఉంది. ఈ 27న.. వరంగల్‌కు తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారంనాడు తెలంగాణ భవన్‌లో పార్టీలో చేరికలు జరిగాయి. రాజేంద్ర నగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీలో అత్తాపూర్ డివిజన్ నుండి శ్రీరామ్ రెడ్డి, పలు పార్టీల నేతలు చేరారు. వారందరికి కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పదేండ్ల పాటు సంక్షేమాన్ని, అభివద్ధిని జోడెద్దుల్లాగా కేసీఆర్ పరుగులు పెట్టించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశ స్థాయికి తీసుకుపోయి స్వరాష్ట్రాన్ని సాధించిన గులాబీ జెండా.. మన నాయకుడు కేసీఆర్. ఈ రికార్డును ఎవరూ చెరపలేరు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని ఎవరన్న అనుకుంటే అది వారి అజ్ఞానం. రేవంత్ రెడ్డి మీద నోరుపారేసుకుని మన నోరును కరాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికి తెలంగాణ మీద ప్రేమ ఉంటది.. రైతులకు, పేదలకు, విద్యార్థులకు, మహిళలకు లాభమైతది అని చర్చ పెట్టాలి అని కేటీఆర్ సూచించారు. బీజేపీ దేశంలో మతం పిచ్చి లేపడం తప్ప చేసిందేమీ లేదు. ప్రపంచ ర్యాంకుల్లో వివిధ రంగాల్లో వెనక్కి పోతున్నాం అని అన్నారు. రేవంత్ నాయకత్వంలో తెలంగాణ వెనక్కి పోయినట్టే.. మోదీ నాయకత్వంలో దేశం వెనక్కి పోతుందన్నారు. నెగిటివ్ పాలిటిక్స్ తప్ప బీజేపీ చేసిందేమీ లేదు. మనం కేంద్రానికి ఇచ్చేది రూపాయి అయితే వాపస్ 45 పైసలు వస్తుంది. ఈ దేశానికి సాదుతున్న రాష్ట్రాల్లో మన తెలంగాణ కూడా ఒకటి. మత పిచ్చి అనేది మంచిది కాదు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. హిందువులు ప్రమాదంలో ఉన్నారట. 2014 వరకు మంచిగా ఉన్న హిందువులు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నరాట. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లేని పంచాయితీ ఇప్పుడు ఎందుకు కొత్తగా పెడుతున్నారు. రాజకీయం కోసం దేశాన్ని విడగొడుతున్నారు. మంచి పనులు చేసి ఓట్లు అడగాలి. హిందు, ముస్లిం, పాకిస్తాన్, జై శ్రీరాం, మోదీ.. ఈ ఐదు పదాలు చెప్పకుండా ఓట్లు అడిగేటోళ్లు ఎవరైనా ఉన్నారా..? అని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణకు సంబంధించినంత వరకు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు శత్రువులే అని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఆనవాళ్లు చెరిపేస్తామనడం అనాగరిక చర్య

పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనవాళ్లు చెరిపేస్తామనడం అనాగరిక చర్య అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంచి పనులను ఆదరించాలి.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇవాళ నష్టపోయింది కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ కాదు. ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతుందన్నారు. ఔటర్ లోపల కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలకు ప్రజలు మోసపోలేదు. బీఆర్ఎస్ పార్టీని గెలిపించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు ఇవ్వలేదు. గోషామహల్ కూడాపోయేది కాదు.. ఆగమాగం వల్లే పోయింది. ప్రజలు ఎప్పుడైనా మంచి పనులను ఆదరిస్తారు అని కేటీఆర్ పేర్కొన్నారు. తులం బంగారం కోసం ఆడబిడ్డలు ఆశపడ్డారు. రైతుబంధు రూ. 15 వేలు అని చెప్పేసరికి రైతులు కూడా ఆశపడ్డారు. రూ. 2 లక్షల రుణాల వరకు మాఫీ చేస్తామని చెప్పేసరికి ఆశపడ్డారు. రూ. 4 వేల పెన్షన్ ఇంటికి ఇద్దరికి ఇస్తామని చెప్పేసరికి ఆశపడ్డారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు నింపుతానని రాహుల్ గాంధీ అశోక్ నగర్లో ఫోజులు కొట్టి చెప్పేసరికి.. మనం ఇచ్చిన 1 లక్షా 60 వేల ఉద్యోగాలు మరిచిపోయారు. పిల్లలు కూడా కొంత టెంప్ట్ అయ్యారు. 420 వాగ్దానాలు చేసి మోసం చేశారు కాంగ్రెసోళ్లు. డిక్లరేషన్ల పేరిట మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తినే పల్లెంలో మన్ను పోసుకున్నట్టు అయింది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**జాజిరెడ్డిగూడెం, ఏప్రిల్ 20 (మనం న్యూస్):** జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరకొండ రామ్మూర్తి కుమారుడు దేవరకొండ వీరేష్-( సర్దార్)- ప్రత్యూష వివాహానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన వధూవరులను తుంగతుర్తి శాసనసభ్యులు ముందుల సామేలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపల్లి సోమిరెడ్డి, ఇందుర్తి వెంకట రెడ్డి, గుడిపల్లి మధుకర్ రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దాసరి సోమయ్య, తిరుమలగిరి మార్కెట్ డైరెక్టర్ తాటిపాముల జలంధర్, జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు నర్సింగ వెంకటేశ్వర్లు గౌడ్, బట్ట మేకల రామ్మల్లు, జాజిరెడ్డిగూడెం మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాద గాని విక్రమ్ గౌడ్, వజె వీరయ్య, కుంభం యాగయ్య,దలువాయి రేఖ శ్రీధర్, కుంభం మధు, బోయపల్లి జలంధర్, నిద్ర సంపత్ నాయుడు, సైదుల కిరణ్ ,నర్సింగ సమ్మయ్య, కుంభం వీరయ్య, నిమ్మల కుమార్,కోటమర్తి శ్రీకాంత్, కుంభం నరేష్, అల్వాల రమేష్, నర్సింగ శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

**హుజూర్ నగర్ ఏప్రిల్ 20, (మనం న్యూస్):** బైకును తప్పించబోయి స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపుతప్పి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన సంఘటన సూర్యాపేట జిల్లాలోని చింతలపాలెం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ డిపోకు చెందిన కోదాడ నుండి నక్కగూడెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాద సమయంలో సుమారు 60 మంది ప్రయాణికులు ఉండగా, వారిలో 25 మంది స్వల్పంగా గాయపడ్డారు. పదిమందికి తీవ్రగాయాలు కాగా వారిని నాలుగు అంబులెన్స్ ల సహాయంతో క్షతగాత్రులను హుటాహుటిన మేళ్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి, హుజూర్ నగర్ ఏరియా ఆస్పత్రులకు తరలించారు.ఈ ప్రమాదానికి ముఖ్య కారణం, బస్సు డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బస్సును నియంత్రించేందుకు ప్రయత్నించాడు.ఆ సమయంలో బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదం జరిగిన వెంటనే చింతలపాలెం యువత మానవత్వం చాటి, సహాయ చర్యల్లో పాల్గొని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడంలో సహకరించారు. ఇదిలా ఉండగా అదుపుతప్పి బస్సు బోల్తా పడటంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో స్థానికంగా కలకలం రేపింది.







# చినోడు చిచ్చర పిడుగే..

14 ఏళ్లు.. స్కూల్లో పాఠాలు చదువుకునే వయసు. ఆటలాడినా అది ఆటవిడుపుకే. కానీ ఈ వయసులో వైభవ్ సూర్యవంశీ అనే కుర్రాడు ప్రపంచ అత్యుత్తమ క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ లో అరంగేట్రం చేశాడు. అది కూడా మొక్కుబడిగా కాదు. తొలి మ్యాచ్ లోనే మెరుపులు మెరిపించి ఔరా అనిపించాడు. శనివారం నాటికి ఈ బిహార్ కుర్రాడి వయసు 14 ఏళ్ల 23 రోజులు మాత్రమే. ఐపీఎల్ లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడు అతడే. ఇప్పటికే దేశవాళీల్లో మెరుపులతో తన ప్రతిభను పరిచయం చేసిన సూర్యవంశీని.. యువ ప్రతిభకు పెద్ద పీట వేసే రాజస్థాన్ వేలంలో రూ.1.1 కోట్లకు కొనుక్కుంది. ఈ సీజన్ తొలి 7 మ్యాచ్ ల్లో సూర్యవంశీకి అవకాశం దక్కలేదు. గాయంతో సంజు దూరం కావడంతో ఈ కుర్రాడికి లఖ్ నవూపై తొలి అవకాశం దక్కింది. ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదిన సూర్యవంశీ.. తర్వాతా ధాటిగానే ఆడాడు. 20 బంతుల్లోనే 34 పరుగులు చేసిన అతను.. మార్ క్రమ్ బౌలింగ్ లో స్టంపౌటయ్యాడు. తొలి మ్యాచ్ లో చక్కటి ఇన్నింగ్స్ ఆడినప్పటికీ.. ఇంకా ఎక్కువసేపు నిలవలేకపోయాననే బాధతో సూర్యవంశీ కన్నీళ్లు పెట్టుకుంటూ పెవిలియన్ చేరడం విశేషం.

## ఆ ఇద్దరిని మిక్సింగ్ చేస్తే వైభవ్ బ్యాటింగ్: కోచ్ మనీశ్ ఓజా

రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్ లోకి అడుగు పెట్టిన వైభవ్ సూర్యవంశీ అదరగొట్టాడు. తన జట్టుకు ఓటమి ఎదురైనా.. వైభవ్ మాత్రం ఆకట్టుకున్నాడు. 14 ఏళ్లకే పరిణతి కలిగిన ప్లేయర్ గా ఆడినట్లు కామెంట్లు వచ్చాయి. కాస్త బొద్దుగా కనిపించడానికి కారణం ఏంటో తాజాగా వైభవ్ కోచ్ మనీశ్ ఓజా వెల్లడించారు. గత ఐపీఎల్ మెగా వేలంలో వైభవ్ ను రూ. 1.1 కోట్లకు రాజస్థాన్ తీసుకున్న సంగతి తెలిసిందే. ''ఐపీఎల్ బరిలోకి దిగేముందు వైభవ్ చాలా సన్నద్ధమయ్యాడు. అతడి డైట్ కూడా చాలా మారిపోయింది. మటన్ తినేందుకు అనుమతించలేదు. వైభవ్ కు పిజ్జా అంటే చాలా ఇష్టం. పిల్లలకు ఎవరికైనా ఇంతే. కానీ, ఐపీఎల్ కోసం పిజ్జాకూ దూరంగా ఉండిపోయాడు. ఇంతకుముందు అతడు మటన్ బాగా తినేవాడు. మేం ఎంత ఇచ్చినా సరే మిగిల్చేవాడు కాదు. అందుకే, కాస్త బొద్దుగా కనిపిస్తాడు'' అని మనీశ్ తెలిపారు.



## బెంగళూరుకు ఐదో విజయం..

ఐపీఎల్ 18 సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదో విజయం అందుకుంది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని బెంగళూరు 18.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దేవ్ దత్ పడిక్కల్ (61; 35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్ లు), విరాట్ కోహ్లీ (73*; 54 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో మెరిశారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (1)ని అర్ష్ దీప్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ లోనే ఔట్ చేయగా.. కోహ్లీ, పడిక్కల్ నిలకడగా ఆడి జట్టును విజయం దిశగా నడిపించారు. 30 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న పడిక్కల్ను హర్ ప్రీత్ వెనక్కి పంపాడు. దీంతో 66 బంతుల్లో 103 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. నెమ్మదిగా ఆడిన కోహ్లీ 43 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్నాడు. రజత్ పటీదార్ (12)ని 17 ఓవర్ లో చాహల్ ఔట్ చేశాడు. అప్పటికే బెంగళూరు విజయానికి చేరువగా.. జితేశ్ (11), కోహ్లీ మిగతా పని పూర్తి చేశారు. ఎనిమిది మ్యాచ్ ల్లో పంజాబ్ కు ఇది మూడో ఓటమి. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కు ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (22; 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ప్రభ్ సిమ్రన్ సింగ్ (33; 17 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. కానీ, మిగతా బ్యాటర్లు భారీ స్కోర్లు చేయకపోవడంతో ఆ జట్టు మోస్తరు స్కోరుకే పరిమితమైంది. జోష్ ఇంగ్లిస్ (29; 17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), శశాంక్ సింగ్ (31*; 33 బంతుల్లో), మార్కో యాన్సెన్ (25*; 20 బంతుల్లో) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (6) వరుసగా మూడో మ్యాచ్లో రెండంకెల స్కోరు చేయకుండానే వెనుదిరిగాడు. నేహల్ వధేరా (5), స్టాయినిస్ (1) నిరాశపర్చారు. ఆర్సీబీ బౌలర్లలో సుయాశ్ శర్మ 2, కృనాల్ పాండ్య 2, రొమారియో షెఫర్డ్ ఒక వికెట్ తీశారు.



## నేను పదేళ్ల పాటు కెప్టెన్‌గా ఉన్నా: అజహరుద్దీన్

మొన్న ఐపీఎల్ టికెట్లకు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ సంఘం పై విమర్శలు.. ఇప్పుడు మాజీ అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ పేరు వివాదంగా మారింది. ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్కు మహ్మద్ అజహరుద్దీన్ పేరు ఉంది. అయితే, దానిని తొలగించాలని హెచ్సీఏ అంబుడ్స్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై అజహరుద్దీన్ తీవ్రంగా స్పందించాడు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించాడు. ''ఇందులో ఎలాంటి కుట్రకోణం, స్వప్రయోజనాలు లేవు. దీనిపై నేను ఎలాంటి కామెంట్ చేయదల్చుకోలేదు. ఆ స్థాయికి దిగజారాలని అనుకోవడం లేదు. ఈ అసోసియేషన్ను చూసి క్రికెట్ ప్రపంచం నవ్వుతోంది. 17 ఏళ్ల క్రికెట్ కెరీర్.. దాదాపు పదేళ్లపాటు భారత జట్టు కెప్టెన్గా ఉన్నా. సారథిగా డిస్టింక్షన్లో పాసైన వ్యక్తిని. హైదరాబాద్లో క్రికెటర్లను ఇలాగేనా గౌరవించేది. ఇది చాలా బాధాకరం. తప్పకుండా కోర్టుకు వెళ్తాం. వందశాతం న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా'' అని అజహరుద్దీన్ స్పష్టం చేశాడు. హెచ్సీఏ అధ్యక్షుడిగా ఉన్నపుడు అజహరుద్దీన్ తన పేరును స్టాండ్కు పెట్టించడం సరైన నిర్ణయం కాదని, ఇందులో విరుద్ధ ప్రయోజనాలున్నాయని అంబుడ్స్మన్ పేర్కొన్నారు. వెంటనే స్టాండ్కు అజహర్ పేరును తొలగించడంతో పాటు క్రికెట్ మ్యాచ్ల టికెట్లపైనా ఆ ప్రస్తావన లేకుండా చూడాలని హెచ్సీఏను ఆయన ఆదేశించారు. 2019లో ఆ స్టాండ్కు వీవీఎస్ లక్ష్మణ్ పేరు ఉండేది. దానిని అజహరుద్దీన్ స్టాండ్గా మార్చారు.



## ముంబైలో 'హరి హర వీరమల్లు' షూట్.. కానీ ?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'హరి హర వీరమల్లు'. ఈ చిత్రం మే 9, 2025న గ్రాండ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఐతే, ఈ చిత్రం విడుదల తేదీ మారే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ ముంబైలో జరుగుతోంది. ఈ షూట్ లో పార్ట్ టూకి సంబంధించిన సన్నివేశాలను తీస్తున్నారు. మొదటి భాగానికి సంబంధించిన చాలా సన్నివేశాలు పూర్తయినప్పటికీ, పవన్ కళ్యాణ్ కి సంబంధించిన కీలకమైన సీన్స్ ను ఇంకా షూట్ చేయాల్సి ఉంది.

కాగా పవన్ త్వరలో సెట్స్ లో అడుగు పెడతాడు అని, ఏప్రిల్ చివరిలోపు డబ్బింగ్ తో పాటు తన సీన్స్ ను పూర్తి చేస్తాడని తెలుస్తోంది. ఈ లోపు పార్ట్ 2 సీన్స్ మేకర్స్ షూట్ చేస్తున్నారు. అన్నట్టు డైరెక్టర్ జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుంది. ఈ సినిమాలో నిధి అగర్వాల్ తో పాటు బాబీ డియోల్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు మరియు నోరా ఫతేహి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎ దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అన్నట్టు క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాలోని పలు సన్నివేశాలకు దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే.



## ముద్దిస్తావా అన్నాడు.. మాళవికా మోహనన్

హీరోయిన్స్ ఏ విధంగా ఉండాలనే విషయంలో ప్రతి ఇండస్ట్రీకి కొన్ని ప్రమాణాలు ఉన్నాయని.. అన్ని చోట్లా అవి ఒకేలా ఉండవని నటి మాళవికా మోహనన్ తెలిపారు. దక్షిణాదిలో హీరోయిన్ గా కనిపించాలంటే అమ్మాయి మరీ సన్నగా ఉండకూడదని ఆమె అన్నారు. ఈ మేరకు శరీరాకృతి విషయంలో తాను ఎదుర్కొన్న సవాళ్లను ఆమె వెల్లడించారు. ఒకానొక సమయంలో పలు విమర్శలు వచ్చాయని.. అవి తనని ఎంతో బాధించాయన్నారు. అనంతరం ఆమె తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని వివరించారు. లోకల్ ట్రైన్ లో ప్రయాణిస్తున్న సమయంలో ఒక వ్యక్తి తనతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడని తెలిపారు. ''ముంబయిలో ఓరోజు రాత్రి నా స్నేహితులతో కలిసి లోకల్ ట్రైన్ లో ప్రయాణించా. ఆ కంపార్ట్ మెంట్ లో మేము కాకుండా మరెవరూ లేరు. ఆ సమయంలో ఒక వ్యక్తి అందులోకి వచ్చేందుకు ప్రయత్నించాడు. కంపార్ట్ మెంట్ వద్ద ఉన్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడు. అతడి ప్రవర్తనతో మేమంతా భయపడ్డాం. ఏం చేయాలో అర్థం కాలేదు. సుమారు 10 నిమిషాల తర్వాత వేరే స్టేషన్ రాగానే కొంతమంది ప్రయాణికులు మాకు తోడయ్యారు. మేము ఊపిరి పీల్చుకున్నాం'' అని మాళవికా మోహనన్ తెలిపారు.



## 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్ పయనం!

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం తన కెరీర్ లో 31వ ప్రాజెక్టును దర్శకుడు ప్రశాంత్ నీల్ డైరెక్షన్ లో తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాను పూర్తి మాస్ యాక్షన్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం అయిన ఈ సినిమాలో ఎన్టీఆర్ ఏప్రిల్ 22 నుంచి జాయిన్ అవుతున్నాడు. ఇప్పటికే ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా చేశారు. అయితే, తాజాగా ఈ చిత్ర షూటింగ్ లో పాల్గొనేందుకు ఎన్టీఆర్ తన ప్రయాణం మొదలుపెట్టాడు. 'డ్రాగన్' అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా షూట్ లో పాల్గొనేందుకు ఎన్టీఆర్ మంగళూరుకు పయనమయ్యాడు. ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తనదైన మార్క్ మూవీగా తెరకెక్కిస్తూ సెన్సేషనల్ రికార్డు క్రియేట్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇక ఈ సినిమాలో రుక్మిణి వాసంత్ హీరోయిన్ గా నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై ఈ మూవీ రూపొందిస్తున్నారు.



## యాక్షన్ సీక్వెన్స్ కోసం 'మహేష్' సిద్ధం!

దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్ కోసం మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్ తో పాటు దాదాపు 3వేల మంది జూనియర్ ఆర్టిస్ట్ లు పాల్గొనబోతున్నారని తెలుస్తోంది. మే నుంచి జూన్ వరకు ఈ సీక్వెన్స్ ను చిత్రీకరించనున్నారట. దీనికోసం ప్రస్తుతం హైదరాబాద్ లో ఓ భారీ సెట్ ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. అన్నట్టు ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్స్ నేతృత్వంలో ఈ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించనున్నారు. ఏదిఏమైనా పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా ఆ మధ్య విజయేంద్రప్రసాద్ ఈ సినిమా కథ గురించి ఓ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'నేను, రాజమౌళి ఇద్దరం దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ కు పెద్ద అభిమానులం. అందుకే ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ సినిమా స్క్రిప్ట్ ను రాశాను' అంటూ చెప్పుకొచ్చారు. కాబట్టి రాజమౌళి - మహేష్ సినిమా ఒక అడ్వెంచర్ థ్రిల్లర్ గా ఉండబోతుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.



## ఆ పాత్రల కంటే ఆంటీ పాత్రలే బెస్ట్ – సిమ్రాన్

సీనియర్ హీరోయిన్ సిమ్రాన్ ప్రస్తుతం తాను చేయబోయే సినిమాల పై, తానూ కనిపించే పాత్రల పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న సిమ్రాన్ స్టేజ్ పై మాట్లాడుతూ.. 'కొన్నిరోజుల క్రితం నాకు బాగా తెలిసిన తోటి నటికి ఓ మెసేజ్ పంపించాను. ఆమె నటించిన ఓ సినిమాని ఉద్దేశించి అందులో రాసుకొచ్చాను. ఆ సినిమాలో ఆమె పాత్ర చాలా బాగుందని.. ఆ రోల్ చూసి ఆశ్చర్యపోయానని మెసేజ్ పంపాను. దానికి ఆమె వెంటనే స్పందించింది. ఆంటీ రోల్స్ లో నటించడం కంటే ఇది ఎంతో ఉత్తమం అంటూ నాకు సమాధానంగా ఆమె మెసేజ్ పంపింది' అని సిమ్రాన్ తెలిపింది. సిమ్రాన్ ఇంకా మాట్లాడుతూ.. 'నిజం చెప్పాలంటే ఆమె పంపిన మెసేజ్ నన్ను ఒకింత షాక్ కు గురి చేసింది. ఆమె ఎంతో చులకనగా మాట్లాడినట్లు అనిపించింది. ఈ వేదికగా ఆమెకు నేను చెప్పేది ఒక్కటే. పనికిమాలిన డబ్బా రోల్స్ లో నటించడం కంటే, ఆంటీ లేదా అమ్మ పాత్రలు పోషించడం ఎంతో ఉత్తమం. ఏ వర్క్ చేసినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి' అంటూ సిమ్రాన్ తెలిపింది. ఇటీవల విడుదలైన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో సిమ్రన్ అతిథి పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించారు.

# భూ భారతి తో రైతాంగ సమస్యలకు సత్వర పరిష్కారం

- భూభారతి చట్టం పై రైతులు అవగాహన కలిగి ఉండాలి
- రైతాంగ సమస్యల పరిష్కారానికి గతంలో చట్టాలు లేవు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ,ఏప్రిల్ 20( మనం ప్రతినిధి)**: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తో రైతాంగ సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేందుకు మార్గం సుగమైందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి అన్నారు .ఆదివారం నాడు తిప్పర్తి మండల కేంద్రంలో రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూబారతి పై ఏర్పాటు చేసిన అవగహన సదస్సుకు శానసన మండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు .ఈ అవగహన సదస్సులో కలెక్టర్ మాట్లడుతూ రైతాంగ భూ సమస్యలు పరిష్కరానికి గతంలో సరైన చట్టం లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు .ప్రస్తుత భూ భారతి చట్టంతో రైతులు తమ భూ సమస్యలకు సంబందించి ఎటువంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే పరిష్కరం అయ్యే విదంగా భూ భారతిలో అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు .భూ భారతి చట్టం పై రైతులు స్పష్టమైన అవగహన కలిగి ఉండాలని అన్నారు.పెండింగులో ఉన్న సదాబైనామా కేసులను విచారణ చెపట్టి భూ భారతి చట్టంలో వాటికి పరిష్కారం చూపిస్తామన్నారు .రైతులకు అందించే పాస్ పుస్తకాలలో రైతుకు సంబందించిన భూమి మ్యాప్ సైతం పొందుపరచడం జరుగుతుందని దిని వల్ల ఒకే స్థలాన్ని పలువురికి అమ్మే మోసపురిత వ్యక్తులకు చెక్ పడుతుందని తెలిపారు .

**భూ భారతి చట్టం రైతులకు కొండంత ధైర్యం : ఎమ్మెల్సీ శంకర్ నాయక్**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టం భూ భారతితో రైతుల భూ సమస్యల కొండంత ధైర్యం ఇస్తుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు .తిప్పర్తి మండల కేంద్రంలో ఏర్పటు చేసిన భూ భారతి అవగహన సదస్సులో అయన మాట్లడుతూ ధరణి తెచ్చిన తంటాల వల్ల గతంలో అనేక సార్లు కలెక్టరేట్ ముందు అనేక దర్నా కార్యక్రమాలు నిర్వహించే



వాళ్లమని అనేక రైతాంగ సమస్యల మీద కలెక్టర్లకు మెమోరాండాలు ఇచ్చి విసిగి పోయామని అన్నారు .ఇప్పుడు అలాంటి సమస్యలు లేవని రైతు దరఖాస్తు పెట్టిన ముప్పై రోజులలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు .ప్రజల దగ్గరికే పరిపాలన తీసుకొచామని అన్నారు .మాజి మంత్రి జగదీశ్వర్ రెడ్డి భూ భారతీ పై మాట్లాడుతున్నారని గత ప్రభుత్వం ధరణిలో కబ్జా కాలం ఎందుకు తొలగించారో చెప్పాలని అన్నారు .ప్రవేట్ సంస్థ అయిన ధరణికి భూములు అప్పగించి రైతులకు ముప్పతిప్పలు పెట్టి రైతు అత్మ హత్యలకు కారణం అయిందని అన్నారు .ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి చట్టాని శ్రీకారం చుట్టామని తెలిపారు .ఈ అవగహన సదస్సు కార్యక్రమంలో అర్ డి ఓ అశోక్ రెడ్డి తహశిల్దార్ కొత్తపల్లి పరశురాములు ,ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి ,ఏవో సన్నీ రాజు ,నాయబ్ తహశిల్దార్ అబేదా బేగం ,మార్కెట్ కమిటి చైర్మన్ జుకూరి రమేష్ ,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి ,ముట్టినేని శ్యామ్ సుందర్ మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ మెథరి ద్రోణార్జున మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాదూరి శ్రీనివాస్ రెడ్డి ,సహకార బ్యాంక్ డైరెక్టర్ గోదా క్రిష్ణ రెడ్డి దొంతినేని నాగేశ్వర్ రావు కారే భరత్ కుమార్ పల్లె ఎల్లయ్య కిన్నెర అంజి కొన వెంకన్న అనుములపురి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు .

# క్రీస్తు మరణం పై గెలుపే ఈస్టర్



- బేతెస్థ సంఘంలో పాదశుద్ది నిర్వహించిన బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా

**సూర్యాపేట, ఏప్రిల్ 20 (మనం ప్రతినిధి)**: ఏసుక్రీస్తు మరణం పై గెలుపుకు సూచికే ఈస్టర్ పండగని బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు ఆదివారం పట్టణంలోని నాలుగో వార్డులో ఈస్టర్ పండుగ వేడుకలో భాగంగా ప్రపంచ క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరణంపై యేసు గెలిచిన విజయోత్సవంగా యేసుక్రీస్తు పునరుత్థానాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలుఈస్టర్పండుగ జరుపుకుంటార ని తెలిపారు.ప్రపంచం మొత్తంలో కాలిగా వున్నా సమాధి ఒక్క యేసుక్రీస్తు ప్రభుదే అనీ కొన్ని వేల సంవత్సరాల క్రితం ఎంతో మంది ప్రవక్త లు ప్రవచించిన విదంగా ఆయన ఈ లోకానికి వచ్చి సిలువ వేయబడి చనిపోయి తిరిగిలేచడని అన్నారు. అనంతరం చర్చ్ లో యేసు ప్రభు శిష్యుల పాదాలు కడిగి సేవా చేసిన విధంగా సంఘం లో పాదశుద్ధి కార్యక్రమం చేసి మాదిరి చూపించారు. వేడుకల్లో యేసుపాదం, బాబు, కిరణ్, భాస్కర్, జానయ్య, సురేష్, పేతురు, అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్టర్



**తిరుమలగిరి ఏప్రిల్ 20 మనం న్యూస్**: తిరుమలగిరి మున్సిపాలిటీలో సి ఎస్ ఐ సెయింట్ మార్క్ చర్చ్ లో ఈస్టర్ పండుగ ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.స్థానిక పాస్టేటు చైర్మన్ పాస్టర్ డి.పురుషోత్తం ప్రసంగిస్తూ యేసు క్రీస్తు మరణించి మరణాన్ని గెలిచి మూడవ రోజు పునరుద్దానుడై మరల సజీవుడుగా లేచినాడని అన్నారు. చర్చిలో మల్లెపూల తోరణాలతో అలంకరించి తెల్లవారుజామున నుండి 8 గంటల వరకు దేవుని పాటలు వాక్యముతో ఏసుక్రీస్తుని స్మరిస్తూ మరణాన్ని జయించినందుకు సంతోషంతో ప్రతి ఒక్కరు క్రిస్టియన్లు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపిపారు. ఈ కార్యక్రమంలో సంఘు పెద్దలు గంట పెద్ద సాల్మన్, పి ఇమ్మయ్య, మద్దెల ప్రభుదాస్, గంట యాకూబ్, కాటమల్ల మాణిక్యరావు, జి సాలమన్, దాసరి ప్రకాష్, గడ్డి దిలీప్ ,జి సుమంత్, ఎం మల్లేష్,పి నవీన్, గంట సందీప్, స్త్రీల మైత్రి కమిటీ, యూత్ కమిటీ, సండే స్కూల్ చిల్డ్రన్స్ యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం

**వలిగొండ, ఏప్రిల్ 20(మనం న్యూస్)**: మండల కేంద్రంలో ఆదివారం నాయి బ్రాహ్మణ సమావేశం రాచమల్ల తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం, జిల్లా ఉపాధ్యక్షులు నాగెల్లి వలి పాల్గొని వారు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి 30 కోట్లు 100 కోట్లు విద్యుత్ బకాయి సబ్సిడీ ప్రవేశపెట్టింది ఈ బడ్జెట్ ఏ మూలానికి సరిపోదని నాయి బ్రాహ్మణులకు మహిళ వృత్తిదారులకు 500 కోట్లు కేటాయించాలని కరోనా వచ్చినప్పటినుండి ఇప్పటివరకు వృత్తి నడవక నాన్న ఇబ్బందులు పడి మా వృత్తిలోనికి కార్పొరేట్ సెలూన్లు రాకుండా అడ్డుకట్ట వేయాలని, మాకు జీవో ఇవ్వాలని, మా సంక్షేమానికి మా అభివృద్ధికి రుణాలు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న ఉచిత విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని, భారీగా నష్టపోతున్న నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇండ్లు లేని పేదలకు ఇల్లు కట్టించి ఇవ్వాలని, ప్రభుత్వం మాకు ఇంకా 500 కోట్లు కేటాయించాలని అంతేకాకుండా వృత్తి శిక్షణ, మహిళలకు బ్యూటీ పార్లర్ శిక్షణ ఇవ్వాలని, గత ప్రభుత్వం బీసీ బందు కింద లక్ష రూపాయలు వృత్తిదారులు అందరికీ ఇవ్వలేదని, ఇప్పటికైనా ఈ ప్రభుత్వం నాయి బ్రాహ్మణులను గుర్తించి రాజీవ్ యువ వికాస్ పథకంలో నాయి బ్రాహ్మణులను గుర్తించాలని, 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ హాస్టల్లో, హాస్పటల్లో, పోలీస్ శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలని, దేవస్థానం కళ్యాణకట్టలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులను పర్మినెంట్ చేయాలని, తెలంగాణలోని ప్రతి ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్ లో బార్బర్ షాప్ నెలకొల్పాలని, గ్రామీణ పట్టణ ప్రాంత నాయి బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని, నాయి బ్రాహ్మణలకు ప్రత్యేకంగా ఐడి కార్డు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా జూన్ నెలలో అన్ని మండలాలలో గ్రామాలలో నూతన కమిటీలను ఎన్నుకోవాలని, ఆగస్టులో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాయి బ్రాహ్మణ సంఘం తరపున సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నాగేల్లి రాములు, పట్టణ అధ్యక్షులు





నాగేల్లి పాండు, నాగేల్లి కృష్ణ, నాగేల్లి నగేష్, కడారి దయాకర్, నాగలి ప్రభాకర్, రాచమల్ల విజయ్, జంపాల భార్గవ్, రాచమల్ల ప్రభాకర్, రాచమల్ల మహేష్, జంపాల మధు, రాచమల్ల వినోద్, నాగెల్లి భాను, ప్రజ్ఞాపురం విగ్నేష్, రాచమల్ల ఉమాపతి, దడిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల అదుపున కే సీసీ కెమెరాలు ఏర్పాటు: ఎస్త్స కస్తాల గోపికృష్ణ

- అనాజిపురం మాచారం గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరా ఏర్పాటు

**పెన్ పహాడ్ ఏప్రిల్ 20 (మనం న్యూస్)**: గ్రామాల్లో జరిగే నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక ఎస్త్స కస్తాల గోపికృష్ణ అన్నారు ఆదివారం మండల పరిధిలోని అనాజిపురం, మాచారం గ్రామాల్లో దాతల సహకారంతో అందించిన సీసీ కెమెరాలను ప్రధాన వీధుల్లో, ఆలయాల వద్ద ఏర్పాటు చేసి మాట్లాడారు ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలకు పాల్పడ్డ వారిని వెంటనే గుర్తించొచ్చని తెలిపారు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన అభినందనలు తెలిపారు అన్ని గ్రామాల్లో దాతలు ముందుకు వస్తే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు గతంలో కొన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేక పట్టించుకునే వారి లేక



అవి మరమత్తులకు గురయ్యాయని అన్నారు ఇకనుండి దాతల సహకారంతో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల బాధ్యతను తాము తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బోల్లక బోబ్బయ్య, వివిధ పార్టీల నాయకులు ఇటుకల శ్రీనివాస్, బొల్లక సైదులు, రమణారెడ్డి గ్రామాల ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీఎం చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు

**పెన్ పహాడ్, ఏప్రిల్ 20 (మనం న్యూస్)**: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి 75 వ, జన్మదిన వేడుకలను టిటిడిపి పార్టీ మండల కార్యదర్శి రాయిరాల వంశీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సూర్యాపేట టీటీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కారింగుల శైలజ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేసిన అభివృద్ధి ప్రదాత,సైబరాబాద్ హైటెక్ సిటీ నిర్మాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అమరావతి సృష్టికర్త చంద్రబాబు నాయుడి 75వ వజ్రోత్సవ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని అన్నారు చంద్రబాబు నాయుడు హయాంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి జరిగిందని ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు కలకాలం జరుపుకోవాలని తెలంగాణలో కూడా టిడిపి పార్టీ పునర్ నిర్మాణం చేపట్టి పునర్ వైభవం తీసుకురావడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు అభిమానులకు ప్రజలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టి ఎస్ టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావతు రవీంద్ర నాయక్, పార్టీ మండల హడహక్ సభ్యులు రాయిరాల వంశీ, ఉపాధ్యక్షులు షేక్ అలీ సాబ్, గ్రామ అధ్యక్షుడు శనగాని మల్లయ్య గౌడ్,నాయకులు ఉప్పల సోమయ్య, వాస రామస్వామి, వాసా జాను,కొంచెం లక్ష్మీనారాయణ, శేష గాని అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు..



# తులసి వనంలో గంజాయి మొక్కలు మొలుస్తున్నాయి

- కూకటి వేళ్ళతో పెకిలించాలి
- ఐద్వా రాష్ట్ర జాత సభలో ఐద్వా జాతీయ నాయకురాలు జ్యోతి

**భువనగిరి, ఏప్రిల్ 20 (మనం న్యూస్)**: తెలంగాణ సాయుధ పోరాటం నడిపి నిజాం రజాకారుల, దొరల తరిమిన గడ్డపై తులసి వనంలో గంజాయి మొక్కల లాగా మతోన్మాద పార్టీలు పాగా వేయడం కోసం ప్రయత్నిస్తున్నాయని మతోన్మాద పార్టీ లను కూకటివేళ్లతో పెకిలించివేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) జాతీయ నాయకురాలు జ్యోతి మహిళకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా హక్కుల పరిరక్షణ కోరుతూ ఐద్వా రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర యాత్ర శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహం నుండి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రిన్స్ చౌరస్తాలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన సభ నిర్వహించడం జరిగింది.

**ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ ..**

బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, హింస పెరిగిందని బీజేపీ పాలిత మణిపూర్ రాష్ట్రం నడి జారులో భారత మతాలను నగ్నంగా ఊరేగించిన ఘటన యావత్ దేశం సిగ్గుతో తలదించుకుందని గుర్తుచేశారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో సమాచారం ప్రకారం రోజు 86 మంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, దేశంలో ప్రతి17 నిమిషాలకు ఒక భారత మాతపై అఘాయిత్యం జరుగుతున్నదని బిజెపి పాలనకు ఈ ఘటనలే నిదర్శనమన్నారు. రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షులు, బిజెపి నాయకులు బ్రీజ్ భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ కనీసం అతనిని బిజెపి మోదీ ప్రభుత్వం శిక్షించలేదని ఇది బిజెపి నిజస్వరూపమని తెలియ జేశారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ జ్యోతి , మల్లు లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కావాలని మనువాద సిద్ధాంత బిజెపి చెప్తుందని



కానీ నేడు కాలం మారిందని మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలియజేశారు. మోడీ ప్రభుత్వం మహిళల శ్రమ దోపిడీ కోసం 12 గంటలు లేబర్ కోడ్ ల రూపంలో తీసుకొచ్చారని దీనికి వ్యతిరేకంగా మహిళలు హక్కుల కోసం ఎనిమిది గంటల పని కోసం సావిత్రి బాయిపూలే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, జిల్లా అధ్యక్షురాలు రామేశ్వరి, జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణిలు పాల్గొనగా ఐద్వా జాతాకు సంఘీభావంగా వ్యకాస జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్ గౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ , సిఐటియు టౌన్ కార్యదర్శి గంధమల్ల మాతయ్య, యస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు , పియన్ యం జిల్లా అధ్యక్షులు గంటెపాక శివ, వివిధ సంఘాల నాయకులు సంపూర్ణ మద్దత్తు ప్రకటించారు. ఈ సభలో ఐద్వా జిల్లా కమిటి సభ్యులు మాయ రాణి, దొడ్డి అండాలు, ఆవుల కళమ్మ , యండి రేష్మ తదితరులు పాల్గొన్నారు.

# 22న తాటిపాములకుమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాక

**తిరుమలగిరి ఏప్రిల్ 20 (మనం న్యూస్)**: ఈనెల 22న తిరుమలగిరి మండలం తాటిపాముల స్వంత గ్రామానికి భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి,ఎం.పి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు హాజరవుతున్నారని, గ్రామంలో జరిగే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాయిని కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామంలోని తాటిపాముల నుండి గూడాల మండలం వస్తాకొండూరు బిక్కేరు వాగుపై 22.కోట్ల37లక్షల తో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మానానికి శంకుస్థాపన భూమిపూజ, 25 లక్షల రూపాయాల సిసి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం 5గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి



ప్రసంగిస్తారని.గ్రామంలోని 500 మంది మహిళలకు ఉచితాగా కుట్టుమిషన్ల పంపిణి చేస్థాసరని తెలిపారు. తాటిపాముల గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# తప్పు చేసిన వారికి శిక్ష

- అందులో సోనియా, రాహుల్..ఎవరున్నా సరే
- చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది
- నేషనల్ హెరాల్ ద్వారా వేల కోట్ల కుంభకోణం
- బిజెపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి ఆగ్రహం
- కృషిభవన్ కూడలిలో రాస్తారోకో

**ఖమ్మం, ఏప్రిల్ 20(మనం న్యూస్)**: తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని, నేషనల్ హెరాల్ పత్రిక పేరుతో కాంగ్రెస్ పార్టీ భారీ కుంభ కోణానికి పాల్పడిందని, రూ.90 కోట్ల పెట్టుబడి పెట్టి, వేల కోట్ల ఆస్తులను దోచుకుంటుంటే న్యాయవ్యవస్థ చూస్తూ ఊర్కుంటుందా?, అందుకే ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరుపుతుందని బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో కాంగ్రెస్ అధినాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలే కాదు ఇంకెవరున్నా చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లు రావడం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ మాజీ ఎంపీలు అంజన్ కుమార్, అద్దంకి దయాకర్ల తీరుకు నిరసనగా ఆదివారం బిజెపి ఆధ్వర్యంలో హోటల్ మినార్ గ్రాండ్ నుండి కృషి భవన్ కూడలి వరకు ర్యాలీగా వచ్చి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ హెరాల్ కేసులో మనీలాండరింగ్ జరిగిందని, రూ.90 లక్షలు పెట్టుబడి పెట్టి, వేల కోట్లు ఎలా దోచుకుంటారని ప్రశ్నించారు. ఈ అంశంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు దేశ ప్రధాని నరేంద్రమోడీపైన విమర్శలు చేయడాన్ని ఆయన ఖండిరచారు. ముఖ్యంగా కాంగ్రెస్ మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్లు నరేంద్ర మోడీ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థాయిని మరిచి ప్రధానిపై విమర్శలు చేసిన వారు ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉండాలని, లేనిపక్షంలో బీజేపీ కుటుంబం ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్కు నిరసన సెగ తగలక తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకురాలు, హైకోర్టు అడ్వకేట్ మౌనిక సుంకర, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్గౌడ్, పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు నున్నా రవి కుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, వర్క్షాప్ కన్వీనర్ ఇవి.రమేష్, కోఋకన్వీనర్లు వీరవెల్లి రాజేష్ గుప్తా, కొలిపాక శ్రీదేవి, ఎస్కె.యాకూబ్ పాషా, పమ్మి అనిత తదితరులు పాల్గొన్నారు.




# కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



**తిరుమలగిరి ఏప్రిల్ 20 (మోడల్ న్యూస్)**: మేడే కార్యక్రమాన్ని అన్ని కార్మిక సంఘాలు కలిసి జయప్రదం చేయాలని తిరుమలగిరి మండల కేంద్రంలో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కడెం లింగయ్య మాట్లాడుతూ మే ఒకటో తేదీన ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే కార్యక్రమాన్ని కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తూ నిరంతరం నిత్యావసర ధరలను పెంచుతూ మధ్యతరగతి కుటుంబాలపై భారాలు మోపుతున్నారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పేదల పట్ల ఏమాత్రం సిద్ధ శుద్ధి ఉన్న పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర ధరులను తక్షణమే తగ్గించాలని కార్మిక సంఘాలు తరుపున డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కడారి లింగయ్య, గ్రామపంచాయతీ కార్మికులు దూపటి బక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు లక్ష్మి, కొనబోయిన లింగయ్య, నలుగురి రమేష్, కందుకూరి కొండయ్య, దుస్స రామ్మూర్తి, జి.నాగయ్య, శోభ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం తక్షణమే స్పందించాలి

- 20 రోజులుగా బత్తుల సిద్దేశ్వర్ ఆమరణ నిరాహార దీక్ష.. కేంద్రం స్పందించాలి
- సిద్దేశ్వరకు ఎలాంటి ప్రాణ హాని జరిగిన కేంద్రమే బాధ్యత వహించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు విద్యా, ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహా లో 9వ షెడ్యూల్లో చేర్చి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్ తో బీసీ హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ గత 20 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం వారితో చర్చించి ఆయన దీక్షను విరమింప చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును, రాష్ట్ర గవర్నర్ కూడా ఆమోదించి రాష్ట్రపతికి పంపించి వారం రోజులు గడుస్తుందని ఈ బిల్లుపై ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా విచారకరమన్నారు రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిల్లుకు రాష్ట్ర బిజెపి మద్దతు తెలిపిందని, కానీ కేంద్ర బిజెపి మాత్రం రాష్ట్ర బిజెపి నిర్ణయానికి విరుద్ధంగా బీసీ బిల్లును ఆమోదించకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బిజెపి పార్టీ ఒకే పార్టీ ఒకే విధానం ఉన్నట్లయితే ఇప్పటికైనా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమకారుడు, బీసీల డిమాండ్ల సాధన కోసం గత 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష దేశ రాజధాని ఢిల్లీలో చేస్తున్న కనీసం నిరాహార దీక్ష చేస్తున్న నాయకులతో చర్చించకపోవడం అత్యంత బాధాకరమన్నారు ఇప్పటికే నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర ఆరోగ్యం క్షీణించిందని, తక్షణమే కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు సిద్దేశ్వర తో మాట్లాడి దీక్ష విరమింప చేసేలా చర్యలు తీసుకోవాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

బత్తుల సిద్దేశ్వర ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని, ఈ దశలో కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆయనకు ప్రాణ అని కలిగే ప్రమాదం ఉందని శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు బీసీ ఉద్యమకారుని ప్రాణాలకు హాని జరిగితే కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు రెండు రోజుల్లోనే సిద్దేశ్వర కు మద్దతుగా హైదరాబాదులో అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి దేశవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## మణికొండలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఏపీ సీఎం చంద్రబాబు 75వ జన్మదినం మణికొండ కాకతీయ సేవ సమితి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ కాకతీయ సేవా సమితి అధ్యక్షులు కమ్మ బ్రహ్మాజీ,నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్ల శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ నాయకులు శ్రవణ్ కుమార్, లక్ష్మియ్య, విజయ్ రెడ్డి, కాకతీయ సేవ సమితి నాయకులు లక్ష్మీనారాయణ, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొని ఎన్టీఆర్‌కి నివాళులు అర్పించి చంద్రబాబు నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం యువత నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## యాదవులు రాజకీయంగా చైతన్యం పొందాలి



హైదరాబాద్, ఏప్రిల 20(మనంన్యూస్): రాబోయే రోజుల్లో యాదవులను రాజకీయంగా చైతన్య పరుస్తూ వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడెత్తుల మల్లేష్ యాదవ్ అన్నారు. బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన యాదవ కుల పోరాట సమితి ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాదవుల అభివృద్ధి కోసం, వారి హక్కుల సాధన కోసం నిరాంతరం పోరాటం చేస్తానని అన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పజెప్పడం చాలా సంతోషంగా ఉందన్న ఆయన.. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వాగ్దానం చేశారు. రాబోయే రోజుల్లో వివిధ జిల్లాలు తిరిగి రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో యాదవులకు రావలసిన వాటా కోసం నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురికి నియామక పత్రాలు అందజేశారు. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సిరిసిల్ల జిల్లాకు చెందిన దేవేందర్ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా అవిశెట్టి లక్ష్మీ యాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా గంగుల అంజలి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సింహ యాదవ్ నియామక పత్రాలు అందుకున్నారు.

## నిరుద్యోగులకు బాసటా నిలిచాం

హైదరాబాద్, ఏప్రిల్ 20(మనంన్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో బాసటగా నిలిచిందని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం మంత్రితో పాటు ఎంపీ గోడం నగేష్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కలిసి ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ లో గల ఐటీడీఏ ఆర్టీసీ ద్వారా గిరిజల్లా యువతకు ఏర్పాటుచేసిన వాహనాల డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉన్నత చదువులు చదువుకున్న ప్రతి నిరుద్యోగి ఏదో ఒక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిరుద్యోగులు తమ కాళ్లపై తామే నిలబడాలని తల్లిదండ్రులకు భారం కావద్దని అన్నారు ఈ అవకాశం వచ్చిన వినియోగించుకోవాలి తప్ప పెద్ద ఉద్యోగం వస్తేనే చేస్తామని కాలయాపన చేయడం సరికాదన్నారు. అనంతరం మండలంలోని దేవుగూడ గ్రామంలో ఐ టీ డి ఏ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బెంచీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని విద్యార్థులు విద్యపై దృష్టి సారించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిటల్ ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజు మర్మాట్, ఐ టి డి ఏ డి డి అంబాజీ జాదవ్, ఐటిడిఏ పివిటిజీ ఏపీఓ మేస్రం మనోహర్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఎగ్బాల్, ఉట్నూరు సహకార చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను



### బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున

నల్లగొండ,ఏప్రిల్ 20( మనం న్యూస్ ): ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తి ప్రాంగణంలో జరిగే బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభకు విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16నెలల రేవంత్ రెడ్డి ధృతరాష్టుని పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ లోకమంతా కదలిరావాలని, తెలంగాణకు నాడైనా, నేడైనా కేసిఆర్ గారి పాలనే శ్రీరామరక్ష అని అన్నారు. సభకు స్వచ్ఛందంగ రావడానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్వి జిల్లా నాయకులు నోముల క్రాంతి యాదవ్, జనంపల్లి ప్రేమ్ కుమార్, గంట కిరణ్, కట్టెబోయిన నవీన్, తవిటి నాగరాజు, రాపోలు సాయి, ఇట్టమల్ల సంజయ్, రాజు యాదవ్, సింగరి శివకుమార్, గజ్జి నాని తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజ సంఘటనే లక్ష్యం

హైదరాబాద్, ఏప్రిల్ 20(మనంన్యూస్): ఆదిభట్ల మున్సిపాలిటీలో గల భారత్ ఇంజనీరింగ్ కాలేజీలో భాగ్ సంఘచాలక్ మహేశ్వరం భాగ్, భాగ్యనగర్ విభాగ్ ప్రచార అల్వాల అక్షిత్ ఆధ్వర్యంలో శాఖల సమ్మేళనం నిర్వహించడం జరిగింది.హిందూ సమాజ సంఘటనే లక్ష్యంగా గత 100 సంవత్సరాలుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తున్నది. శాఖ ద్వారా వ్యక్తి నిర్మాణం తద్వారా సమాజ పరివర్తన సాధించాలని సంఘం కషి చేస్తుందని . స్వయంసేవకులలో ఉత్సాహం నింపడం కోసం వీరపట్నం భాగ్లో ఉన్న అన్ని శాఖలు ఒక దగ్గర కలుసుకొని శాఖల సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ సమ్మేళనానిక ఖండ / నగరాల్లో ఉన్న అన్ని శాఖలు ఒక దగ్గరికి వచ్చి సామూహికంగా ఒకే సంఘస్థాన్లో వేరు వేరు ధ్వజాలతో శాఖలను నిర్వహించడం జరిగింది.

## వైభవోపేతంగా మల్లన్న కల్యాణం



హైదరాబాద్, ఏప్రిల్ 20(మనంన్యూస్): పెద్ద తూప్ర లో శ్రీ మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం శంషాబాద్ మండల పరిధిలోని పెద్దతూప్ర గ్రామంలో ప్రతి సంవత్సరము నిర్వహించే శ్రీ మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవములో శంషాబాద్ మండల మాజీ ఎంపిపి దిద్యాల జయమ్మ శ్రీనివాస్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖ సంతోష లతో ఉండాలని కోరారు. గ్రామ అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని స్వామి వారిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు , ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా, గ్రామ అధ్యక్షుడు మైల విద్యాచరణ్ , సెగు అశోక్ , బిక్యా నాయక్ , మాజీ వార్డు సభ్యుడు టి దాసు, ఉపాధ్యక్షుడు జయం రాజు, అంకం రాములు,అంకం కుమార్, అంకం రవి, గోవింద్, అంకం ప్రవీణ్, గ్రామస్థులు నాయకులు తధితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకు అంకితమైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




- 20 ఏ ఎం ఎల్ 4 మాట్లాడుతున్న యాది లాల్

హైదరాబాద్, ప్రిల్ 20 (మనంన్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా టిడిపి కల్వకుర్తి మాజీ ఇంచార్జ్, నాగర్ కర్నూల్ పార్లమెంటు అడ హాక్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాది, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75 వ జన్మదిన వేడుకల్లో యాదిలాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఏర్పాటుచేసిన వేడుకలో యాది లాల్ మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవితం, ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు సుఖశాంతులతో వర్ధిల్లాలని యాదిలాల్ ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. హైదరాబాదును దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత చంద్రబాబు దేనని ఆయన కొనియాడారు.

## డిజిటల్ లిటరసీ ఆన్ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన

- పైలెట్ ప్రాజెక్ట్ కింద మేడ్చల్ జిల్లాలో ఐదు పాఠశాలలు ఎంపిక

హైదరాబాద్, ఏప్రిల్ 20(మనంన్యూస్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ వెలుగులోకి వచ్చిన తర్వాత దానిని అన్ని రంగాలలో వినియోగించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి.అందులో, ముఖ్యంగా విద్యా శాఖ దీని ప్రాముఖ్యతను గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగా, ఏ.ఐ ని బోధనా పద్ధతులకు అనుసంధానం చేస్తూ, డిజిటల్ లిటరసీని పెంచేందుకు చర్యలు చేపట్టింది.

డిజిటల్ లిటరసీ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ కోడింగ్ పేర విద్యా శాఖ మేడ్చల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ ఐదు 5 ప్రాథమిక పాఠశాలలో, మూడు రోజుల పాటు, ఈ నెల 21 నుంచి 23 వరకు విద్యార్థులకు విద్యా బోధన ప్రక్రియకు నిర్వహించ నుంది. దీని పట్ల విద్యార్థుల ఆసక్తిని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనుంది. మేడ్చల్ జిల్లాలో, పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన ఐదు పాఠశాలలో, కూకట్ పల్లి లోని ఎల్లమ్మ బండ స్కూల్, మేడ్చల్ లోని రైల్వే స్టేషన్ రోడ్ లోని స్కూల్, అల్వాల్ లోని కొకూర్ స్కూల్, కుత్బుల్లాపూర్ స్కూల్ అలాగే, జీడిమెట్ల లోని ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయి.

వీటిలో పైలెట్ ప్రాజెక్ట్ కింద డిజిటల్ లిటరసీ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ కోడింగ్ మీద అవగాహన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీచర్స్ కు కూడా శిక్షణ ఇచ్చారు. విద్యా ప్రమాణాల పెంపుదలలో భాగంగా, ఇటీవల ఎఫ్.ఎల్.ఎన్ సబ్జెక్టులకు ఎంపిక చేసిన పాఠశాలల్లో లాబ్ ల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను జోడించి బోధన నిర్వహించిన విద్యా శాఖ, ఇప్పుడు మేడ్చల్ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలోని ఐదు ప్రైమరీ స్కూల్స్ లో డిజిటల్ లిటరసీ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ కోడింగ్ పై అవగాహన కల్పిస్తోంది. ఆ తర్వాత , వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీనిని ఒకటో తరగతి నుంచి 9 క్లాసు వరకు అన్ని పాఠశాలల్లో అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించు కన్నది. అన్ని రంగాలలో దీనిని ఉపయోగిస్తున్నారు. రానున్న రోజుల్లో దీనికి మరింత డిమాండ్, ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. దీనితో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని వినియోగించుకునే పనిలో పడ్డాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలో ప్రావీణ్యత గల పౌరులను తయారు చేసి, రేపటి అవసరాలకు అవసరమైన మానవవనరుల ను తయారు చేసుకోటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. అందులో ముఖ్యంగా, విద్యా శాఖ దీనిని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో, ఇతర సబ్జెక్టులతో పాటు ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ) ఒక పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి, డిజిటల్ లిటరసీని పెంపొందించేందుకు ప్రణాళికను రూపొందిస్తోంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రచిస్తోంది. దీనిపై జూన్, జులై నెలల్లో టీచర్స్ కు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

## మోదీపై అనుచిత వాఖ్యలు చేసిన అద్దంకి దయాకర్ పై బీజేపీ నాయకుల పిర్యాదు



కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 20 ( మనం న్యూస్ ) : భారతీయ జనతా యువ మోర్చా కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నరేంద్రమోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్ మరియు అంజన్ కుమార్ పై కామారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నంది వేణు మాట్లాడుతూ., కాంగ్రెస్ ఈడీ కార్యాలయం ముందు ధర్నా లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పైన మరియు కేంద్ర మంత్రివర్యులు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని, వెంటనే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరియు కేంద్ర మంత్రి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేని యెడల బీజేవైఎం నాయకులు మిమ్మల్ని ఎక్కడిక్కడే అడ్డుకుంటామని, ఇప్పటికైనా మీ నోరును అదుపుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువమోర్చా జిల్లా నాయకులు ఈకే ప్రభాకర్, గద్దమీది నరేష్, పట్టణ అధ్యక్షులు రాజేష్ ,కన్వీనర్ భరత్, కార్యదర్శి జంగం సాయి, రాజ్ గోపాల్ ,అరుణ్,వినయ్,వంశీ,సాయి తదితరులు పాల్గొన్నారు.

## అలవాట్లే ఆరోగ్య రక్షకులు

- తిండి, నిద్ర నియంత్రించుకుంటే ఔషధాలను దూరం పెట్టొచ్చు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఢిల్లీ, ఏప్రిల్ 20 : మితాహారం, సరిపోయినంత విశ్రాంతి తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ అలవాట్లతో నాలుగున్నరేళ్లలో అల్లోపతి మందులను పూర్తిగా మానేయగలిగానని చెప్పారు. ప్రపంచ కాలేయ దినోత్సవ సందర్భంగా శనివారం ఢిల్లీలో 'కాలేయం, పిత్తాశయ ఆరోగ్య రక్షణ సంస్థ' (ఐఎల్బీఎస్) నిర్వహించిన కార్యక్రమంలో హోంమంత్రి ప్రసంగించారు. యువతీయువకులు రోజుకు రెండు గంటలసేపు శారీరక శ్రమ, వ్యాయామాలు, ఆరు గంటలసేపు నిద్ర పోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందగలుగుతారని చెప్పారు. తద్వారా పనితీరు, ఆలోచనలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంలో గొప్ప గుణాత్మక మార్పు వచ్చిందని చెప్పారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన ఉజ్వల యోజన, ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా కార్యక్రమాలు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు, మరుగుదొడ్ల ఏర్పాటుకు అమలు చేస్తున్న పథకాలు ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించినవని అమిత్ షా వివరించారు. కాలేయ ఆరోగ్యంపై వ్యంగ్యచిత్రమాలికను ఆయన ప్రారంభించారు. తనను ఉద్దేశించిన కార్టూన్లు సహా వ్యంగ్య చిత్రాలన్నింటినీ తాను ఆస్వాదిస్తానని తెలిపారు. కాలేయం ప్రాముఖ్యాన్ని తెలియపరచడంలో కార్పొరేట్ సంస్థలూ భాగం పంచుకోవాలని కోరారు. సమగ్ర ఆరోగ్యరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని అమిత్ షా తెలిపారు.



# వాయు సమ్మేళనం వాతావరణం

## వీక్షణం

**పగలు, రాత్రి, చలి, వేడి, వాన, ఎండ.., మనచుట్టూ ఉన్న ప్రకృతి భిన్న సమయాల్లో, భిన్నరూపాల్లో జీవరాశి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తుంటుంది. దీన్నంతా కలగలిపి ఉమ్మడి చిత్రంగా చూసినట్టయితే అదే 'వాతావరణం'. మన రోజువారీ జీవితంలో వాతావరణం ఎలా ఉందో తెలుసుకోవడం కోసం మనం స్మార్ట్‌ఫోన్‌ను పదే పదే చూస్తుంటాం. వాతావరణ మార్పుల్ని అంచనా వేయడమన్నది ఒక అతిపెద్ద శాస్త్రీయ ఆవిష్కరణ. ఇవాళ ఒక యాప్ రూపంలో మనకు అందుబాటులోకి వచ్చింది. కానీ ప్రతిరోజూ మీడియాలో మనకు కనిపించే, వినిపించే 'వాతావరణ విశేషాల' వెనుక ఒక విస్తృతమైన చరిత్ర, శాస్త్రపరిశోధన దాగి ఉంది. భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) ప్రస్తుత ఏడాది 2025కు సంబంధించిన వాతావరణ, వర్షపాత అంచనాల నివేదికను ఏప్రిల్ 15న విడుదల చేసింది. ఈ నేపథ్యంలో వాతావరణ శాస్త్రానికి సంబంధించిన కనీస అవగాహన కోసం వాతావరణ మార్పుల్ని అంచనా వేయడం, ఆ ప్రక్రియ వెనుక దాగిన శాస్త్రీయ పరిశోధనలు, చరిత్ర, ఇతర విశేషాల్ని ఇవాల్టి 'ముద్ర' పాఠకుల ముందుకు తెచ్చింది.**



**ఒకానొక నిర్దిష్ట ప్రాంతంలో, నిర్దిష్ట సమయంలో వాతావరణ మార్పులకు కారణమయ్యే విషయాల్ని అంచనా వేసే శాస్త్రీయ ప్రక్రియనే సాధారణ పరిభాషలో 'వాతావరణ సూచన' అని పిలుస్తారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు అధునాతన డేటా విశ్లేషణ వంటి శాస్త్రీయ అంశాల్ని జోడించి వాతావరణ మార్పుల్ని అంచనా వేస్తారు.** గాలి పీడనం, ఉష్ణోగ్రత, గాలి కదలికల్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని వాతావరణ గతిశాస్త్రం అంటారు. వాతావరణాన్ని అర్థం చేసుకోవడమంటే వాతావరణ గతిశాస్త్రాన్ని అర్థం చేసుకోవడమే. ఖగోళంలోని ఉపగ్రహాలు పంపే ఛాయాచిత్రాల్ని అధ్యయనం చేయడంతోపాటు పలు విధాలైన కంప్యూటర్ మోడల్స్‌ని విశ్లేషించడం ద్వారా వాతావరణ శాస్త్రవేత్తలు 'వాతావరణ మార్పుల్ని' అర్థం చేసుకుని, ప్రజలకు తగిన సూచనల్ని అందిస్తారు. ఈ ప్రక్రియలో శాస్త్రవేత్తలు ప్రధానంగా ఉపయోగించే నమూనా 'ఉష్ణ ప్రసరణ'. వాతావరణాన్ని నడిపించే సుపరిచిత వాతావరణ నమూనా ఉష్ణప్రసరణ. గాలి హఠాత్తుగా వేడెక్కడం, లేదా హఠాత్తుగా చల్లబడడం వంటి మార్పుల్ని ఈ నమూనా సూచిస్తుంది. గాలి సంకోచ, వ్యాకోచాల్ని, గాలిలోని తేమ, ఉష్ణోగ్రతల వివరాల్ని తెలుసుకోవడానికి ఉష్ణప్రసరణను అర్థం చేసుకోవలసి ఉంటుంది. గాలి వేడెక్కే ప్రక్రియ వ్యాకోచాన్ని, చల్లబడే ప్రక్రియ సంకోచాన్ని సూచిస్తుంది. గాలిలోని తేమ, వేడి, శక్తి మార్పిడుల స్వభావమే వాతావరణ మార్పుల్ని అర్థం చేసుకోవడానికి ఉపకరించే ప్రధాన వనరు. భౌగోళిక ఉష్ణప్రసరణ ప్రధానంగా హాడ్లీకణాలతో

మనం ముద్ర MUDRA
సోమవారం 21 ఏప్రిల్ 2025

ప్రచోదితమవుతుంటుంది. ఇలా మనచుట్టూ ఉన్న పరిసరాల మీద వాతావరణంలోని పలు పరిస్థితుల ప్రభావాన్ని అధ్యయనం చేయడమే వాతావరణ శాస్త్రం. వాతావరణ అధ్యయనమన్నది అనేక విధాలైన వాతావరణ శాస్త్రాల సంచయం. మనం సాధారణంగా పిలుచుకునే వాతావరణ శాస్త్రం వాటిలో ఒక ఉపవిభాగం. ఈ ఉపవిభాగం చాలా విస్తృతమైంది. శీతోష్ణస్థితి శాస్త్రం, బాహ్యవాతావరణ శాస్త్రాలు కూడా వాతావరణ శాస్త్రాల్లో అంతర్భాగాలే. ప్రపంచ శీతోష్ణస్థితుల్లోని మార్పుల్ని అధ్యయనం చేయడానికి ఉద్దేశితమైంది శీతోష్ణస్థితి శాస్త్రం. వాతావరణంలోని ఉపరితల పొరల్ని అధ్యయనం చేయడానికి ఉద్దేశించింది బాహ్యవాతావరణ శాస్త్రం. శీతోష్ణస్థితి శాస్త్రం వాతావరణంలోని దిగువ పొరల్ని అధ్యయనం చేస్తుంది. వాతావరణం ఉపరితల పొరల్లో విభిన్నమైన రసాయన, భౌతిక ప్రక్రియలు ఇమిడి ఉంటాయి. గ్రహ ఉపరితలానికి వ్యతిరేకంగా ఉండే స్థిరావరణాన్ని (ట్రోపోస్పియర్) అధ్యయనం చేసేది శీతోష్ణస్థితి. వాతావరణ కేంద్రాలు, ఓడలు, వైమానిక, రాడార్, వాతావరణ బెలూన్లు, ఉపగ్రహాలు వంటి వనరుల ఆధారంగా వాతావరణ స్థితిగతుల్ని అంచనా వేస్తారు. ఈ డేటా మొత్తం ప్రపంచ వాతావరణానికి సంబంధించిన కంప్యూటర్ విశ్లేషణలను ఉత్పత్తి చేసే ప్రపంచవ్యాప్త అధ్యయన కేంద్రాలకు ప్రసారమవుతుంది. తరువాత జరిపే విశ్లేషణలు జాతీయ, ప్రాంతీయ వాతావరణ కేంద్రాలకు అందుతాయి. ఇవి ఈ డేటాను వాతావరణ భవిష్యత్తు స్థితిని మోడల్ చేసే కంప్యూటర్లకు అందిస్తాయి. పరస్పర అనుసంధానిత సాంకేతిక వ్యవస్థల ద్వారా ఈ సమాచార బదిలీ వాతావరణ అధ్యయన ప్రక్రియకు అద్దం పడుతుంది. వాతావరణ శాస్త్రప్రమాణాలు ప్రాంతానికి, సమయానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి. నాలుగు వాతావరణ శాస్త్ర ప్రమాణాలు: మైక్రోస్కేల్, మెసోస్కేల్, సినోప్టిక్ స్కేల్, గ్లోబల్ స్కేల్. వాతావరణ శాస్త్రవేత్తలు తరచుగా వారి అధ్యయనంలో ఒకానొక నిర్దిష్ట స్కేల్‌పై దృష్టి పెడతారు.



### మైక్రోస్కేల్ వాతావరణ శాస్త్రం

మైక్రోస్కేల్ వాతావరణ శాస్త్రం కొన్ని సెంటీమీటర్ల నుంచి కొన్ని కిలోమీటర్ల పరిమాణంలో ఉండే, తక్కువ జీవితకాలాన్ని (ఒక రోజు కంటే తక్కువ) కలిగి ఉండే విషయాలపై దృష్టి పెడుతుంది. మైక్రోస్కేల్ వాతావరణ శాస్త్రవేత్తలు తరచుగా భూ ఉపరితలానికి సమీపంలో నేల, వృక్షసంపద, ఉపరితల నీటి మధ్య జరిగే ప్రక్రియలను అధ్యయనం చేస్తారు. వారు ఈ ఉపరితలాల మధ్య వాయు, వేడి, ద్రవ బదిలీని కొలుస్తారు. మైక్రోస్కేల్ వాతావరణ శాస్త్రం ద్వారా వాయు కాలుష్య కారకాలను గుర్తించవచ్చు.

### మెసోస్కేల్ వాతావరణ శాస్త్రం

మెసోస్కేల్ వాతావరణ శాస్త్రం అధ్యయనం చేసే అంశాల్లో కొన్ని కిలోమీటర్ల నుంచి దాదాపు 1,000 కిలోమీటర్ల (620 మైళ్ళు) వరకు విస్తరించి ఉంటాయి. ఈ శాస్త్రం అధ్యయనం చేసే రెండు ముఖ్యమైన విషయాలు- మెసోస్కేల్ ఉష్ణప్రసరణ కాంప్లెక్స్, మెసోస్కేల్ ఉష్ణప్రసరణ వ్యవస్థలు. ఈ రెండూ ముఖ్యవాతావరణ సూత్రమైన ఉష్ణప్రసరణ వల్లే సంభవిస్తాయి.



### సినోప్టిక్ స్కేల్ వాతావరణ శాస్త్రం

సినోప్టిక్-స్కేల్ శాస్త్రం వాతావరణంలోని అనేక వందల లేదా వేల కిలోమీటర్ల విస్తీర్ణాన్ని అధ్యయనం చేస్తుంది. స్థానిక వాతావరణ సూచనలలో కనిపించే అధిక-అల్ప పీడన వ్యవస్థలు ఈ శాస్త్ర అధ్యయనంలో విస్తృత ప్రాతిపదికను కలిగి ఉంటాయి. పీడనం, ఉష్ణప్రసరణ లాగా, తుఫానులు, తీవ్రమైన చలివ్యాప్తి వంటి వైవిధ్యమైన విస్తృతస్థాయి వాతావరణ వ్యవస్థలు ఈ శాస్త్ర అధ్యయనానికి మూలంగా ఉంటాయి. భూఉపరితలం వద్ద వాతావరణ పీడనం దాని చుట్టుపక్కల వాతావరణం కంటే తక్కువగా ఉన్న చోట అల్పపీడన వ్యవస్థలు ఏర్పడతాయి. అధిక పీడనం ఉన్న ప్రాంతాల్లో గాలి, తేమ అల్పపీడన వ్యవస్థలను కోరుకుంటాయి. ఈ కదలిక కోరియోలిస్ శక్తి, ఘర్షణతో కలిసి వ్యవస్థను ఉత్తర అర్ధగోళంలో అపసవ్య దిశలోను, దక్షిణ అర్ధగోళంలో సవ్యదిశలోను తిప్పడానికి కారణమవుతుంది, దీనివల్ల తుఫాను ఏర్పడుతుంది. తుఫానులు పైకి నిలువుగా కదిలే ధోరణిని కలిగి ఉంటాయి. ఈ కారణం చేత చుట్టుపక్కల ప్రాంతం నుండి తేమతో కూడిన గాలి పైకి లేచి, విస్తరించి, నీటి ఆవిరిగా ఘనీభవించి, మేఘాలు ఏర్పడతాయి. తేమ, గాలికి సంబంధించిన కదలికలు వాతావరణ మార్పులకు కారణమవుతాయి. పశ్చిమ అర్ధగోళంలోని ఉష్ణమండల జలాలపై అభివృద్ధి చెందుతున్న అల్ప పీడన వ్యవస్థల (తుఫానులు) ఫలితంగా పెనుతుపానులు (హరికేన్లు) ఏర్పడతాయి.

### గ్లోబల్ స్కేల్ వాతావరణ శాస్త్రం

గ్లోబల్ స్కేల్ వాతావరణ శాస్త్రం ఉష్ణమండలం నుంచి ధృవాలకు గాలి, వేడి, తేమ కదలికలకు సంబంధించిన వాతావరణ పరిస్థితుల్ని అధ్యయనం చేస్తుంది. ఇది భూమి ఉపరితలం అంతటా ఉష్ణ శక్తిని (వేడిని) పంపిణీ చేయడానికి సహాయపడే గాలికి సంబంధించిన బృహత్‌స్థాయి కదలిక. ప్రపంచవ్యాప్తంగా గాలుల స్థిరమైన కదలిక అనేది ప్రపంచ వాతావరణ ప్రసరణకు కేంద్రంగా ఉంటుంది. వాయు ద్రవ్యరాశి అధిక పీడన ప్రాంతాల నుండి తక్కువ పీడన ప్రాంతాలకు కదులుతున్నప్పుడు గాలులు అభివృద్ధి చెందుతాయి. ప్రపంచ వాతావరణ ప్రసరణ ఎక్కువగా హాడ్లీ కణాలచేత ప్రచోదితమవుతుంది.

### వాతావరణ శాస్త్ర చరిత్ర

వాతావరణ శాస్త్ర అభివృద్ధి సాంకేతిక, గణిత, శాస్త్రీయ పరిజ్ఞానంలో జరిగిన పరిణామాలతో లోతుగా ముడిపడి ఉంది. ఇటాలియన్ భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి, వాయు పీడనంలో మార్పులు వాతావరణంలో సంభవించే మార్పులతో ముడిపడి ఉన్నాయని గమనించాడు. గాలి పీడనాన్ని కచ్చితంగా కొలవడానికి టోరిసెల్లి 1643లో బేరోమీటర్ను కనుగొన్నాడు. వాతావరణ వ్యవస్థలను అర్థం చేసుకోవడంలోను, అంచనా వేయడంలోను బేరోమీటర్ ఇప్పటికీ కీలకమైన పరికరమే. జర్మన్ భౌతిక శాస్త్రవేత్త డేనియల్ ఫారెన్హీట్ 1714లో పాదరసంతో పనిచేసే థర్మామీటర్ను అభివృద్ధి చేశాడు. ఈ రెండూ ముఖ్యమైన వాతావరణ ఉపకరణాలు, వాతావరణాన్ని కచ్చితంగా కొలవడానికి ఇవి వీలు కల్పించాయి. అమెరికన్ ఆవిష్కర్త శామ్యూల్ మోర్స్ 1800ల కాలంలో టెలిగ్రాఫ్ను కనుగొనే వరకు వాతావరణ డేటాను త్వరగా బదిలీ చేయడానికి మార్గం ఉండేది కాదు. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, వాతావరణ శాస్త్ర కార్యాలయాలు సమాచారాన్ని పంచుకోవడంతోపాటు, మొదటి ఆధునిక వాతావరణ పటాలను తయారు చేయగలిగాయి. ఈ పటాలు ఐసోబార్లు (సమాన వాయు పీడన రేఖలు), ఐసోథెర్ములు (సమాన ఉష్ణోగ్రత రేఖలు) వంటి సంక్లిష్టమైన సమాచార సమితులను కలిపి ప్రదర్శించాయి. ఈ పెద్ద-స్థాయి వాతావరణ పటాలతో, వాతావరణ శాస్త్రవేత్తలు వాతావరణం తాలూకు విస్తృత భౌగోళిక చిత్రాన్ని పరిశీలించి మరింత కచ్చితమైన సూచనలను చేయగలిగారు. నార్వేజియన్ వాతావరణ శాస్త్రవేత్తల బృందం 1920లలో ఆధునిక వాతావరణ అంచనాకు నిర్మాణ విభాగాలైన వాయు ద్రవ్యరాశి, వాయు సరిహద్దులకు సంబంధించిన భావజాలాన్ని అభివృద్ధి చేసింది. మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధాలలో సైనిక కార్యకలాపాలు వాతావరణ శాస్త్రానికి గొప్ప పురోగతిని తెచ్చాయి. వాతావరణంపై అవగాహనను మెరుగుపరచడానికి సైన్యం శిక్షణ, పరిశోధన, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలలో భారీగా పెట్టుబడి పెట్టింది. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలలో అతి ముఖ్యమైనది రాడార్. దీనిని వైమానిక, నౌకల ఉనికి, దిశ, వేగాన్ని గుర్తించడానికి అభివృద్ధి చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుండి, అవపాతం, గాలి నమూనాల ఉనికి, దిశ, వేగాన్ని గుర్తించడానికి రాడార్‌ను ఉపయోగించారు. వాతావరణ శాస్త్రవేత్తలు భారీస్థాయిలో వాతావరణ వ్యవస్థలను పరిశీలించడాన్ని, అంచనా వేయడాన్ని 1950లు, 1960ల నాటి సాంకేతిక పరిణామాలు సులభతరం చేశాయి. కంప్యూటర్లు 1950లలో సంక్లిష్ట సమీకరణాల ద్వారా వందలాది డేటా పాయింట్లను అమలు చేయడం ద్వారా వాతావరణ పరిస్థితుల మొదటి నమూనాలను సృష్టించాయి. ఈ నమూనాలు మన గ్రహాన్ని చుట్టుముట్టే అధిక, అల్ప పీడన వ్యవస్థల శ్రేణి వంటి వాతావరణ అంశాల్ని అంచనా వేయగలిగాయి. మొట్టమొదటి వాతావరణ ఉపగ్రహం అయిన 'టిరోస్ 1' 1962లో అంతరిక్షం నుండి తొలిసారిగా కచ్చితమైన వాతావరణ సూచనను అందించింది. 'టిరోస్ 1' విజయం మరింత అధునాతన ఉపగ్రహాల తయారీని ప్రేరేపించింది. అధునాతన ఉపగ్రహాలు, వాటి డేటాను ప్రాసెస్ చేసే కంప్యూటర్లు నేటి వాతావరణ శాస్త్రంలో ఉపయోగించే ప్రాథమిక సాధనాలు.





- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)

## కిటికీ

# ఐఎండి ప్రస్థానం

భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) ఈ ఏడాదికి సంబంధించిన మొదటి రుతుపవనాల అంచనాను ఏప్రిల్ 15వ తారీఖున విడుదల చేసింది. దేశంలో 2025లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండి అంచనా వేసింది.

భూశాస్త్రాల మంత్రిత్వ శాఖకు చెందిన భారత వాతావరణ కేంద్రం (ఐఎండి) దేశంలో వాతావరణ మార్పుల్ని, భూకంపాలకు సంబంధించిన భౌగోళిక పరిణామాల్ని అధ్యయనం చేస్తుంది. భారత వాతావరణ కేంద్రం ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది. ఈ కేంద్రానికి దేశవ్యాప్తంగా వందలాది అనుబంధ పరిశీలనా కేంద్రాలున్నాయి. దేశంలో మాత్రమే కాకుండా ఐఎండికి అంటార్కిటికాలో కూడా పరిశీలనా కేంద్రం ఉంది. కాగా చెన్నై, ముంబయి, కోల్‌కతా, నాగ్‌పూర్, గువాహతి, తదితర ప్రాంతాలలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ)లో ఐఎండి కూడా భాగస్వామి. ఉత్తర హిందూమహాసముద్ర ప్రాంతానికి సంబంధించిన వర్షాల్ని, వరదల్ని, తుపానుల్ని ముందస్తుగా అంచనా వేయడం, తుపానులకు పేర్లు పెట్టడం ఐఎండి బాధ్యతల్లో కొన్ని మాత్రమే. ఆంగ్లేయ శాస్త్రవేత్త ఎడ్మండ్ హాలీ 1686లో భారతీయ వేసవి రుతుపవనాలపై ఒక గ్రంథాన్ని రచించారు. ఆసియా భూభాగం, హిందూ మహాసముద్రానికి సంబంధించిన ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసమే రుతుపవనాలకు కారణమని ఆయన తన గ్రంథంలో పేర్కొన్నారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 1785లో కలకత్తా అబ్జర్వేటరీ, 1826లో కొలాబా అబ్జర్వేటరీతో సహా పలు వాతావరణ పరిశీలనా కేంద్రాల్ని భారతదేశంలో స్థాపించింది. భారతదేశంలో 19వ శతాబ్ద అర్ధభాగంలో వివిధ ప్రాంతీయ ప్రభుత్వాలు పలు అబ్జర్వేటరీలను స్థాపించాయి. మనదేశంలో 1784లో కలకత్తాలో, 1804లో బొంబాయిలో ఆసియాటిక్ సొసైటీ వాతావరణ శాస్త్ర అధ్యయనాన్ని ప్రోత్సహించింది. హెన్రీ పిడింగ్టన్ 1835,1855ల మధ్య కలకత్తా కేంద్రంగా ఉత్పన్నమయిన ఉష్ణమండల తుపానుల గురించి దాదాపు 40 అధ్యయన పత్రాల్ని ఆసియాటిక్ సొసైటీ పత్రికలో ప్రచురించారు. ఆ పత్రాల్లో ఆయన 'సైక్లోన్' అనే పదాన్ని ఉపయోగించారు. ఆ పదానికి 'చుట్టచుట్టుకున్న పాము' అని అర్థం. కలకత్తాను 1864లో ఉష్ణమండల తుపాను తాకిన తరువాత, రుతుపవనాల వైఫల్యం కారణంగా 1866, 1876 కాలంలో కరువులు సంభవించాయి. ఈ నేపథ్యంలో వాతావరణ పరిశీలనల సేకరణ, విశ్లేషణల్ని ఒకే కేంద్రం ద్వారా నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఫలితంగా భారత వాతావరణ కేంద్రాన్ని 15 జనవరి 1875న స్థాపించారు. హెన్రీ ఫ్రాన్సిస్ బ్లాన్‌ఫోర్డ్ మొట్టమొదటి ఐఎండి వాతావరణ రిపోర్టర్‌గా నియమితులయ్యారు. తరువాత 1889లో కలకత్తాలోని అబ్జర్వేటరీల మొదటి డైరెక్టర్ జనరల్‌గా సర్ జాన్ ఎలియట్ నియమితులయ్యారు. తదనంతర కాలంలో ఐఎండి ప్రధానకార్యాలయం 1905లో సిమ్లాకు, తరువాత 1944లో కొత్తఢిల్లీకి మారింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 27 ఏప్రిల్ 1949న ప్రపంచ వాతావరణ సంస్థలో ఐఎండికి సభ్యత్వం లభించింది. ప్రస్తుతం మృత్యుంజయ్ మహాపాత్ర ఐఎండి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు.

### బొమ్మాబొరుసు?

భారత వాతావరణ కేంద్రానికి ఘనమైన చరిత్రే ఉన్నప్పటికీ, 2001 తరువాత ఐఎండి అంచనాలన్నీ 'బొమ్మాబొరుసు' వ్యవహారం కన్నా అధ్వాన్నంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఐఎండి వారి నివేదికల్లో కచ్చితత్వం లోపిస్తోందన్న ఆరోపణ వినిపిస్తోంది. ఈ కేంద్రం విడుదల చేస్తున్న అంచనాలు ఆర్థిక విశ్లేషణలకు ఎంతమాత్రమూ ఉపయోగకరంగా లేదని విమర్శకులు అంటున్నారు. సగటు వర్షపాత చారిత్రక అంచనాకు సంబంధించిన అంకెను 'లాంగ్ పీరియడ్ ఏవరేజ్' (ఎల్‌పిఎ) అంటారు. ప్రస్తుతం 1971-2020 కాలవ్యవధిని 'ఎల్‌పిఎ'గా నిర్ణయించారు. అయితే ఐఎండి ఈ ఎల్‌పిఎకి సంబంధించి అనేకానేక వర్గీకరణలు చేసింది. ఈ వర్గీకరణల ప్రకారం ఎల్‌పిఎలో నాలుగుశాతం వర్షపాతం నమోదైతే, సాధారణ వర్షపాతం నమోదైనట్టు ఐఎండి చెబుతుంది. కాగా ఈ ఏడాది వర్షపాతాన్ని ఎల్‌పిఎలో 105శాతంగా చెబుతోంది ఐఎండి. ఇది సగటు సాధారణ స్థాయికంటే చాలా ఎక్కువ. 'సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ' సంస్థ 2001 నుంచి 2024 వరకు ఐఎండి అందించిన అంచనాల డేటా మొత్తాన్ని అందుబాటులో ఉంచింది. ఈ ఇరవైనాలుగు వర్షరుతువులకు సంబంధించిన ఐఎండి అంచనాల్లో మొట్టమొదటి అంచనా అబద్ధమని తేలింది. ఆ ఏడాది ఐఎండి అంచనా కంటే ఐదుశాతం పాయింట్లు ఎక్కువగా వర్షాలు కురిశాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే ఐఎండి అంచనాల్లో కేవలం 42శాతం మాత్రమే కచ్చితత్వం ఉందని అర్థమవుతోంది. ఐఎండి వెలువరించిన ఈ నిర్దిష్టకాలపు అంచనాల్లో ఆరు రుతువుల్లో ఎక్కువగాను, ఎనిమిది రుతువుల్లో తక్కువగాను వర్షపాతం నమోదైంది. కాగా 14 అంచనాల్లో కేవలం రెండు మాత్రమే 2024తో అంతమయ్యే ఐదేళ్ళ కాలపరిమితిలో ఐదుశాతం పాయింట్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. అయితే 2019, 2014, 2009లతో అంతమయ్యే ఐదేళ్ళ కాలపరిమితుల్లో వరుసగా నాలుగు, మూడు, మూడు రుతువుల అంచనాలు ఐదుశాతం పాయింట్లకు దగ్గరగా నమోదయ్యాయి. అంటే క్రమంగా ఐఎండి తన అంచనాల ప్రక్రియను మరింత మెరుగుపరుచుకుంటూ వస్తోందని భావించాలి. ప్రాంతీయపరమైన భౌగోళికాంశాల్ని కూడా దృష్టిలోకి తీసుకుంటే ఐఎండి అంచనాలు మరింత మెరుగు పడతాయన్నది నిపుణుల సూచన.



- కల్కి



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.